నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

సూర్య www.suryaa.com 19వ వసంతంలోకి ...

విద్యార్థులకు దిశా నిర్దేశం..నిరుద్యోగులకు మార్గనిర్దేశకం...



APPSC,TSPSC పోటీపరీక్షల గైడెన్స్

నిపుణులైన అధ్యాపకులతో నాణ్యమైన మెటీరియల్

కరెంట్ అఫైర్స్

నమూనా ప్రశ్నాపత్రాలు

విద్యా ఉద్యోగ సమాచారం

'సూర్య' ఆన్‌లైన్ఎడిషన్ www.suryaepaper.com చూడండి.

visit us @ http://epaper.suryaa.com

సంపుటి 19 | సంచిక 70

మంగళవారం | 30 డిసెంబర్ 2025 | హైదరాబాద్

| పేజీలు 10+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం : దక్షిణాయణం - హేమంతరుతువు, పుష్య మాసం శుక్లపక్షం ఏకాదశి రా.1.27, భరణి రా.1.10, వర్జ్యం ఉ.11.42 నుంచి 1.11 వరకు
రాహుకాలం మ.3.00 నుంచి 4.30 వరకు దుర్ముహూర్తం ఉ.8.29 నుంచి 9.13 వరకు తిరిగి రా.10.30 నుంచి 11.22 వరకు

### ఆరావళి మైనింగ్‌కు

## సుప్రీం నో

● గతంలో ఇచ్చిన ఉత్తర్వులను నిలిపివేస్తూ స్టే

● సుప్రీం కోర్టు ఆదేశాలు స్వాగతించిన కేంద్రం, కాంగ్రెస్

ఆరావళి పర్వతాల్లో గనుల తవ్వకాలపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీచేసింది. 100 మీటర్లలోపు ఉన్న ఆరావళి పర్వతాల వద్ద మైనింగ్‌కు అనుమతులు ఇస్తూ గతంలో ఇచ్చిన ఉత్తర్వులను నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. తదుపరి ఉత్తర్వుల వరకూ గత ఆదేశాలను నిలిపివేస్తూ సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం తాజాగా నిర్ణయం తీసుకుంది. ఆరావళి పర్వతాలకు సంబంధించి సుప్రీంకోర్టు ఆమోదించిన నిర్వచనంపై వివాదం చెలరేగడంతో ఈ అంశాన్ని సుమోటోగా స్వీకరించి అత్యున్నత న్యాయస్థానం విచారణ చేపట్టింది.



6లో

### మాజీ సీఎం కేసీఆరే

## సమాధానం ఇస్తారు

● కేసీఆర్‌తో ఏం మాట్లాడారని ప్రశ్నించిన జర్నలిస్టులు

● మీకెందుకు చెబుతామని సమాధానం ● అసెంబ్లీ నుంచి కేసీఆర్ వెళ్లిపోవడంపై ఆగ్రహం ● కేసీఆర్ సమాధానమిస్తారంటూ వ్యంగ్యాస్త్రం

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీకి వచ్చిన వెంటనే కేవలం ఐదు నిమిషాల్లోనే తిరిగి వెళ్లిపోయిన విషయం తెలిసిందే. ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. ఆసక్తికర సమాధానం ఇచ్చారు సీఎం. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీ నుంచి ఎందుకు వెళ్లిపోయారో తెలీదని.. ఈ ప్రశ్న ఆయననే అడగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ లాబీలో మీడియా ప్రతినిధులకు సీఎం ఎదురుపడ్డారు. ఈ సందర్భంగా అసెంబ్లీ నుంచి కేసీఆర్ వెళ్లిపోవడంపై ముఖ్యమంత్రిని జర్నలిస్టులు ప్రశ్నించారు.



2లో

### తుది దశకు ఉక్రెయిన్-రష్యా

## శాంతి ఒప్పందం

● దాదాపు నాలుగేళ్లుగా సాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధం

● 90 శాతం అంగీకారం కుదిరినట్లు చెప్పిన జెలెన్‌స్కీ

● ఇక యుద్ధం ముగింపే తరువాయంటూ ట్రంప్ ఆనందం



6లో

ఉక్రెయిన్- రష్యా యుద్ధానికి ముగింపు పలికే శాంతి ఒప్పందానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలు కీలక దశకు చేరుతున్నట్లు కనిపిస్తున్నాయి. ఉక్రెయిన్ రష్యా శాంతి ఒప్పందం తుది దశకు చేరుకున్నట్లు ట్రంప్ వెల్లడించారు. ఈ భీకర యుద్ధం రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అత్యంత భయంకరమైనదిగా ట్రంప్ అభివర్ణించారు. దీనికి ముగింపు పలకడమే తన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం ఫ్లోరిడాలోని మార్-ఏ-లాగో క్లబ్‌లో శాంతి ఒప్పందంపై చర్చించేందుకు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ట్రంప్ భేటీ అయ్యారు.

## నష్టాల్లో స్టాక్ మార్కెట్‌లు

● 345 పాయింట్లు పడిపోయిన సెన్సెక్స్ ● కీలకమైన 26,000 మార్కు కిందకు చేరిన నిఫ్టీ ● ఐటీ, రియల్టీ, ఆటో షేర్లలో అమ్మకాల ఒత్తిడి ● నెలవారీ ఎఫ్ & ఓ గడువుతో పెరిగిన ఒడిదొడుకులు



5లో

## తెలుగు రాష్ట్రాల మీదుగా రెండు ఆసియా హైవేలు

మొత్తం 32 దేశాల మీదుగా రాకపోకలు

తెలుగు రాష్ట్రాల మీదుగా వెళ్లే రెండు జాతీయ రహదారులకు ఆసియా హైవే (ఏహెచ్)లుగా కూడా గుర్తింపు ఉందనేది మీకెవరికైనా తెలుసా? వివిధ దేశాల మీదుగా సరకు రవాణా చేసేందుకు, రోడ్డు మార్గంలో పలు దేశాలు చుట్టేయాలనుకునే పర్యాటకులు సులువుగా గుర్తించేందుకు వీలుగా ఆసియా హైవేల నంబర్లు దోహదపడతాయి.



3లో

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

### బీసీలపై ఎందుకీ

## కుట్రలు

● స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లు తగ్గింపు అక్రమాలు అవకతవకలు ● ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపుపై నిర్లక్ష్యం ● హాస్టల్స్-గురుకుల పాఠశాలలో విద్యార్థుల అనారోగ్యం మరణాలు ● బీసీ నేత, ఎంపీ ఆర్.కృష్ణయ్య ప్రతిపక్షాలకు బహిరంగ లేఖ

గ్రామపంచాయతీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానంకు భిన్నంగా బీసీల రిజర్వేషన్లను 42 శాతం నుంచి 22 శాతం తగ్గించి అమలు చేయడంలో 17శాతంకు తగ్గించి తీవ్ర అవకతవకలకు పాల్పడ్డారు.



2లో

## ఢిల్లీని కమ్మేసిన పొగమంచు

● విమానాలు రద్దు, రైళ్లు ఆలస్యం ● తీవ్రంగా ప్రభావితమైన వాయుకాలుష్యం ● ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

వివరాలు-6లో



## ఐక్యరాజ్య సమితి ఘోర వైఫల్యం




2లో

● మా దేశమే నిజమైన యుఎన్‌గా మారింది ● ఇప్పటి వరకు ఎనిమిది యుద్ధాలను ఆపేశాను ● డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

### టాటా-ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్‌లో

## అగ్నిప్రమాదం

● సోమవారం తెల్లవారుజాము 1.30 గంటల సమయంలో ఘటన ● బీ1, ఎం2 ఏసీ బోగీలు పూర్తిగా దగ్ధం ● చలిలో సుమారు 2,000 మంది ప్రయాణికులు స్టేషన్‌లో పడిగాపులు ● రెండు గంటల పాటు శ్రమించి మంటలార్పిన ఫైర్ సిబ్బంది ● వృద్ధుడు సజీవ దహనం



3లో

## అంతా ఇంతే!




వాస్తు జ్యోతిష్కుడు అంతకన్నా ఎక్కువ సేపు ఉండొద్దని చెప్పారేమో

### ఐదు నిమిషాలకే సభ నుంచి

## కేసీఆర్ బయటికి



2లో

కేసీఆర్ వద్దకు వెళ్లి పలకరించిన సీఎం రేవంత్, మంత్రులు

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు దివంగత మాజీ ఎమ్మెల్యేలు రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, కొండా లక్ష్మారెడ్డిలకు సంతాప తీర్మానాలను సభలో ప్రవేశపెట్టారు. అనంతరం సభ్యులు సంతాపం తెలిపారు. ఈ సమావేశాలకు సీఎం రేవంత్‌రెడ్డి, ప్రతిపక్ష నేత కేసీఆర్ తో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీ నుంచి వెళ్లిపోయారు.

### హరీశ్‌రావువి దిగజారుడు

## మాటలు

● కృష్ణా జలాల్లో 90 టీఎంసీలు డిమాండ్ చేశాం ● తాము 45 టీఎంసీలు మాత్రమే అడిగామని దుష్ప్రచారం ● అబద్ధాల పునాదులపై బీఆర్ఎస్ బతుకుతోంది ● శాసన సభలో సాగునీటి జలాలపై చర్చ సందర్భంగా మంత్రి ఉత్తమ్

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సాగునీటి జలాలపై చర్చ జరిగింది. చర్చలో భాగంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడారు. ఈ నేపథ్యంలో మాజీమంత్రి హరీశ్‌రావుపై మంత్రి ఉత్తమ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.



2లో

### తెలంగాణలో

## కేరళ మోడల్

● కేరళ తరహాలో అత్యంత పేదరిక నిర్మూలన కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తాం ● అత్యంత పేదలను గుర్తించడంలో మహిళా సంఘాలు భాగస్వాములు కావాలి ● ప్రజా భవన్‌లో జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షుల సమావేశంలో మంత్రి సీతక్క



2లో

తెలంగాణ అసెంబ్లీ

# 5 నిముషాల్లోనే సభ నుంచి వెళ్లిపోయిన కేసీఆర్

## కేసీఆర్ వద్దకు వెళ్లి పలకరించిన సీఎం రేవంత్

తెలంగాణ బ్యూరో్ప్రతినిధి: తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు దివంగత మాజీ ఎమ్మెల్యేలు రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, కొండా లక్ష్మారెడ్డిలకు సంతాప తీర్మానాలను సభలో ప్రవేశపెట్టారు. అనంతరం సభ్యులు సంతాపం తెలిపారు. ఈ సమావేశాలకు సీఎం రేవంత్‌రెడ్డి, ప్రతిపక్ష నేత కేసీఆర్ తో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీ నుంచి వెళ్లిపోయారు. సభ ప్రారంభమైన ఐదు నిమిషాల్లోనే బీఆర్ఎస్ అధినేత తిరుగుపయనమయ్యారు. సంతాప తీర్మానాలు ముగిసిన వెంటనే కేసీఆర్ అసెంబ్లీ నుంచి వెళ్లిపోయారు. కాగా.. సోమవారం ఉదయం నందినగర్‌లోని నివాసం నుంచి అసెంబ్లీకి చేరుకున్నారు కేసీఆర్. ఈ సందర్భంగా మాజీ సీఎంకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్వాగతం పలికారు. ఆపై కేసీఆర్‌ను ఎమ్మెల్యేలు సభలోకి తీసుకెళ్లారు. కేసీఆర్ వెళ్లిన కాసేపటికే తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. మిగతా సభ్యులు అందరికంటే ముందుగానే కేసీఆర్ వెళ్లి తన చైర్‌లో కూర్చున్నారు. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ హాల్లోకి రాగానే కేసీఆర్ దగ్గరికి వెళ్లి కరచాలనం చేశారు. అలాగే సీఎం తర్వాత మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా కేసీఆర్ దగ్గరికి వెళ్లి కరచాలనం చేశారు. ఆపై సభ ప్రారంభం కాగానే కొద్దిసేపు మాత్రమే సభలో ఉన్నారు కేసీఆర్. తర్వాత మాజీ మంత్రి హరీష్ రావుతో పాటు బయటికి వచ్చారు. అనంతరం అసెంబ్లీ నుంచి తిరిగి నందినగర్ నివాసానికి గులాబీ బాస్ వెళ్లిపోయారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా కేసీఆర్ దగ్గరకు వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ దగ్గరికి వెళ్ళి బాగున్నారా అని సీఎం పలకరించగా.. తిరిగి బాగున్నాను అంటూ రేవంత్‌కు కేసీఆర్ సమాధానం ఇచ్చారు. అలాగే కేసీఆర్‌ను మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్‌లు బీర్ల ఐలయ్య, సీపీఐ ఎమ్మెల్యే కునమనేని సాంబశివరావు కలిసి కరచాలనం చేశారు.



# హరీశ్‌రావువి దిగజారుడు మాటలు



- కృష్ణా జలాల్లో 90టీఎంసీ డిమాండ్ చేశాం
- తాము 45 టీఎంసీ మాత్రమే అడిగామని దుష్ప్రచారం
- అబద్ధాల పునాదులపై బీఆర్ఎస్ బతుకుతోంది
- శాసన సభలో సాగునీటి జలాలపై చర్చ సందర్భంగా మంత్రి ఉత్తమ్

తెలంగాణ బ్యూరో్ప్రతినిధి: తెలంగాణ అసెంబ్లీ సమావేశా సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సాగునీటి జలాలపై చర్చ జరిగింది. చర్చలో భాగంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడారు. ఈ నేపథ్యంలో మాజీమంత్రి హరీశ్‌రావుపై మంత్రి ఉత్తమ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీశ్‌రావు దిగజారుడు మాట మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ఇరిగేషన్‌లో తానే మాస్టర్‌నని ఆయన అనుకుంటున్నారని విమర్శించారు. హరీశ్‌రావుకు అంత అహంకారం ఎందుకు? అని ప్రశ్నించారు. ఎవరి హయాంలో ఏం జరిగిందో అంతా బయటపెడతామని స్పష్టం చేశారు. కృష్ణా జలాల్లో తాము 90టీఎంసీ డిమాండ్ చేశామని చెప్పుకొచ్చారు. తాము 45 టీఎంసీ మాత్రమే అడిగామని హరీశ్?రావు దుష్ప్రచారం చేశారని ఫైర్ అయ్యారు. అబద్ధాల పునాదులపై బీఆర్ఎస్ బతుకుతోందని ఎద్దేవా చేశారు. ఒక అబద్ధాన్ని పదే పదే చెబుతూ.. అదే నిజం అవుతుందనుకుంటున్నారని మండిడ్డారు. సీడబ్ల్యూకి రాసిన లేఖలో ఓ పేరాగ్రాఫ్?ను అవుటాఫ్ కాంటెక్స్ట్? తీసుకొస్తున్నారని చెప్పుకొచ్చారు. తెలంగాణకు అన్యాయం జరిగేలా తానెందుకు లేఖ రాస్తా? అని ప్రశ్నించారు. సీడబ్ల్యూకి రాసిన లేఖలో ఒక భాగాన్నే చూపిస్తున్నారని.. కృష్ణా బేసిన్?పై అసెంబ్లీలో ప్రెజెంటేషన్?కు తాము సిద్ధమని స్పష్టం చేశారు. మేడిగడ్డ పునర్నిర్మాణం పనులకు డెడ్?లైన్ పెట్టామని పేర్కొన్నారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.బీఆర్ఎస్ నేతల చేతకాని తనాన్ని తమపై రుద్దవద్దని హితవు పలికారు. వారు ప్రజలను మభ్యపెట్టాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. సాగునీటి జలాలపై డీపీఆర్?ను కేంద్రానికి పంపడానికి ఏడేళ్ల సమయం ఎందుకు తీసుకున్నారని ప్రశ్నల వర్షం కురిపించారు. డీపీఆర్? పంపే సమయానికి రూ.21 వేల కోట్లు ఖర్చు చేశారని చెప్పుకొచ్చారు. ఉమ్మడి పాలమూరు, నల్లగొండ, ఖమ్మం జిల్లాలకు..అన్యాయం చేస్తున్నామంటూ బీఆర్ఎస్ నేత గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. హరీశ్?రావును చూసి గోబెల్స్ కూడా సిగ్గుతో తలదించుకుంటారని ఎద్దేవా చేశారు. పాలమూరు – రంగారెడ్డిలో 90 టీఎంసీలకు ప్రతిపాదించారని గుర్తుచేశారు. 45 టీఎంసీల మైనర్ ఇరిగేషన్, 45 టీఎంసీల గోదావరి డైవర్షన్ అని వాదారని చెప్పుకొచ్చారు. వాళ్లు ఇచ్చిన జీవోనే తాము ప్రస్తావిస్తూ లేఖ రాశామని స్పష్టం చేశారు. తొత మైనర్ ఇరిగేషన్?ను క్లియర్ చేయమని అడిగామని అన్నారు. పేజ్ –1లో ఇన్షియల్?గా చేయమని అడిగామని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ నేత సుప్రీంకోర్టులో 7 టీఎంసీలకు ఒప్పుకుని వచ్చారని ప్రస్తావించారు. కేసీఆర్ హయాంలోని పదేళ్లలో పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టును ఎందుకు పూర్తిచేయలేకపోయారని ప్రశ్నించారు. తాము మాత్రం పూర్తిచేసి పాలమూరు ప్రాంతానికి నీరు అందిస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# సీఎం రేవంత్ ఆసక్తికర సమాధానం

- కేసీఆర్‌తో ఏం మాట్లాడారని ప్రశ్నించిన జర్నలిస్టులు
- మీకెందుకు చెబుతామని సమాధానం
- అసెంబ్లీ నుంచి కేసీఆర్ వెళ్లిపోవడంపై ఆగ్రహం
- దీనికి కేసీఆర్ సమాధానమిస్తారంటూ వ్యంగ్యాస్త్రం



తెలంగాణ బ్యూరో్ప్రతినిధిః మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీకి వచ్చిన వెంటనే కేవలం ఐదు నిమిషాల్లోనే తిరిగి వెళ్లిపోయిన విషయం తెలిసిందే. ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. ఆసక్తికర సమాధానం ఇచ్చారు సీఎం. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీ నుంచి ఎందుకు వెళ్లిపోయారో తెలీదని.. ఈ ప్రశ్న ఆయననే అడగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ లాబీలో మీడియా ప్రతినిధులకు సీఎం ఎదురుపడ్డారు. ఈ సందర్భంగా అసెంబ్లీ నుంచి కేసీఆర్ వెళ్లిపోవడంపై ముఖ్యమంత్రిని జర్నలిస్టులు ప్రశ్నించారు. అలాగే ప్రతిపక్ష నేత కేసీఆర్‌తో ఏం మాట్లాడారని వారు అడిగారు. దీనిపై సీఎం స్పందిస్తూ.. కేసీఆర్, తాను మాట్లాడుకున్నది మీకెందుకు చెబుతామని చమత్కరిస్తూ సమాధానం ఇచ్చారు.

అంతేకాకుండా అసెంబ్లీకి వచ్చిన వెంటనే కేవలం 5 నిమిషాల్లోనే కేసీఆర్ ఎందుకు వెళ్లిపోయారో ఆయన్నే అడగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఆపై వేరే విషయాలపై మీడియాతో సీఎం మాట్లాడుతూ.. అసెంబ్లీ లాబీని పార్లమెంట్ సెంట్రల్ హాల్ మాదిరిగా తీర్చిదిద్దుతామని చెప్పారు. మాజీ ఎమ్మెల్యేలు, మీడియా ప్రతినిధులకు యాక్సెస్ కల్పిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యేలలకు సెంట్రల్ హాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. బడ్జెట్ సమావేశాల వరకు మండలిని పూర్తి చేయాలని అనుకుంటున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మీడియాతో చిట్‌చాట్ అనంతరం అసెంబ్లీలోని తన ఛాంబర్‌కు చేరుకున్నసీఎం.. మంత్రులు, ప్రభుత్వ విప్‌లతో భేటీ అయ్యారు. అసెంబ్లీలో తమ స్ట్రాటజీపై నేతలకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.



# ముగిసిన బీఏసీ సమావేశం

- సభ 15 రోజులు జరపాలని పట్టు పట్టాం
- వారం రోజులు జరుపుతామన్న ప్రభుత్వం
- పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు అనుమతి ఇవ్వాలని అడిగాం
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు

తెలంగాణ బ్యూరో్ప్రతినిధి : తెలంగాణ శాసనసభ శీతాకాల సమావేశాల నిర్వహణపై స్పష్టతనిచ్చేందుకు నిర్వహించిన బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ తరపున మాజీ మంత్రి హరీష్ రావు పాల్గొని, సభ నిర్వహణ తీరుపై పలు కీలక డిమాండ్లను ప్రభుత్వం ముందుంచారు. ముఖ్యంగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం సభను ఎక్కువ రోజులు నిర్వహించాలని ఆయన గట్టిగా పట్టుబట్టారు. బీఏసీ సమావేశం అనంతరం హరీష్ రావు మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో చర్చించాల్సిన అంశాలు చాలా ఉన్నాయని, అందుకే అసెంబ్లీని కనీసం 15 రోజుల పాటు నిర్వహించాలని తాము డిమాండ్ చేసినట్లు తెలిపారు. కేవలం వారం రోజుల్లో ప్రజా సమస్యలన్నింటిపై చర్చించడం సాధ్యం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం కేవలం మూడు లేదా నాలుగు రోజులతో సభను ముగించే ప్రయత్నం చేయకూడదని ఆయన స్పష్టం చేశారు. ప్రతిపక్షాల డిమాండ్లపై ప్రభుత్వం స్పందిస్తూ.. ప్రస్తుతం ఒక వారం పాటు సమావేశాలను నిర్వహించేందుకు అంగీకరించింది. అయితే, ఆ తర్వాత పరిస్థితులను బట్టి సమావేశాలను మరిన్ని రోజులు పొడిగించే అంశంపై మరోసారి బీఏసీ సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చినట్లు హరీష్ రావు వెల్లడించారు. దీనివల్ల సభ ఎన్ని రోజులు జరుగుతుందనే దానిపై ఇంకా పూర్తిస్థాయి స్పష్టత రావాల్సి ఉంది.నదీ జలాల అంశంపై సభలో ఇప్పటికే రాజకీయం వేడెక్కింది. ప్రభుత్వం ఈ అంశంపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చేందుకు సిద్ధమవుతుండగా, ప్రతిపక్ష బీఆర్ఎస్ కూడా తాము కూడా పీపీటీ ఇచ్చేందుకు అవకాశం కల్పించాలని బీఏసీ సమావేశంలో కోరింది. గత ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధిని, ప్రాజెక్టుల వివరాలను ప్రజలకు వివరించేందుకు తమకు కూడా సమాన అవకాశం ఇవ్వాలని హరీష్ రావు కోరారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన తొలిరోజే బీఏసీలో జరిగిన ఈ చర్చలు చూస్తుంటే, రాబోయే రోజుల్లో సభలో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం మరింత ముదిరేలా కనిపిస్తోంది. వారం రోజుల సమావేశాల్లో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుంది, ప్రతిపక్షం ప్రభుత్వంపై ఎలాంటి అస్త్రాలను ప్రయోగిస్తుందనేది వేచి చూడాలి.

# తెలంగాణలో కేరళ మోడల్

- కేరళ తరహాలో అత్యంత పేదరిక నిర్మూలన కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తాం
- అత్యంత పేదలను గుర్తించడంలో మహిళా సంఘాలు భాగస్వాములు కావాలి
- ప్రజా భవన్‌లో జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షుల సమావేశంలో మంత్రి సీతక్క



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : హైదరాబాద్ ప్రజా భవన్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షుల సమావేశంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి మహిళా శిశ్ సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ తో కలిసి జిల్లాల వారిగా గత నెల రోజులపాటు మహిళా సంఘాలు, సమాఖ్యలు నిర్వహించిన కార్యకలాపాలను మంత్రి సీతక్క సమీక్షించారు.సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ, నూతన సంవత్సరంలో మహిళా స్వయం సహాయక బృందాలు నూతన లక్ష్యంతో, మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఇప్పటివరకు మహిళా సంఘాలు తమను తాము అభివృద్ధి చేసుకుంటూ ముందుకు సాగాయని, ఇకపై వారి బాధ్యత మరింత పెరిగిందని తెలిపారు.కేరళ తరహాలో అత్యంత పేదరికంలో ఉన్న వారిని గుర్తించడంలో గ్రామైక్య సంఘాలు కీలక పాత్ర పోషించాలని మంత్రి సూచించారు. అత్యంత పేదరికంలో ఉన్న "పూరెస్ట్ ఆఫ్ ద పూర్"ను టార్గెట్‌గా గుర్తించి, వారిని ఆ స్థితి నుంచి బయటకు తీసుకురావడం ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో అత్యంత వెనుక బాటలో ఉన్న కుటుంబాలను గుర్తించి, వారి అవసరాలను అర్థం చేసుకొని ప్రభుత్వానికి నివేదిస్తే..టార్గెట్‌గా వారి అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని స్పష్టం చేశారు. సంక్షేమ ఫలాలు ఇప్పటివరకు అందని చివరి వ్యక్తికి కూడా ప్రభుత్వ సహాయం చేరేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మీ పరిసరాల్లో, మీ గ్రామాల్లో అత్యంత పేదరికంలో జీవిస్తున్న కుటుంబాలను గుర్తించి, వారికి ఏ అవసరాలు ఉన్నాయో తెలియజేస్తే ప్రభుత్వం తప్పకుండా వారిని ఆదుకుంటుంది అని తెలిపారు. అత్యంత పేదరికంలో ఉన్న కుటుంబాలను గుర్తించేందుకోసం అవసరమైన ప్రొఫార్మాను త్వరలోనే అందజేస్తామని చెప్పారు.ఈ సందర్భంగా కేరళలో అత్యంత పేదరికానీ నిర్మూలన ఎలా చేపట్టారో మహిళా సంఘాలకు మంత్రి సీతక్క వివరించారు. అక్కడ సర్వే ద్వారా 64,006 అత్యంత పేద కుటుంబాల్లో సుమారు లక్ష మంది తీవ్రమైన పేదరికంలో ఉన్నవారిగా గుర్తించారని చెప్పారు.

ఆహారం, ఆరోగ్యం, జీవనోపాధి, గృహ నిర్మాణం వంటి అంశాలను ఆధారంగా తీసుకొని బతుకు కష్టంగా ఉన్న కుటుంబాలను అత్యంత పేదలుగా గుర్తించి, ప్రతి కుటుంబానికి వేర్వేరు అవసరాలున్నాయని, అందు కోసం ప్రత్యేక మైక్రో ప్లాన్‌లను రూపొందించారని, అదేవిధంగా తెలంగాణలో కూడా అత్యంత పేద కుటుంబాలను పేదరికం నుంచి బయటకు తీసుకొచ్చేందుకు మైక్రో ప్లాన్ ను రూపొందిస్తామని చెప్పారు.ఆయా కుటుంబాలకు కేరళా తరహాలో గుర్తింపు కార్డులు, ఇళ్లు, ఉపాధి అవకాశాలు, వైద్య సంరక్షణ వంటి సహాయాలను అందిస్తామని తెలిపారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ చొరవతో అన్ని ప్రభుత్వ విభాగాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలను సమీకరించి ఈ లక్ష్యాన్ని కేరళ సాధించిందని.. అదే తరహాలో తెలంగాణలో మహిళా సంఘాలు ముందుకు వచ్చి అత్యంత పేదరిక నిర్మూలనలో భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు.ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో సర్పంచులుగా ఎన్నికైన సూర్యాపేట, వనపర్తి జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సరిత, స్వరూపలను మంత్రి సీతక్క సన్మానించారు.మహిళల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తున్న ను అభినందించారు. జిల్లా మహిళా సమాఖ్యలు ఏర్పాటు చేసిన నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేసి మహిళా సంఘ సభ్యులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

# మాజీ సర్పంచ్‌ల అసెంబ్లీ ముట్టడి యత్నం

- గ్రామాభివృద్ధి కోసం తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేకపోతున్నామని ఆవేదన
- పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరిన మాజీ సర్పంచ్‌లు



తెలంగాణ బ్యూరో్ప్రతినిధి: తెలంగాణ అసెంబ్లీ ముట్టడికి ప్రయత్నించిన మాజీ సర్పంచ్‌లను పోలీసులు అడ్డుకున్నారు. అయితే, తమ పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలంటూ డిమాండ్ చేస్తూ మాజీ సర్పంచ్‌లు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో అసెంబ్లీ వైపు కదులుతున్న వారిని గన్‌పార్క్ దగ్గర పోలీసులు అరెస్ట్ చేశారు. పలువురు మాజీ సర్పంచ్‌లను అదుపులోకి తీసుకుని అఫ్జల్ గంజ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌లు మీడియాతో మాట్లాడుతూ తమ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం వ్యక్తిగతంగా అప్పులు తెచ్చి రెండేళ్లు అవుతోంది.. ప్రభుత్వం నుంచి రావాల్సిన బిల్లులు ఇప్పటి వరకు రాలేదని వాపోయారు. తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. మా పెండింగ్ బిల్లులు చెల్లించి మా ప్రాణాలు కాపాడాలని ముఖ్యమంత్రికి వేడుకుంటున్నారు. బిల్లులు చెల్లించకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం అన్యాయం.. గ్రామాల అభివృద్ధి కోసం చేసిన పనులకు డబ్బులు ఇవ్వకపోవడం వల్ల సర్పంచ్‌లుగా ఆర్థికంగా కుంగిపోయామని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని.. అప్పుల భారంతో ఇబ్బంది పడుతున్న మమ్మల్ని ఆదుకోవాలని మాజీ సర్పంచ్‌లు డిమాండ్ చేశారు.




## ప్రజా భవన్‌లో ప్రవాసీ ప్రజావాణి కేంద్రం ఏర్పాటు

- గల్ఫ్ సమస్యలు పరిష్కారం చేస్తున్నాం
- శాసన సభలో మంత్రి పొన్నం ప్రభాకర్



తెలంగాణ బ్యూరో్ప్రతినిధిః ప్రవాసీ ల సమస్యలు వినడానికి ప్రజా భవన్ లో ప్రవాసీ ప్రజావాణి కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, గల్ఫ్ సమస్యలు పరిష్కారం చేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. సోమవారం శాసన సభలో మంత్రి పొన్నం మాట్లాడారు. టామ్ కం ద్వారా విదేశాల్లో యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి వారిలో ఉన్న నైపుణ్యాలను బట్టి వారికి ఉపాధి అవకాశాలు వస్తున్నాయి. టామ్ కమ్ ద్వారా మాత్రమే విదేశాలకు వెళ్ళాలని విజ్ఞప్తి. బోగస్ ఏజంట్లను నమ్మి మోసపోవద్దు. టామ్ కం శిక్షణ తీసుకొని విదేశాల్లో ఉపాధి అవకాశాలు పెంచుకోవాలి అని మంత్రి పొన్నం తెలిపారు.

# రాష్ట్రంలో సరిపడా యూరియా నిల్వలు

- యూరియా సరఫరాలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు రానీయద్దు ఇప్పటికే కేంద్రం నుండి 5.44 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా వచ్చింది
- గత సీజన్ కంటే 92 వేల మెట్రిక్ టన్నులు అధికంగా అమ్మకాలు
- 5 జిల్లాల్లో ఫెర్టిలైజర్ యాప్ ప్రయోగం విజయవంతం
- కేవలం 9 రోజుల్లో 2,01,789 బస్తాల యూరియా యాప్ ద్వారా రైతుల కొనుగోలు
- జిల్లా కలెక్టర్లతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వీడియో కాన్ఫరెన్స్
- పాల్గొన్న చీఫ్ సెక్రటరీ మరియు స్పెషల్ చీఫ్ సెక్రటరీ



రాష్ట్ర రైతులకు రబీ సీజన్ కోసం అవసరమైనంత యూరియా నిల్వ రాష్ట్ర ప్రభుత్వ వద్ద పూర్తిగా అందుబాటులో ఉందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఫెర్టిలైజర్ (యూరియా) యాప్, యూరియా పంపణీలపై చీఫ్ సెక్రటరీ మరియు స్పెషల్ చీఫ్ సెక్రటరీ వీడియో కాన్ఫరెన్స్ కలిసి మంత్రిగారు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ ఈ రబీకి కేంద్ర ప్రభుత్వం మొత్తం 10.40 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించగా, అక్టోబర్ నుండి డిసెంబర్ వరకు రావాల్సిన 5.60 లక్షల మెట్రిక్ టన్నులకు గాను 5.70 లక్షల మెట్రిక్ టన్నులు ఇప్పటికే రాష్ట్రానికి చేరుకున్నాయని వివరించారు.గత సంవత్సరం ఇదే సమయానికి 2.81 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అమ్మకాలు జరగగా, ఈ సీజన్‌లో రోజుకు సగటుగా 8,692 మెట్రిక్ టన్నుల చొప్పున మొత్తం 3.72 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రైతులు కొనుగోలు చేశారని, ఇది గత సీజన్ కంటే 92 వేల మెట్రిక్ టన్నులు అధికం అని మంత్రిగారు పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 2.15 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వగా ఉన్నట్లు తెలిపారు.వ్యవసాయశాఖ ప్రవేశపెట్టిన ఫెర్టిలైజర్ (యూరియా) యాప్ ను ఆదిలాబాద్, మహబూబ్ నగర్, జనగామ, నల్లగొండ, పెద్దపల్లి జిల్లాల్లో డిసెంబర్ 20 నుండి అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు ఈ ఐదు జిల్లాల్లో 82,059 మంది రైతులు యాప్ ద్వారా యూరియా బుకింగ్ చేసి 2,01,789 యూరియా బస్తాలు కొనుగోలు చేశారు. యాప్ ప్రారంభించిన కేవలం 9 రోజుల్లోనే ఈ జిల్లాల్లో రోజుకు 22,000కు పైగా బస్తాలు పంపిణీ అయ్యాయని తెలిపారు.ఈ సందర్భంగా యూరియా యాప్ అమలులో ఉన్న జిల్లాల కలెక్టర్లతో మంత్రి మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. అప్పుడప్పుడు కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తినా వెంటనే పరిష్కరిస్తున్నారని, రైతులు కూడా యూరియా యాప్ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు. యాప్ అనేది కేవలం రైతుల సౌకర్యార్థం తెచ్చినది మాత్రమే, దీని ద్వారా యూరియా అమ్మకాలు పారదర్శకంగా జరుగుతున్నాయని మంత్రి తెలిపారు. ఇప్పటికే కపాస్ కిసాన్ యాప్ ద్వారా రైతులు పత్తి అమ్మకాలు సులభంగా చేసుకోగలుగుతున్నారని, అదే దిశలో ఈ యాప్ ని తీసుకురావడం జరిగిందని తెలియజేశారు.యాప్ అమలులో ఉన్న జిల్లాలు కాని, అమలులో లేని జిల్లాలలో కాని యూరియా సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని మంత్రి ఆదేశించారు.

జిల్లాల వారీగా యూరియా స్టాక్, డిమాండ్, పంపిణీపై జిల్లా కలెక్టర్లు నిశితంగా పర్యవేక్షించాలని, అవసరమైతే అదనపు సేల్స్ పాయింట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. యూరియా పంపిణీపై మండల, డివిజన్, జిల్లా స్థాయిలో ప్రత్యేక పర్యవేక్షణ బృందాలను నియమించాల్సిందిగా సూచించారు. యూరియా పంపిణీలో ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే పరిష్కరించాలని, పర్యవేక్షణలో ఎటువంటి అలసత్వం ఉండకూడదన్నారు.రాష్ట్రంలో యూరియా లభ్యతపై రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రాష్ట్ర ప్రభుత్వం దగ్గర రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని మంత్రి స్పష్టం చేశారు. అదేవిధంగా రైతుల సౌకర్యార్థం వ్యవసాయ కమిషనరేట్ లో టోల్ ఫ్రీ నెం. 18005995779 ఏర్పాటు చేయడమైనదని తెలియజేశారు.అనంతరం చీఫ్ సెక్రటరీ గారు మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలు ఉదయాన్నే తెరిచేలా చర్యలు తీసుకోవాలని, స్టాక్ వివరాలు ఎప్పటికప్పుడు తెప్పించుకొని, సాయంత్రం జిల్లా అధికారులతో సమీక్ష చేయాలని, రైతులకు యూరియా సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. అలాగే స్పెషల్ చీఫ్ సెక్రటరీ సబ్యసాచి ఘోష్ గారు మాట్లాడుతూ.. ప్రతి పిఏసిఎస్ సెంటర్లలో మూడు నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేయాలని, రైతుల సౌకర్యం కోసం శామియానా, త్రాగునీరు లాంటి సదుపాయాలు అందుబాటులో ఉంచాలని అన్నారు.ఈ సమావేశంలో వ్యవసాయశాఖ సెక్రటరీ సురేంద్ర మోహన్, వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి, మార్క్ ఫెడ్ ఎండీ శ్రీనివాస్ రెడ్డి, కోఆపరేటీవ్ అడిషనల్ రిజిస్ట్రార్ చంద్రమోహన్ రెడ్డి మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అసెంబ్లీకి చేరిన కోతుల పంచాయతీ

## ప్రభుత్వానికి స్పీకర్ సూచన



హైదరాబాద్: కాంగ్రెస్ నేత, డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రు నాయక్ గ్రామాల్లోని కోతుల సమస్యను అసెంబ్లీ వేదికగా ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. సోమవారం (డిసెంబర్ 29) అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ.. తండాలు, గ్రామీణ ప్రాంతాల్లో కోతుల సంఖ్య బాగా పెరిగిపోయిందని.. టమాటా, మొక్కజొన్న వంటి పంటలను కోతులు ధ్వంసం చేస్తున్నాయని తెలిపారు. దీంతో రైతులు నష్టపోతున్నారని అన్నారు. కోతుల బెడదను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా పురపాలక ప్రాంతాల్లో వీధి కుక్కల సమస్య బాగా పెరిగిపోయిందని.. రాత్రి వేళల్లో గుంపులుగా సంచరిస్తూ మనుషులపై దాడులు చేస్తున్నాయన్నారు. వీధి కుక్కలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే రామచంద్రు నాయక్ చెప్పిన అంశాలను పరిగణలోకి తీసుకుంటున్నట్లు మంత్రి సీతక్క పేర్కొన్నారు. అనంతరం స్పీకర్ గడ్డం ప్రసాద్ మాట్లాడుతూ.. కోతుల విషయంలో ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో కోతుల బెడద ఎక్కువగా ఉందని.. తన సొంత జిల్లా వికారాబాద్ ప్రాంతంలో కూడా కోతుల సమస్య వల్ల వ్యవసాయానికి అంతరాయం కలుగుతుందని.. రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు.




# భూముల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు

**రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



హైదరాబాద్ :- ప్రభుత్వ భూములు ప్రజల ఆస్తులని వాటి పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.ప్రభుత్వ భూముల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.సోమవారం సచివాలయంలోని తన కార్యాలయంలో సహచర మంత్రి మహ్మద్ అజారుద్దీన్, జూబ్లీ హిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌తో కలిసి జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, స్మశానవాటికలు తదితర అంశాలపై సమీక్షించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బోరబండ, ఎర్రగడ్డ, షేక్‌పేట్ ప్రాంతాల్లో దశాబ్దాలుగా మైనార్టీలు స్మశాన వాటికలు లేక ఇబ్బంది పడుతున్నారని ఈ సమస్యను వీలైనంత త్వరితగతిన రక్షణశాఖ, రెవెన్యూ, వక్ఫ్‌బోర్డ్ సమన్వయంతో అధిగమించాలని అధికారులకు సూచించారు. అవసరమైన చోట రెవెన్యూ భూమిని రక్షణశాఖకు బదలాయించి వారి నుంచి ప్రత్యామ్నాయంగా భూమి తీసుకోవాలని, అలాగే రెవెన్యూ భూమిని వక్ఫ్ బోర్డుకు అప్పగించాలని సూచించారు. పేదల సంక్షేమం, ప్రజా అవసరాలు, అభివృద్ధి కార్యక్ర మాల కోసం వినియోగించవలసిన ప్రభుత్వ భూములను కొద్దిమంది స్వార్థప్రయోజనాల కోసం కబ్జాపెట్టే ప్రయత్నాలు చేస్తుంటారని, ఇటువంటి వాటిని ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. ఆక్రమణలను గుర్తించిన వెంటనే నోటీసులు జారీ చేసి అవసరమైతే ఖాళీ చేయించి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని వివాదాల్లో ఉన్న భూముల పరిరక్షణకు న్యాయపరంగా గట్టిగా వ్యవహరించాలని కలెక్టర్లకు సూచించారు. ఈ సమావేశంలో వైస్ ఛైర్మన్ ఫహీం ఖురేషి, మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి బి. షఫీల్లాహ్, హైదరాబాద్, మేడ్చల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

# హరీశ్ రావు వర్సెస్ శ్రీధర్ బాబు..

**సభలో ఉద్యోగుల సమస్యలపై వాగ్యుద్ధం**



హైదరాబాద్ : అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా జీరో అవర్ లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ప్రభుత్వ ఉద్యోగుల గురించి ప్రస్తావించిన అంశాలపై మంత్రి శ్రీధర్ బాబు స్పందించారు. ఉద్యోగుల గురించి హరీశ్ రావు మాట్లాడటం విడ్డూరంగా ఉందని హరీశ్ రావు వ్యాఖ్యలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. జీరో అవర్ లో సభ్యుల విజ్ఞప్తులు పరిగణలోకి తీసుకుంటామన్నారు. అంతకు ముందు హరీశ్ రావు సభలో మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులు తీవ్ర మనోవేదనలో ఉన్నారని, దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వ ఉద్యోగులకు ఆరు డీఏలు పెండింగ్లో ఉన్నది మన తెలంగాణలోనే అన్నారు. ఈ ప్రభుత్వం వచ్చి రెండేళ్లు అయిన ఇంత వరకు పీఆర్సీ ఇవ్వలేదని వెంటనే పీఆర్సీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు ఎంప్లాయిస్ హెల్త్ ఇన్సూరెన్స్ స్కీమ్ పై తాము జీవో తీసుకువస్తే దీన్ని అమల్లోకి తెస్తామని కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో పొందుపరిచిందని దాన్ని వెంటనే అమల్లోకి తేవాలన్నారు. ఉద్యోగులకు జీపీఎఫ్ తదిర బకాయిలు, రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు చెల్లించడం లేదని ఆరోపించారు. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు చెల్లించకపోవడంతో 39 మంది రిటైర్డ్ ఉద్యోగులు వైద్యం కూడా చేయించుకోలేక మరణించారని హరీశ్ రావు ఆరోపించారు. సీపీఎస్ ఉద్యోగులను ఓపీఎస్ ఉద్యోగులుగా మారుస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు చేయలేదని, గడిచిన రెండేళ్లుగా సీపీఎస్ కింద రాష్ట్ర ప్రభుత్వం కట్టాల్సిన కాంట్రిబ్యూషన్ డబ్బులను ప్రభుత్వం దారి మళ్లిస్తోందని ఆరోపించారు. పోలీసు శాఖలో ఐదు సరెండర్ లీవ్ లు పెండింగ్లో ఉన్నాయి. టీఏ, డీఏ, స్టేషన్ అలవెన్స్ లు రావడం లేదన్నారు. పోలీసులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసుల ఆరోగ్యభద్రతను పునరుద్ధరించాలని కోరారు.

# జనవరి 3న కొండగట్టుకు పవన్ కల్యాణ్



జగిత్యాల : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్రప్పు సిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టును సందర్శించనున్నారు. జనవరి మూడో తేదీన డిప్యూటీ సీఎం కొండగట్టుకు రానున్నారు. ఈ సందర్భంగా ఆయన కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ మేరకు పవన్ కల్యాణ్ పర్యటన షెడ్యూల్ ఖరారైంది.తన పర్యటనలో భాగంగా కొండగట్టులో ఆలయ అభివృద్ధికి సంబంధించి కీలక కార్యక్రమాలను ఆయన చేపట్టనున్నారు. టీటీడీ నిధులతో సుమారు రూ.35 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు పవన్ కల్యాణ్ శంకుస్థాపన చేయనున్నారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలు ఆలయ మౌలిక వసతులు, భక్తుల సౌకర్యాలను మరింత మెరుగుపరచే దిశగా ఉండనున్నాయి.కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయానికి పవన్ కల్యాణ్‌కు ప్రత్యేక అనుబంధం ఉంది. గతంలో ఏపీ రాజకీయాలకు సంబంధించి ఎన్డీఏ కూటమి పార్టీలతో పొత్తు పెట్టుకుంటున్నట్లు పవన్ కల్యాణ్ ఇదే ఆలయం నుంచి ప్రకటన చేశారు. ఇప్పుడు పవన్ కల్యాణ్ కొండగట్టు అంజన్న ఆలయానికి వస్తుండటంతో రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.ఏపీలో సార్వత్రిక ఎన్నికల్లో కూటమి భారీ విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే కొండగట్టుకు వచ్చి అంజన్న స్వామిని దర్శించుకోవడం పవన్ కల్యాణ్ విశేషంగా భావిస్తున్నారు. ఈ పర్యటన రాజకీయంగా, ఆధ్యాత్మికంగా కూడా ఎంతో ప్రాధాన్యం సంతరించుకుంది. పవన్ కల్యాణ్ రాకతో కొండగట్టు ప్రాంతంలో భక్తులు, ఆయన అభిమానుల భారీగా తరలి వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.




# తెలుగు రాష్ట్రాల మీదుగా రెండు ఆసియా హైవేలు

**మొత్తం 32 దేశాల మీదుగా రాకపోకలు**

అమరావతి : తెలుగు రాష్ట్రాల మీదుగా వెళ్లే రెండు జాతీయ రహదారులకు ఆసియా హైవే (ఏహెచ్)లుగా కూడా గుర్తింపు ఉందనేది మీకెవరికైనా తెలుసా? వివిధ దేశాల మీదుగా సరకు రవాణా చేసేందుకు, రోడ్డు మార్గంలో పలు దేశాలు చుట్టేయాలనుకునే పర్యాటకులు సులువుగా గుర్తించేందుకు వీలుగా ఆసియా హైవేల నంబర్లు దోహదపడతాయి.32 దేశాల మీదుగా రాకపోకలు: ఆసియా దేశాలతోపాటు, కొన్ని ఐరోపా దేశాలు కలిపి మొత్తం 32 దేశాల మీదుగా రాకపోకలు సాగించేందుకు ఆసియా హైవేల రోడ్ నెట్‌వర్క్ రూపొందింది. ఇది 1.40 లక్షల కిలోమీటర్ల నెట్‌వర్క్. అయితే ఈ హైవేల మీదుగా పలు దేశాలకు రోడ్డు మార్గంలో ప్రయాణించాలంటే పాస్‌పోర్ట్‌తోపాటు వీసా తప్పనిసరిగా ఉండాల్సిందే. కానీ ఆసియా హైవేల్లో 45, 43 తెలుగు రాష్ట్రాల మీదుగా వెళుతున్నాయి..ఏపీ మీదుగా ఆసియా ఎన్హెచ్-45: కోల్‌కతా నుంచి భువనేశ్వర్, విశాఖపట్నం, విజయవాడ, నెల్లూరు మీదుగా చెన్నై వరకు జాతీయ రహదారి-16 ఉంది. దీనిని ఆసియా హైవే (ఏహెచ్)-45గా పిలుస్తారు. మళ్లీ చెన్నై నుంచి వెల్లూరు మీదుగా కృష్ణగిరి వరకు ఉన్న జాతీయ రహదారి-48ని కూడా ఏహెచ్-45గా పిలుస్తారు. అంటే ఇది మొత్తంగా కోల్‌కతా నుంచి కృష్ణగిరి వరకు ఆసియా హైవే-45గా ఉంది. ఏహెచ్-1కి అనుసంధానంగా: వాస్తవానికి ఏహెచ్-1 అనేది జపాన్‌లోని టోక్యో నుంచి మొదలై దక్షిణ కొరియా, ఉత్తర కొరియా, చైనా, వియత్నాం, కాంబోడియా, థాయ్‌లాండ్, మయన్మార్, బంగ్లాదేశ్, భారత్, పాకిస్థాన్, అఫ్ఘనిస్థాన్, ఇరాన్ మీదుగా తుర్కియే-బల్గేరియా అంతర్జాతీయ సరిహద్దు వరకు ఆసియా హైవే-1 ఉంది. ఇందులో జపాన్- దక్షిణ కొరియాకు మధ్య సముద్రయాణం ఉంటుంది. ఆ తర్వాత మిగిలినదంతా రోడ్డు మార్గమే ఉంటుంది.ఈ ఏహెచ్-1 మన దేశంలో మయన్మార్ సరిహద్దులో మణిపూర్‌లోని మోరే వద్ద ప్రవేశించి ఇంఫాల్, కోహిమా, గౌహతి, షిల్లాంగ్ మీదగా బంగ్లాదేశ్‌లోకి వెళ్తుంది. మళ్లీ పశ్చిమబెంగాల్‌లోని పెట్రపోల్ వద్ద భారత్‌లోకి ప్రవేశించి కోల్కత్తా, వారణాసి, ప్రయాగరాజ్, కాన్పూర్, ఆగ్రా, దిల్లీ, లుథియానా, అమృత్‌సర్ మీదుగా అట్టారీ సరిహద్దు నుంచి పాకిస్థాన్‌లోకి వెళ్తుంది. ప్రధానంగా చెన్నై, నెల్లూరు, విజయవాడ, విశాఖపట్నం, భువనేశ్వర్ మీదుగా ఉన్న ఏహెచ్-45 కోల్‌కతా దగ్గర ఏహెచ్-1కి అనుసంధానం అవుతుంది.ఏపీ, తెలంగాణ మీదుగా ఏహెచ్-43: శ్రీనగర్ నుంచి కన్యాకుమారి వరకు జాతీయ రహదారి-44 ఉండగా ఇందులోనే కొంత భాగాన్ని ఆసియా హైవే-43గా గుర్తించారు. ఆసియా హైవే-1లోని ఆగ్రా వద్ద ఏహెచ్-43 మొదలవుతుంది. అక్కడి నుంచి ఎన్హెచ్-44 గ్వాలియర్, నాగ్‌పూర్, హైదరాబాద్, కర్నూలు, అనంతపురం, బెంగళూరు, కృష్ణగిరి, సేలం మీదుగా మధురై వరకు ఉన్నది.ఆసియా ఎన్హెచ్-43గా అధికారులు గుర్తించారు. మళ్లీ మధురై నుంచి రామేశ్వరం మీదుగా ధనుష్కోటి వరకు ఉన్న జాతీయ రహదారి-87ని ఆసియా హైవే 43గా పిలుస్తారు. అంటే ఆసియా హైవే-43 అనేది ఆగ్రా నుంచి ధనుష్కోటి వరకు ఉంది.

# భాక్రానంగల్ ఏ రాష్ట్రంలో ఉందో సీఎంకు తెలియదు..

- నీళ్లపై అవగాహన లేనివారంతా కేసీఆర్ చర్చకు రావాలని పట్టు
- కేసీఆర్ వస్తున్నాడని తెలిసి సిద్ధమవుతున్న కాంగ్రెస్ నేతలు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్



తెలంగాణ బ్యూరోప్రతినిధిః మీడియాతో చిట్ చాట్ లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ హాట్ కామెంట్స్ చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృష్ణా నది ఎక్కడ ఉన్నది అడిగాడు.. భాక్రానంగాల్ ఏ రాష్ట్రంలో ఉందో తెలియదని సెటైర్లు వేశారు. ఇక, పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టును అడ్డుకున్న వ్యక్తి ఇవాళ నీటిపారుదల శాఖ సలహాదారుగా కొనసాగుతున్నారని మండిపడ్డారు. అయితే, వీళ్ళు నీటిపారుదల శాఖపై చర్చ అంటున్నారు.. దేని మీద చర్చ పెడుతున్నారో వీరికి తెలియదు.. బూతులు మాట్లాడాలి అంటే ఎన్ని రోజులైనా చర్చ పెడతారు.. సభలో సబ్జెక్ట్ లేనప్పుడు ఎన్ని రోజులు నడుపుతారని కేటీఆర్ ప్రశ్నించారు.అయితే, నీటిపారుదల శాఖపై కనీస అవగాహన లేని వారు కేసీఆర్ చర్చకు రావాలని అంటున్నారు.. తీరా కేసీఆర్ వస్తున్నాడు అని కాంగ్రెస్ వాళ్లు చర్చకు ప్రిపేర్ అవుతున్నారు అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. అలాగే, కౌశిక్ రెడ్డి మేడిగడ్డపై బాంబులు పెట్టి పేల్చారని అన్నాడు.. ఎందుకంటే, హుజూరాబాద్ నియోజక వర్గంలోని తనుగుల వద్ద చెక్ డ్యామ్ పేల్చివేతలో రాఘవ కన్స్ట్రక్షన్ కంపెనీ హస్తం ఉందని ఆరోపించారు. కానీ, ఇప్పటి వరకు ఎందుకు మీరు విచారణ చేపట్టడం లేదని మాజీ మంత్రి కేటీఆర్ అడిగారు.



# అఖండ 2 అద్భుతమైన సినిమా

- ప్రతి ఒక్క హిందువు, భారతీయుడు తప్పక చూడాల్సిన మూవీ
- ధర్మం దారి తప్పిన వాళ్లకు ఈ సినిమా ఓ గుణపాఠం
- సనాతన ధర్మ రక్షణ అవసరాన్ని నొక్కి చెప్పిన సినిమా
- ఇలాంటి సినిమాలు భవిష్యత్తులో మరిన్ని రావాలి
- సనాతన ధర్మాన్ని రక్షించే యోధుడు నరేంద్ర మోడీ
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: ప్రతి ఒక్క హిందువుతోపాటు ప్రతీ భారతీయుడు తప్పకుండా చూడాల్సిన సినిమా అఖండ 2 అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అని అన్నారు. ధర్మాన్ని దారి తప్పిన వాళ్లకు ఈ సినిమా ఓ గుణపాఠమని చెప్పారు. సనాతన ధర్మాన్ని రక్షించే యోధుడు నరేంద్రమోదీ ఈ దేశాన్ని పాలిస్తున్నారు కాబట్టే కరోనా వంటి మహమ్మారికి విరుగుడుగా వ్యాక్సిన్ ను కనుగొని ప్రపంచానికి అందించగలిగామని తెలిపారు. ఈరోజు హైదరాబాద్ లోని బంజారాహిల్స్ ప్రసాద్ ల్యాబ్స్ లో ప్రముఖ దర్శకుడు బోయపాటి శ్రీనుతో కలిసి "అఖండ 2 తాండవం" సినిమాను బండి సంజయ్ వీక్షించారు. బీజేప రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసం వెంకటేశ్వర్లు, ముఖ్య అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్, అధికార ప్రతినిధి జె.సంగప్ప, జిల్లా అధ్యక్షులు ఉమా మహేందర్ సహా పలువురు బీజేపీ రాష్ట్ర నాయకులు బండి సంజయ్ తో కలిసి ఈ సినిమాను చూశారు. సినిమా అనంతరం బోయపాటితో కలిసి బండి సంజయ్ సినిమా చూసిన అనంతరం మాట్లాడుతూ అఖండ 2 సినిమా చూడటం చాలా సంతోషంగా ఉంది. సంచలనాలకు మారుపేరు బోయపాటి శ్రీను. సమాజానికి ఉపయోగపడే సినిమాలు తీస్తున్నారు. పరమేశ్వరుడు ఆవహించడంతో ఈ సినిమా చేసినట్లున్నారు. కమర్షియల్ హంగులకు అద్భుతమైన సందేశాన్ని ఇస్తూ తీసిన సినిమా. సనాతన ధర్మం గురించి సినిమా చేయాలంటే చాలా ధైర్యముండాలి. ఈ దేశంపైన, సనాతన ధర్మం, సంస్కృతి, సాంప్రదాయాలపై దాడులు జరుగుతున్నా తట్టుకుని నిలబడిదంటే... దానికి కారణం మనం నమ్ముకున్న సనాతన ధర్మమే. ఆ నిరంతర చరిత్రను అద్భుతంగా సినిమా అఖండ తాండవం. దేశ సరిహద్దులను సైనికులు రక్షిస్తే... ధర్మాన్ని సమాజం రక్షించుకోవాలి. అన్యాయం జరుగుతుంటే మౌనంగా ఉండటం కూడా తప్పే. అన్యాయాన్ని ఎదురించి సమాజాన్ని రక్షించేవాడే గొప్ప. సనాతన ధర్మం గొప్పతనం వినడం కంటే అఖండ తాండవం సినిమా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్క హిందువుపై, భారతీయుడిపై ఉంది. మిగిలిన ఈ జీవితాన్ని ధర్మం, దేశం కోసం అర్పించాలనే సినిమా అఖండ.

భారత్ ఎప్పటికీ ప్రపంచంలోనే శక్తివంతమైన దేశం. కోవిడ్ తరుణంలో ప్రపంచమంతా దిక్కులు చూస్తుంటే.... సనాతన ధర్మాన్ని రక్షించే యోధుడు ఈ దేశాన్ని పాలిస్తున్న సందర్భంలో కోవిడ్ వస్తే.. ఏ విధంగా ఎదుర్కొన్నారో, ప్రపంచానికి వ్యాక్సిన్ అందించిన దృశ్యాలను మనం కళ్లారా చూశాం. అంతటి యోధుడు నరేంద్రుడు భారత్ ను పాలిస్తున్నాడు కాబట్టే వ్యాక్సిన్ ను అందించగలిగినం. సైంటిస్టులను ప్రోత్సహించినం. కరోనా వ్యాక్సిన్ అందించిన భారత్ బయోటెక్ హైదరాబాద్ లో ఉంది. మోదీ స్వయంగా ఇక్కడికి వచ్చి వ్యాక్సిన్ ను పరీక్షించాడు.

అఖండ తాండవం సినిమాను ప్రతి హిందువు, భారతీయుడు తప్పకుండా చూడాల్సిన సినిమా. బోయపాటి శ్రీనివాస్ దర్శకత్వంలో బాలక్రిష్ణ అద్భుతంగా నటించారు. బాలయ్య సినిమాల కోసం విద్యార్థులు, కాలేజీలు, యువకులు బెట్టింగులు పెట్టి మరీ వెళుతున్నారు. ఎన్టీఆర్ రూపంలో బాలయ్యను చూస్తున్నాం. అఖండ సినిమాలో బాలయ్యను చూస్తే శివుడే మన ముందు కన్పించినట్లుంది. అఖండ సినిమాను లీనమై చూశాం. ఎక్కడా రాజీపడకుండా అఖండ 2 సినిమా చూసిన బోయపాటి శ్రీనుకు ప్రత్యేక అభినందనలు. ఈ సినిమాను అందరం ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. సనాతన ధర్మాన్ని కాపాడేలా మరిన్ని సినిమాలు రావాలి. ఈ దేశంలో అంతర్గతంగా జరుగుతున్న దాడులను, పరిస్థితులను ఆసరాగా చేసుకుని సినిమాలు తీసి ప్రజలను మేల్కొల్పాల్సిన అవసరం ఉంది. కొంత మంది ధర్మం విషయంలో దారి తప్పుతున్నారు. దేవుడు లేడు, హిందూ సనాతన ధర్మం లేదని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. వారందరికీ అఖండ 2 సినిమా గుణపాఠం. అటు ఇటు దారి తప్పిన వాళ్లంతా హిందూ ధర్మమనే గొడుగు కిందకు రావాలని కోరారు.



# రేపు బీసీ రిజర్వేషన్లపై అఖిలపక్ష సమావేశం

- బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే మున్సిపల్, ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నిక నిర్వహించాలి
- బీసీ రిజర్వేషన్ల అంశంపై బీఏసీ సమావేశంలో నిర్ణయం ఏది?
- బీసీ రిజర్వేషన్లు అమలుకై అసెంబ్లీలో చర్చ జరగాల్సిందే లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం
- బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ వెల్లడి

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: బీసీ రిజర్వేషన్లు అంశంపై ఈ అసెంబ్లీ సమావేశాల్లోని విస్తృతంగా చర్చించి, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే కార్యచరణను రూపొందించాలని లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఇంకా ఉధృతం చేస్తామని బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు.సోమవారం హైదరాబాదులోని సచివాలయం బయట మీడియా పాయింట్ వద్ద బీసీ జేఏసీ నేతలతో కలిసి జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడారు ఈరోజు ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాల బీఏసీ సమావేశంలో బీసీ రిజర్వేషన్ల అంశంపై చర్చించడానికి బిఏసి సమావేశంలో నిర్ణయం జరగకపోవడం చాలా బాధాకరమన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై ఇటు ప్రభుత్వం అటు ప్రతిపక్షాలు రెండు నాలుకల ధోరణిని అవలంబిస్తున్నాయని గ్రామపంచాయతీ ఎన్నికల అనంతరం ఒకరికి ఒకరు దమ్ముంటే జెడ్పిటిసి ఎంపిటిసి మున్సిపల్ ఎన్నికల నిర్వహించాలని సవాల్ విసురుకుంటున్నారని, తాము అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లు 42% పెంచాలని చేసిన చట్టం గురించి కానీ, బిల్లు గురించి కానీ చర్చిద్దామని నిర్ణయించకుండా, తాము చేసిన చట్టాన్ని ఢిల్లీ ప్రభుత్వం అమలు అమలుకై పోరాట కార్యాచరణ రూపొందించకుండా బీసీ రిజర్వేషన్ల అంశాన్ని పక్కదారి పట్టిస్తూ, ప్రాజెక్టులు అంటూ కొత్త నాటకం ఆడుతున్నారని ఆయన విమర్శించారు. బీసీ రిజర్వేషన్లపై అన్ని రాజకీయ పార్టీల వైఖరి వెల్లడించడానికి అసెంబ్లీలో చర్చించడానికి ఈనెల 31వ తేదీన బీసీ జేఏసీ ఆధ్వర్యంలో అఖిలపక్ష పార్టీల సమావేశాన్ని హైదరాబాదులోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో నిర్వహిస్తున్నామని, ఈ సమావేశంలో భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ మీడియా సమావేశంలో వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, ప్రొఫెసర్ బాగయ్య, ప్రొఫెసర్ సంఘని మల్లేశ్వర్, కాటేపల్లి వీరస్వామి, బీ మనీ మంజరి, జాజుల లింగం గౌడ్, గూడూరు భాస్కర్, నరసింహ చారి, బ్రహ్మాచారి, తదితరులు పాల్గొన్నారు.

# గద్దెల అభివృద్ధితో మేడారానికి కొత్త రూపు

- రహదారులు, జంపన్న వాగు ఘాట్లపై ప్రత్యేక దృష్టి
- రవాణా భద్రత కోసం భారీ ప్రణాళిక
- భక్తులకు ఇబ్బందుల్లేని జాతరే లక్ష్యం



హైదరాబాద్ : ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండుగగా ప్రసిద్ధి చెందిన మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర 2026 నిర్వహణకు తెలంగాణ ప్రభుత్వం అప్పుడే భారీ స్థాయిలో కసరత్తును ప్రారంభించింది. రెండేళ్లకు ఒకసారి వచ్చే ఈ వనదేవతల జాతరను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రభుత్వం, కోట్లాది మంది భక్తులు తరలివచ్చే ఈ మహా క్రతువును ఎటువంటి ఆటంకాలు లేకుండా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.ఫిబ్రవరి మాసంలో నాలుగు రోజుల పాటు అత్యంత వైభవంగా సాగే ఈ జాతరలో భాగంగా, మొదటి రోజు కన్నెపల్లి నుంచి సారలమ్మ దేవత గద్దెపైకి రాకతో ఉత్సవం ప్రారంభమవుతుంది. రెండవ రోజు చిలుకలగుట్ట నుంచి భరిణె రూపంలో సమ్మక్క దేవతను గద్దెపైకి తీసుకువచ్చే ఘట్టం జాతరకే అత్యంత ప్రధానమైనది. మూడవ రోజు దేవతలు ఇద్దరూ గద్దెలపై కొలువుదీరి భక్తులకు దర్శనమివ్వగా, నాల్గవ రోజు వన ప్రవేశంతో ఈ మహా జాతర ముగుస్తుంది.2026 జనవరి 28 నుంచి నాలుగు రోజుల పాటు జరిగే ఈ జాతరకు ఈసారి భక్తుల సంఖ్య భారీగా పెరిగే అవకాశముందని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో మేడారం పరిసర ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ జాతర కోసం ములుగు జిల్లా యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే భారీగా నిధులను మంజూరు చేసి, మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాయి. ముఖ్యంగా మేడారం వైపు వచ్చే ప్రధాన రహదారుల విస్తరణ, కల్వర్టుల నిర్మాణం , భక్తులు పుణ్యస్నానాలు ఆచరించే జంపన్న వాగు వద్ద స్నానపు ఘాట్ల ఏర్పాటు వంటి పనులు శరవేగంగా సాగుతున్నాయి.భక్తుల రవాణా సౌకర్యం కోసం టీజీఎస్ఆర్టీసీ వేలాది ప్రత్యేక బస్సులను రాష్ట్రవ్యాప్తంగా నడపడమే కాకుండా, రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక హెలికాప్టర్ సర్వీసులను కూడా అందుబాటులోకి తెచ్చే ఆలోచనలో ఉంది. పారిశుధ్య లోపం తలెత్తకుండా వేలాది మంది సిబ్బందిని నియమించడంతో పాటు, తాగునీరు, అత్యవసర వైద్య సేవలు , భారీ పోలీసు బందోబస్తుతో జాతర ప్రాంగణాన్ని ఒక భద్రతా వలయంగా మార్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తమ బరువుకు తూగే బెల్లాన్ని (బంగారం) వనదేవతలకు సమర్పించి మొక్కులు తీర్చుకునే భక్తులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా క్యూ లైన్లను క్రమబద్ధీకరిస్తూ, తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా ఈ జాతరను నిర్వహించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.




# న్యూ ఇయర్ ఫేక్ లింక్‌లతో జాగ్రత్త!

**తెలంగాణ సైబర్ బ్యూరో అధికారుల హెచ్చరికలు**

హైదరాబాద్ : నూతన సంవత్సరం సందర్భంగా హ్యాపీ న్యూఇయర్ శుభాకాంక్షలు , గిఫ్టులు, ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు ఆఫర్లు, ప్రయాణ రాయితీలు, ఈవెంట్ టికెట్లు అంటూ వాట్సప్, ఎస్ఎంఎస్, సోషల్ మీడియా ద్వారా నకిలీ లింక్‌లు విస్తృతంగా ప్రచారం అవుతున్నాయి. ఇలాంటి లింక్‌లతో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు తెలంగాణ సైబర్ బ్యూరో అధికారులు. ఆలోచించకుండా వాటిపై క్లిక్ చేస్తే మీ మొబైల్‌లో హానికరమైన యాప్‌లు ఇన్‌స్టాల్ అయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. దీంతో మీ ఓటీపీలు, బ్యాంకు వివరాలు చోరీకి గురికావడం, వాట్సప్ ఖాతా దుర్వినియోగమవ్వడం వంటి ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంటుందని హెచ్చరిస్తున్నారు. అందువల్ల ఇలాంటి వాటిపై అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సైబర్ బ్యూరో అధికారులు హెచ్చరిస్తున్నారు. అనుమానాస్పద లింక్‌లపై క్లిక్ చేయొద్దని, ఒకవేళ ఏదైనా మోసం జరిగితే వెంటనే 1930కు కాల్ చేయడం లేదా ద్వారా ఫిర్యాదు చేయడం ద్వారా నష్టాన్ని నివారించవచ్చని టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖా గోయెల్ సూచించారు.

**ఈ దాడి ఎలా జరుగుతుంది? :** కొత్త సంవత్సర ఉత్సాహం, ఆసక్తులను అదనుగా చేసుకొని సైబరాసురులు మోసాలకు పాల్పడుతున్నారు. వాట్సప్‌లో హ్యాపీ న్యూ ఇయర్ శుభాకాంక్షలు లేదా గిఫ్ట్ లింక్ వంటివి పంపుతుంటారు. ఇలాంటి లింక్‌లపై క్లిక్ చేస్తే మీ ఫోన్‌లో హానికరమైన ఏపీకే ఫైల్ రహస్యంగా ఇన్‌స్టాల్ అవుతుంది. ఒకసారి ఇన్‌స్టాల్ అయిన తర్వాత.. ఆ మాల్వేర్ ఓటీపీలు, బ్యాంకింగ్ వివరాలు, కాంటాక్టులు, ఫోటోలు, వాట్సప్‌ను యాక్సెస్ చేయగలదు. దీంతో నేరగాళ్లు మీ పేరుతో ఇతరులను మోసం చేసే అవకాశం ఉంటుంది. ఈ లింక్‌లు తరచూ పరిచయమైన వ్యక్తులు లేదా కుటుంబ సభ్యుల గ్రూపుల ద్వారా ఫార్వార్డ్ అవుతాయి. అందువల్ల అవి నిజమైనవిగా అనిపిస్తుంటాయి. యాప్ ఇన్‌స్టాల్ చేయమని లేదా అప్‌డేట్ చేయాలని కోరే శుభాకాంక్షలు/గిఫ్ట్ లింక్‌లపై ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయొద్దు. ఇన్‌స్టాల్ అవుతుంది.హానికరమైన యాప్ బ్యాక్ గ్రౌండ్‌లో నిశ్శబ్దంగా పనిచేస్తుంది.ఓటీపీలు, మెసేజ్‌లు, కాంటాక్టులు, వాట్సప్ సెషన్లపై అనధికార యాక్సెస్ లభిస్తుంది.బాధితుడి ఖాతాను ఉపయోగించి సైబర్ నేరగాళ్లు ఇతరులను మోసం చేస్తారు.వెంటనే ఏం చేయాలి? అనుమానాస్పద యాప్ ఇన్‌స్టాల్ చేసినా వెంటనే మొబైల్ డేటా, వైఫై ఆఫ్ చేయండి.ఆ అనుమానాస్పద యాప్‌ను తక్షణమే అన్‌ఇన్‌స్టాల్ చేయండి.అన్ని వివరాలూ నమోదు చేసుకోండి: మెసేజులు, లింక్‌లు, పాప్‌అప్స్ స్క్రీన్‌షాట్‌లు, ట్రాన్సాక్షన్ ఐడీలు, యూటీఆర్ నంబర్లు, కాల్ లాగ్స్, లింక్డ్ డివైజెస్ చెక్ చేసి తెలియని డివైజ్‌లను తొలగించండి.వాట్సప్, ఈమెయిల్, బ్యాంకింగ్, సోషల్ మీడియా పాస్‌వర్డ్‌లను మార్చండి.నగదు లావాదేవీలు జరిగితే వెంటనే బ్యాంక్/పేమెంట్ యాప్‌కు సమాచారం ఇవ్వండి.జాగ్రత్తలివీ..వాట్సప్/ఎస్ఎంఎస్ ద్వారా వచ్చే శుభాకాంక్షలు, గిఫ్ట్, ఆఫర్ లింక్‌లపై ఎట్టిపరిస్థితుల్లో క్లిక్ చేయొద్దు.మెసేజ్‌ల ద్వారా వచ్చే ఏపీకే ఫైల్స్‌ని ఎప్పుడూ ఇన్‌స్టాల్ చేయొద్దు.ఓటీపీలు, పిన్‌లు, సీవీవీలు లేదా వెరిఫికేషన్ కోడ్‌లను ఎవరికీ చెప్పొద్దు.వాట్సప్‌లో టు-స్టెప్ వెరిఫికేషన్ ప్రారంభించండి.యాప్‌లను అధికారిక యాప్ స్టోర్‌ల నుంచి మాత్రమే డౌన్‌లోడ్/అప్‌డేట్ చేయండి.

# సంపాదకీయం

suryaeditpage@gmail.com

## 'కృత్రిమ మేధ' అండతో 2025 లో వైద్య విప్లవం!

2025వ సంవత్సరంలో భారతీయ వైద్య రంగం ఒక నిశ్శబ్ద విప్లవానికి వేదికైంది. దేశవ్యాప్తంగా ఆసుపత్రులు రోగుల రద్దీతో, వైద్యులు పని ఒత్తిడితో సతమతమవుతున్నప్పటికీ, వీటన్నింటి మధ్య కృత్రిమ మేధ తన ఉనికిని బలంగా చాటుకుంది. గతంలో కేవలం ప్రయోగాత్మక ప్రాజెక్టులకే పరిమితమైన ఈ సాంకేతికత, ఇప్పుడు సామాన్యుడి వైద్య ప్రక్రియలో అంతర్భాగంగా మారింది. ఇది ఒకేసారి జరిగిన పెను మార్పు కాకపోయినప్పటికీ, భారత ఆరోగ్య వ్యవస్థను లోలోపల క్రమబద్ధీకరిస్తూ, లోపాలను సరిదిద్దుతూ అడుగులు వేస్తోంది. వనరుల కొరత ఉన్నప్పటికీ, కృత్రిమ మేధ సహాయంతో వైద్య సేవలను మరింత వేగవంతం చేసే ప్రయత్నం స్పష్టంగా కనిపిస్తోంది. భారతదేశం 2025ను కొన్ని పాత సవాళ్లతోనే ప్రారంభించింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగుల రద్దీ, గ్రామీణ ప్రాంతాల్లో నిపుణులైన వైద్యుల కొరతవంటి సమస్యలు అలాగే ఉన్నాయి. రోగులు ఒక చిన్న స్కాన్ లేదా పరీక్ష కోసం గంటల తరబడి ప్రయాణం చేయాల్సి రావడం, వైద్య ఖర్చులు సామాన్యుడికి భారంగా మారడం వంటివి నేటికీ కనిపిస్తున్నాయి. మధుమేహం, గుండె జబ్బులు మరియు క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు పెరుగుతుండటం వల్ల వైద్య వ్యవస్థపై ఒత్తిడి పెరిగింది. మానసిక ఆరోగ్య నిపుణుల కొరత కూడా వేధిస్తోంది. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో, కృత్రిమ మేధ ఒక ఆశాకిరణంలా వైద్య రంగంలోకి ప్రవేశించింది.

వ్యాధి నిర్ధారణ ప్రక్రియలో కృత్రిమ మేధ అత్యుత్తమ ఫలితాలను అందిస్తోంది. ముఖ్యంగా ఎక్స్‌రే మరియు స్కాన్ చిత్రాలను విశ్లేషించడంలో ఇది వైద్యులకు సహాయకారిగా మారింది. క్షయ వ్యాధి, ఊపిరితిత్తుల క్యాన్సర్ మరియు మెదడులో రక్తస్రావం వంటి సమస్యలను కృత్రిమ మేధ సాఫ్ట్‌వేర్ క్షణాల్లో గుర్తిస్తోంది. రేడియాలజిస్టులు అందుబాటులో లేని మారుమూల ప్రాంతాల్లో కూడా ఈ సాంకేతికత ద్వారా అధిక ముప్పు ఉన్న రోగులను ముందుగానే గుర్తించడం సాధ్యమవుతోంది. రొమ్ము క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులను ప్రాథమిక దశలోనే కనిపెట్టడానికి ఉష్ణ చిత్రాలను విశ్లేషించే అత్యాధునిక ఏఐ పరికరాలను చిన్న ఆసుపత్రుల్లో కూడా వాడుతున్నారు. ఇది వైద్యుల పనిభారాన్ని తగ్గించడమే కాకుండా, పొరపాట్లకు తావు లేకుండా ఖచ్చితమైన ఫలితాలను ఇస్తోంది.

టెలిమెడిసిన్ రంగం కూడా కృత్రిమ మేధతో మరింత చురుకుగా మారింది. గతంలో కేవలం వీడియో కాల్స్ ద్వారా సలహాలు తీసుకునే పద్ధతి ఉండేది, కానీ ఇప్పుడు ఏఐ చాట్‌బాట్‌లు రోగుల లక్షణాలను అడిగి తెలుసుకుని, ప్రాథమిక సమాచారాన్ని సేకరిస్తున్నాయి. దీనివల్ల వైద్యులు నేరుగా క్లిష్టమైన కేసులపై దృష్టి పెట్టే అవకాశం లభించింది. చిన్న పట్టణాల ప్రజలకు క్యూలో నిలబడాల్సిన అవసరం లేకుండానే త్వరితగతిన వైద్య సలహాలు అందుతున్నాయి. అయితే, పట్టణ ప్రాంతాల సమాచారంపై ఆధారపడి రూపొందించిన ఈ సాంకేతికతను గ్రామీణ ప్రజలకు వర్తింపజేసేటప్పుడు వైద్యులు తగిన జాగ్రత్తలు కూడా తీసుకుంటున్నారు.వైద్య సేవల ప్రణాళికలో కూడా కృత్రిమ మేధ తన ముద్ర వేస్తోంది. సీజనల్ వ్యాధులైన డెంగ్యూ లేదా ఫ్లూ వంటివి ఎప్పుడు విజృంభిస్తాయో ముందుగానే అంచనా వేయడానికి ప్రభుత్వ యంత్రాంగం ఏఐ విశ్లేషణలను వాడుతోంది. ఏ సమయంలో ఆసుపత్రి పడకల కొరత ఏర్పడుతుందో, మందుల నిల్వలు ఎంత అవసరమో అంచనా వేయడానికి ఇది తోడ్పడుతోంది. ఇది కేవలం అంచనాకే పరిమితం కాకుండా, అత్యవసర సమయాల్లో వైద్య సిబ్బందిని ఎలా కేటాయించాలో నిర్ణయించడంలో కూడా సహాయపడుతోంది. డేటా లభ్యతలో కొన్ని వ్యత్యాసాలు ఉన్నప్పటికీ, నిర్ణయాలు తీసుకోవడంలో ఇది ఒక కీలకమైన సాధనంగా మారింది.

ప్రైవేట్ రంగం ఈ సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో ముందుంది. ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రులు రేడియాలజీ మరియు రోగ నిర్ధారణ విభాగాల్లో భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. కొత్త తరహా వ్యాపార సంస్థలు డిజిటల్ హెల్త్ రికార్డులను నిర్వహించడానికి, రోగుల ఆరోగ్య చరిత్రను ట్రాక్ చేయడానికి ఏఐ అల్గారిథమ్స్ ఉపయోగిస్తున్నాయి. అయితే, ఈ ఆధునిక సౌకర్యాలు కేవలం నగరాలకే పరిమితమై, పేదలకు దూరం కాకుండా చూడాల్సిన బాధ్యత ఉంది. సాంకేతికత ఎంత వేగంగా పెరుగుతున్నా, అది సామాన్యుడికి చేరువైనప్పుడే దానికి సార్థకత చేకూరుతుంది.కృత్రిమ మేధ వినియోగం పెరుగుతున్న కొద్దీ నైతిక మరియు గోప్యత సమస్యలు కూడా తెరపైకి వస్తున్నాయి. రోగుల ఆరోగ్య సమాచారాన్ని భద్రపరచడం, సాంకేతికత పొరపాట్లు చేసినప్పుడు ఎవరిని బాధ్యులను చేయాలి అనేది ఒక చర్చనీయాంశంగా మారింది. కొన్నిసార్లు ఏఐ సాఫ్ట్‌వేర్ కొన్ని వర్గాల ప్రజల పట్ల పక్షపాతంగా ఫలితాలు ఇచ్చే ప్రమాదం కూడా ఉంది. అందుకే సాంకేతికతతో పాటు సరైన నియంత్రణలు కూడా అవసరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వైద్యులు మరియు సాంకేతిక నిపుణులు సమన్వయంతో పనిచేసినప్పుడే ఇటువంటి సమస్యలను అధిగమించవచ్చు

కృత్రిమ మేధ కేవలం రోగ నిర్ధారణకే పరిమితం కాకుండా, ఆసుపత్రి పరిపాలనలో కూడా పెద్ద మార్పులు తెచ్చింది. రోగుల రికార్డులను డిజిటలైజ్ చేయడం ద్వారా, ఒక వ్యక్తి గత ఆరోగ్య చరిత్రను సెకన్లలో తెలుసుకోవడం వైద్యులకు సులభమైంది. దీనివల్ల అత్యవసర పరిస్థితుల్లో తప్పుడు చికిత్సలు జరిగే అవకాశం తగ్గింది. స్మార్ట్ హాస్పిటల్స్ పేరుతో వస్తున్న కొత్త రకం వైద్యశాలల్లో మందుల పంపిణీ నుండి రోగుల పర్యవేక్షణ వరకు ఏఐ అల్గారిథమ్స్ నిరంతరం పని చేస్తున్నాయి.మరో ముఖ్యమైన పరిణామం ఏమిటంటే, జన్యు ఆధారిత వైద్యం సామాన్యులకు అందుబాటులోకి రావడం. ఒక వ్యక్తి యొక్క డిఎన్ఏ ను విశ్లేషించి, భవిష్యత్తులో వారికి ఏ వ్యాధులు వచ్చే అవకాశం ఉందో ఏఐ ముందే హెచ్చరిస్తోంది. దీనివల్ల వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స కంటే వ్యాధి రాకుండా జాగ్రత్త పడటం అనే సూత్రం బలోపేతమైంది. జీవనశైలి మార్పుల ద్వారా ప్రాణాంతక వ్యాధులను అడ్డుకోవడంలో కృత్రిమ మేధ ఒక వ్యక్తిగత ఆరోగ్య సలహాదారిగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యుల కొరతను తీర్చడానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏఐ ఆధారిత హెల్త్ కియోస్కు అద్భుతమైన ఫలితాలను ఇస్తున్నాయి. ఒక చిన్న గది వంటి ఈ కియోస్కులో రోగులు తమ ప్రాథమిక పరీక్షలు (రక్తపోటు, చక్కెర శాతం, ఈసీజీ) స్వయంగా చేసుకోవచ్చు. ఆ ఫలితాలను ఏఐ విశ్లేషించి, పరిస్థితి తీవ్రంగా ఉంటేనే సమీపంలోని పట్టణ వైద్యుడికి సమాచారం పంపిస్తుంది. ఇది గ్రామీణ ప్రజల సమయాన్ని మరియు డబ్బును ఎంతో ఆదా చేస్తోంది. అయితే, కృత్రిమ మేధ వినియోగంలో ప్రైవేట్ మరియు ప్రభుత్వ రంగాల మధ్య ఉన్న వ్యత్యాసం ఒక సవాలుగా మిగిలింది. కార్పొరేట్ ఆసుపత్రులు అత్యాధునిక ఏఐ రేడియాలజీ మరియు రోబోటిక్ పరికరాలను వేగంగా కొనుగోలు చేస్తుండగా, ప్రభుత్వ ఆసుపత్రులు నిధుల కొరత మరియు మౌలిక సదుపాయాల లేమితో వెనుకబడి ఉన్నాయి. ఈ డిజిటల్ విభజన వల్ల ధనవంతులకు మాత్రమే నాణ్యమైన ఏఐ వైద్యం అందుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. దీనిని అధిగమించేందుకు ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ ద్వారా ప్రభుత్వ ఆసుపత్రుల్లో కూడా డిజిటల్ రికార్డులను మరియు ఏఐ ఆధారిత ప్రాథమిక నిర్ధారణ కేంద్రాలను విస్తరిస్తోంది. సాంకేతికత పెరుగుతున్న కొద్దీ నైతిక సమస్యలు కూడా చర్చకు వస్తున్నాయి. ఏఐ సాఫ్ట్‌వేర్ ఒక రోగికి సంబంధించి తప్పుడు నిర్ధారణ చేసినప్పుడు, దానికి బాధ్యులు ఎవరు అనే ప్రశ్న ఉదయిస్తోంది. వైద్యుడా, ఆసుపత్రా లేక ఆ సాఫ్ట్‌వేర్ తయారు చేసిన సంస్థా అనే విషయంలో స్పష్టమైన చట్టాలు ఇంకా రూపొందాల్సి ఉంది. అలాగే, రోగుల వ్యక్తిగత ఆరోగ్య సమాచారాన్ని ఏఐ కంపెనీలు వాణిజ్య అవసరాల కోసం వాడుకోకుండా కఠినమైన నిబంధనలు అవసరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఏఐ వల్ల వైద్యులు తమ ప్రాధాన్యతను కోల్పోతారనే భయం ఉన్నప్పటికీ, యంత్రాలు వైద్యులకు కేవలం సహాయకులుగా మాత్రమే ఉండాలని, చివరి నిర్ణయం ఎప్పుడూ మనిషిదే కావాలని 2025 నాటి పరిస్థితులు మనకు గుర్తు చేస్తున్నాయి.

మొత్తం మీద చెప్పాలంటే, 2025వ సంవత్సరం భారత ఆరోగ్య రంగంలో ఒక సరికొత్త అధ్యాయానికి పునాది వేసింది. కృత్రిమ మేధ కేవలం ఒక సాంకేతిక పరికరంలా కాకుండా, వైద్యులకు ఒక నమ్మకమైన భాగస్వామిగా మారి ప్రాణాలను రక్షించడంలో కీలక పాత్ర పోషిస్తోంది. మారుమూల గ్రామాల్లో నివసించే సామాన్యుడికి కూడా నిపుణులైన వైద్యం అందేలా చేయడంలో ఏఐ సాధించిన విజయం అసాధారణమైనది. మౌలిక సదుపాయాల కొరత ఉన్న దేశంలో, ఈ సాంకేతికత ఒక వరంలా మారి వైద్య సేవల్లో ఉన్న అంతరాలను తొలగిస్తోంది.అయితే, భవిష్యత్తులో ఈ ప్రగతి మరింత సుస్థిరంగా ఉండాలంటే కేవలం సాంకేతికతపైనే ఆధారపడకుండా, నైతిక విలువలకు మరియు డేటా భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి. కృత్రిమ మేధ వేగాన్ని, ఖచ్చితత్వాన్ని అందించగలదు కానీ, రోగి పట్ల వైద్యుడికి ఉండే కరుణను మరియు మానవ స్పర్శను ఏ యంత్రం భర్తీ చేయలేదు. కాబట్టి, మానవ మేధస్సుకు కృత్రిమ మేధ తోడైనప్పుడే భారతదేశం ఆరోగ్య రంగంలో ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తుంది. సంప్రదాయ వైద్యం మరియు ఆధునిక సాంకేతికత మధ్య సరైన సమతుల్యత సాధించినప్పుడే అందరికీ ఆరోగ్యం అనే లక్ష్యం నిజమవుతుంది.

# 2025 భారత ఆర్థిక ప్రగతి-ప్రపంచానికే ఒక దిక్సూచి!



- అనేక దేశాలు ఆర్థిక మాంద్యం -అస్థిరతతో సతమతం
- మన దేశంలో ద్రవ్యోల్బణం నియంత్రణలోకి రావటం విశేషం
- వడ్డీ రేట్లు తగ్గడం తదితర అంశాలు సామాన్యుడికి ఎంతో ఊరట
- భారత వృద్ధి రేటును ప్రశంసించిన ఐఎంఎఫ్ - ప్రపంచ బ్యాంకు
- ఈ ఏడాది వృద్ధి అంచనాను 7.3 శాతానికి పెంచిన ఆర్ బిఐ

**తేజస్విని**
**హైదరాబాద్**

2025 సంవత్సరం భారత ఆర్థిక చరిత్రలోద ఒక మైలురాయిగా నిలిచిపో యింది. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు ఆర్థిక మాంద్యం మరియు అస్థిరతతో సతమతమవుతున్న వేళ, భారతదేశం మాత్రం స్థిరమైన వృద్ధిని కనబరుస్తూ అందరి దృష్టిని ఆకర్షించింది. ప్రభుత్వ వ్యూహాత్మక విధానాలు , పెరిగిన దేశీయ వినియోగం మరియు పటిష్టమైన ఆర్థిక సంస్కరణలు వెరసి భారత ఆర్థిక వ్యవ స్థను కొత్త శిఖరాలకు చేర్చాయి.ముఖ్యంగా ఈ ఏడాది దేశంలో ద్రవ్యోల్బణం నియంత్రణలోకి రావడం, వడ్డీ రేట్లు తగ్గడం వంటి అంశాలు సామాన్యుడికి ఎంతో ఊరటనిచ్చాయి.

పెట్టుబడిదారులలో నమ్మకం పెరగడం వల్ల స్టాక్ మార్కెట్లు రికార్డు స్థాయి లాభాలను గడించాయి. వేలాది మంది కొత్త పెట్టుబడి దారులు మార్కెట్‌లోకి ప్రవేశించడం, ఐపిఓ ల సందడి పెరగడం ద్వారా భారత్ ఒక శక్తివంతమైన పెట్టుబడి కేంద్రంగా అవతరించింది.అంతర్జాతీయ సంస్థలైన ఐఎంఎఫ్ మరియు ప్రపంచ బ్యాంక్ సైతం భారత వృద్ధి రేటును ప్రశంసించాయి. కేవలం సేవా రంగం మాత్రమే కాకుండా, తయారీ, మౌలిక సదుపాయాలు మరియు డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వంటి 10 కీలక రంగాలు ఈ అద్భుతమైన ప్రగతికి ఎలా దోహదపడ్డాయో ఇప్పుడు వివరంగా చూద్దాం.

**ప్రపంచ వృద్ధి కేంద్రంగా భారత్:**
2025లో భారతదేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా నిలిచింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నివేదిక ప్రకారం, సెప్టెంబర్ త్రైమాసికంలో దేశం 8.2% వృద్ధిని నమోదు చేసింది. ఇది చైనా మరియు అమెరికా వంటి దేశాల కంటే ఎంతో మెరుగ్గా ఉంది. దేశీయంగా పెరిగిన వస్తువుల డిమాండ్ మరియు స్థిరమైన ప్రైవేట్ వినియోగం ఈ వృద్ధికి ప్రధాన కారణాలు. దీనివల్ల ఆర్‌బిఐ తన పూర్తి ఏడాది వృద్ధి అంచనాను 7.3 శాతానికి పెంచింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందగించినా, భారత్ మాత్రం తన జోరును కొనసాగించడం గమనార్హం.అంతర్జాతీయ ఇన్వెస్టర్లు ఇప్పుడు భారత్‌ను ఒక సురక్షితమైన మరియు లాభదాయకమైన మార్కెట్‌గా చూస్తున్నారు. ఐఎంఎఫ్ అంచనాల ప్రకారం, రాబోయే సంవత్సరాల్లో కూడా భారత్ ఇదే స్థాయి వృద్ధిని కొనసాగించి ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపించే ప్రధాన శక్తిగా నిలవనుంది.

**మౌలిక సదుపాయాలు - పెట్టుబడులు:** కేంద్ర ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనకు ఈ ఏడాది అత్యంత ప్రాధాన్యతనిచ్చింది. నేషనల్ హైవేల విస్తరణ, కొత్త విమానాశ్రయాల నిర్మాణం మరియు రైల్వే ఆధునీకరణ వంటి పనుల వల్ల రవాణా వ్యవస్థ వేగవంతమైంది. దీనివల్ల వ్యాపార నిర్వహణ ఖర్చులు తగ్గి లాభాలు పెరిగాయి. ఎలక్ట్రానిక్స్ మరియు పునరుత్పాదక ఇంధన రంగాలలో భారీగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వచ్చాయి. ముఖ్యంగా సెమీకండక్టర్ తయారీలో భారత్ తీసుకున్న చొరవ వల్ల అనేక అంతర్జాతీయ కంపెనీలు దేశంలో ప్లాంట్లను ఏర్పాటు చేశాయి. దీనివల్ల వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు లభించాయి.కేవలం పట్టణాల్లోనే కాకుండా, గ్రామీణ ప్రాంతాల్లో కూడా మౌలిక సదుపాయాల అభివృద్ధిపై దృష్టి పెట్టడం వల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడింది. పటిష్టమైన బ్యాంకింగ్ వ్యవస్థ మరియు ప్రభుత్వ మూలధన వ్యయం కలిసి దేశాన్ని పారిశ్రామిక హబ్‌గా మార్చాయి.

**ద్రవ్యోల్బణం నియంత్రణ - చౌక రుణాలు:** 2025లో సామాన్యుడికి అందిన అతిపెద్ద వరం ద్రవ్యోల్బణం భారీగా తగ్గడం. అక్టోబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 0.25% కనిష్ట స్థాయికి పడిపోయింది. ఆహార ధరలు అదుపులో ఉండటం మరియు జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణ వల్ల నిత్యావసర వస్తువుల ధరలు స్థిరంగా ఉన్నాయి.ద్రవ్యోల్బణం తగ్గడంతో ఆర్‌బిఐ తన వడ్డీ రేట్లను తగ్గించే అవకాశం దక్కింది. ఏడాది కాలంలో వడ్డీ రేట్లు 1.25% మేర తగ్గడంతో హోమ్ లోన్లు, కార్ లోన్లు మరియు బిజినెస్ లోన్లు చాలా చౌకగా మారాయి. ఇది మధ్యతరగతి ప్రజల కొనుగోలు శక్తిని పెంచింది.తక్కువ వడ్డీ రేట్ల వల్ల చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమలు సులభంగా రుణాలు పొంది తమ వ్యాపారాలను విస్తరించుకున్నాయి. ఇది మార్కెట్‌లో నగదు లభ్యతను పెంచి, ఆర్థిక చక్రం వేగంగా తిరగడానికి సహాయపడింది.

**సేవా రంగాలు మరియు విదేశీ రెమిటెన్స్‌లు:** భారతదేశం ఎప్పుడూ సేవా రంగంలో అగ్రగామిగానే ఉంది, 2025లో ఈ రంగం మరింత పుంజుకుంది. ఐటీ, బిజినెస్ ప్రాసెస్ సేవలు ప్రొఫెషనల్ కన్సల్టింగ్ ఎగుమతులు భారీ గా పెరిగాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కంపెనీలు తమ డిజిటల్ పనుల కోసం భారత్ వైపు చూడటం విశేషం.విదేశాల్లో నివసిస్తున్న భారతీయులు పంపే నిధు లు కూడా దేశ విదేశీ మారక నిల్వలను పటిష్టం చేశాయి. ప్రపంచంలోనే అత్యధికంగా నిధులు అందుకుంటున్న దేశంగా భారత్ తన స్థానాన్ని నిలబెట్టుకుంది. ఇది దేశకరెంట్ అకౌంట్ లోటును తగ్గించడానికి తోడ్పడింది. సేవా రంగంలో కేవలం ఐటీ మాత్రమే కాకుండా, హెల్త్ కేర్ మరియు టూరిజం రంగాలు కూడా మంచి వృద్ధిని నమోదు చేశాయి. మెడికల్ టూరిజం కోసం విదేశీయులు భారత్‌కు రావడం వల్ల విదేశీ ఆదాయం గణనీయంగా పెరిగింది.

**క్యాపిటల్ మార్కెట్‌లో ఐపిఓ సందడి:** 2025 సంవత్సరం భారత స్టాక్ మార్కెట్ చరిత్రలో ఐపిఓల ఏడాదిగా నిలిచిపోతుంది. సుమారు 86 కంటే ఎక్కువ కంపెనీలు మార్కెట్లోకి వచ్చి 1.71 లక్షల కోట్ల రూపాయలను సేకరించాయి. ఇది గత సంవత్సరంతో పోలిస్తే దాదాపు రెట్టింపు వృద్ధి.చాలా ఐపిఓలు ఓవర్-సబ్‌స్క్రైబ్ అవ్వడం మరియు ఇన్వెస్టర్లకు మంచి లాభాలను అందించడం మార్కెట్ పట్ల నమ్మకాన్ని పెంచింది. ముఖ్యంగా టెక్నాలజీ మరియు తయారీ రంగ కంపెనీలు తమ వ్యాపార విస్తరణ కోసం స్టాక్ మార్కెట్ బాట పట్టాయి. సాధారణ ప్రజలు కూడా స్టాక్ మార్కెట్ పట్ల ఆసక్తి చూపడంతో డీమ్యాట్ ఖాతాల సంఖ్య రికార్డు స్థాయికి చేరింది. మ్యూచువల్ ఫండ్స్ మరియు పెన్షన్ ఫండ్స్ ద్వారా భారీగా పెట్టుబడులు రావడం వల్ల భారత మార్కెట్ ప్రపంచంలోనే అత్యంత చురుకైన మార్కెట్‌గా మారింది.

**దేశీయ పెట్టుబడుదారుల బలమైన మద్దతు:** గతంలో విదేశీ ఇన్వెస్టర్లు నిధులు వెనక్కి తీసుకుంటే భారత మార్కెట్లు కుప్పకూలేవి. కానీ 2025లో ఆ పరిస్థితి మారింది. విదేశీయులు అమ్మకాలు జరిపినా, దేశీయ ఇన్వెస్టర్లు మార్కెట్‌ను నిలబెట్టారు. దీనినే బలమైన మద్దతు అనుకోవచ్చు.సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్)ల ద్వారా నెలకు వేల కోట్లు మార్కెట్లోకి రావడం ఒక బలమైన పునాదిగా మారింది. సామాన్య ప్రజలు మార్కెట్ పడిపోయినప్పుడు కొనుగోలు చేసే ధోరణిని అలవరచుకున్నారు. ఇది నిఫ్టీ మరియు సెన్సెక్స్ వంటి సూచీలు స్థిరంగా ఉండటానికి సహాయపడింది.ఈ పరిణామం భారత ఆర్థిక వ్యవస్థకు ఒక కొత్త బలాన్ని ఇచ్చింది. విదేశీ పెట్టుబడులపై ఆధారపడటం తగ్గి, స్వదేశీ నిధులతోనే మార్కెట్ దూసుకుపోతోంది. ఇది దేశ ఆర్థిక సార్వభౌమత్వాన్ని ప్రతిబింబిస్తోంది.

**డిజిటల్ ఆర్థిక వ్యవస్థ - యూపీఐ విజయం:** భారతదేశం డిజిటల్ లావాదేవీలలో ప్రపంచంలోనే నంబర్ వన్ స్థానంలో కొనసాగుతోంది. 2025 నాటికి యూపీఐ లావాదేవీలు కేవలం పట్టణాలకే పరిమితం కాకుండా మారుమూల గ్రామాల వరకు చేరాయి. చిరు వ్యాపారుల నుండి పెద్ద షోరూమ్‌ల వరకు అందరూ డిజిటల్ చెల్లింపులనే ప్రాధాన్యతనిస్తున్నారు. ఈ డిజిటలైజేషన్ వల్ల ఆర్థిక పారదర్శకత పెరిగింది మరియు పన్ను వసూళ్లు మెరుగుపడ్డాయి. నగదు రహిత లావాదేవీల వల్ల నల్లధనం అదుపులోకి రావడమే కాకుండా, ప్రజలకు సురక్షితమైన బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి వచ్చాయి.ప్రభుత్వం ప్రవేశపెట్టిన డిజిటల్ ఇండియా కార్యక్రమం వల్ల ఈ-కామర్స్ రంగం అద్భుతమైన వృద్ధిని సాధించింది. ఆన్‌లైన్ షాపింగ్, ఫుడ్ డెలివరీ మరియు డిజిటల్ ఎడ్యుకేషన్ వంటి రంగాలు లక్షలాది మందికి ఉపాధిని కల్పిస్తున్నాయి.

**గ్రీన్ ఎనర్జీ మరియు నెట్ జీరో లక్ష్యాలు:** పర్యావరణ పరిరక్షణతో కూడిన ఆర్థిక వృద్ధిని భారత్ లక్ష్యంగా పెట్టుకుంది. 2025లో సౌర విద్యుత్ మరియు పవన విద్యుత్ ఉత్పత్తిలో భారత్ భారీ లక్ష్యాలను అధిగమించింది. పునరుత్పాదక ఇంధన రంగంలో ప్రపంచంలోనే భారత్ కీలక పాత్ర పోషిస్తోంది.ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం ఈ ఏడాది గణనీయంగా పెరిగింది. పెట్రోల్, డీజిల్ ధరలపై ఆధారపడటం తగ్గించడమే కాకుండా, పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడంలో భారత్ విజయవంతమైంది. ఇవి దేశ ఇంధన దిగుమతుల భారాన్ని కూడా తగ్గించాయి. ప్రభుత్వం గ్రీన్ హైడ్రోజన్ మిషన్ ద్వారా భవిష్యత్తు ఇంధనంపై దృష్టి సారించింది. దీనివల్ల భారీ పరిశ్రమలకు తక్కువ ఖర్చుతో కూడిన పర్యావరణ హిత ఇంధనం అందుబాటులోకి వస్తోంది. ఇది దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వానికి మార్గం సుగమం చేస్తోంది.

**వ్యవసాయ రంగం - గ్రామీణ విప్లవం:** భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకైన వ్యవసాయం 2025లో కొత్త పుంతలు తొక్కింది. టెక్నాలజీ మరియు డ్రోన్ల వినియోగం వల్ల సాగు ఖర్చు తగ్గి దిగుబడి పెరిగింది. పీఎం-కిసాన్ వంటి పథకాలు రైతులకు ఆర్థిక భద్రతను కల్పించాయి.అగ్రి-టెక్ స్టార్టప్‌ల సంఖ్య పెరగడం వల్ల రైతులు తమ పండించిన పంటను మధ్యవర్తులు లేకుండా నేరుగా మార్కెట్లకు అమ్ముకోగలుగుతున్నారు. దీనివల్ల రైతు ఆదాయం పెరగడమే కాకుండా, గ్రామీణ ప్రాంతాల్లో కొనుగోలు శక్తి కూడా మెరుగుపడింది.ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో వచ్చిన పెట్టుబడుల వల్ల పంట నష్టాలు తగ్గి, ఆహార ఉత్పత్తుల ఎగుమతులు పెరిగాయి. ఇది గ్రామీణ యువతకు స్థానికంగానే ఉపాధిని అందిస్తూ, పట్టణాలకు వలసలను తగ్గించడంలో సహాయపడింది.

**మహిళా సాధికారత మరియు శ్రామిక శక్తి:** 2025లో భారత ఆర్థిక వృద్ధిలో మహిళల భాగస్వామ్యం గణనీయంగా పెరిగింది. ప్రభుత్వ రాయితీలు మరియు స్టార్టప్ ప్రోత్సాహకాల వల్ల మహిళా పారిశ్రామికవేత్తలు కొత్త చరిత్ర సృష్టిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయక బృందాలు చిన్న తరహా పరిశ్రమలకు కేంద్రాలుగా మారాయి.కార్పొరేట్ రంగంలో మరియు ప్రభుత్వ విభాగాల్లో మహిళా ఉపాధి రేటు పెరగడం వల్ల కుటుంబ ఆదాయాలు మెరుగుపడ్డాయి. ఇది నేరుగా దేశ జిడిపి వృద్ధికి దోహదపడింది. మహిళలకు ఆర్థిక స్వేచ్ఛ లభించడం వల్ల వినియోగం కూడా పెరిగింది.మహిళల విద్య మరియు నైపుణ్యాభివృద్ధిపై ప్రభుత్వం పెట్టిన పెట్టుబడులు ఇప్పుడు ఫలితాలనిస్తున్నాయి. ప్రతి రంగంలోనూ మహిళలు కీలక బాధ్యతలు చేపట్టడం వల్ల ఆర్థిక వ్యవస్థ మరింత సమతుల్యంగా మరియు వేగంగా అభివృద్ధి చెందుతోంది.

2025లో సాధించిన ఆర్థిక విజయాలు భారతదేశాన్ని ప్రపంచ వేదికపై ఒక శక్తివంతమైన దేశంగా నిలబెట్టాయి. అయితే, మారుతున్న అంతర్జాతీయ పరిస్థితులు మరియు సాంకేతిక మార్పుల దృష్ట్యా, 2026లో కూడా ఇదే వృద్ధిని కొనసాగించడం దేశానికి సవాలుతో కూడుకున్న పని. కేవలం గత విజయాలతో సరిపెట్టుకోకుండా, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా కొత్త సంస్కరణలను చేపట్టడం ద్వారానే భారతదేశం తన ఆర్థిక లక్ష్యాలను చేరుకోగలదు. స్థిరమైన అభివృద్ధి, సామాజిక సమానత్వం మరియు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం ద్వారా భారత్ 2026లో మరో అద్భుతమైన వృద్ధిని నమోదు చేయగలదు.

**నైపుణ్యాభివృద్ధి - ఉపాధి కల్పన:** భారతదేశంలో ఉన్న యువశక్తిని దేశాభివృద్ధికి ఇంధనంగా మార్చుకోవాలంటే వారికి సరైన నైపుణ్యాలను అందించడం అత్యవసరం. 2026 నాటికి కృత్రిమ మేధ మరియు సరికొత్త సాంకేతిక పరిజ్ఞానం పారిశ్రామిక రంగంలో కీలక పాత్ర పోషించనున్నాయి. కాబట్టి, యువతకు కాలం చెల్లిన విద్యను కాకుండా, ప్రస్తుత పరిశ్రమల అవసరాలకు తగ్గట్లుగా శిక్షణ ఇవ్వాలి.కేవలం నైపుణ్యాలు పెంచడమే కాకుండా, పెరుగుతున్న జనాభాకు తగినట్లుగా ప్రతి ఏటా లక్షలాది కొత్త ఉద్యోగాలను సృష్టించడం ప్రభుత్వం ముందున్న అతిపెద్ద సవాలు. దీనికోసం ప్రైవేట్ రంగంతో కలిసి ప్రభుత్వం మరిన్ని భాగస్వామ్య ఒప్పందాలను కుదుర్చుకోవాలి. చిన్న తరహా పరిశ్రమలకు ప్రోత్సాహకాలు అందించడం ద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలను పెంచవచ్చు. పరిశ్రమలకు మరియు విద్యాసంస్థలకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించాలి. విద్యార్థులు చదువు పూర్తి చేసిన వెంటనే నేరుగా పనిలో చేరేలా వృత్తి విద్యా కోర్సులకు ప్రాధాన్యత ఇవ్వాలి. దీనివల్ల నిరుద్యోగ సమస్య తగ్గడమే కాకుండా, దేశీయ ఉత్పత్తి సామర్థ్యం కూడా పెరుగుతుంది.

**వ్యవసాయ రంగంలో ఆధునీకీకరణ:** భారతదేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకైన వ్యవసాయాన్ని కేవలం సంప్రదాయ పద్ధతుల్లోనే కాకుండా, ఆధునిక సాంకేతికతతో అనుసంధానించాలి. 2026లో వాతావరణ మార్పుల ప్రభావం వ్యవసాయంపై పడకుండా ఉండేందుకు ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను బలోపేతం చేయాలి. నీటి వినియోగాన్ని తగ్గించే బిందు సేద్యం వంటి పద్ధతులను ప్రతి రైతుకూ అందుబాటులోకి తీసుకురావాలి.పంట పండించడమే కాకుండా, దానిని భద్రపరచడానికి శీతలీకరణ గిడ్డంగుల సంఖ్యను పెంచాలి. దీనివల్ల రైతులు తమ ఉత్పత్తులను తక్కువ ధరకే అమ్ముకోకుండా, సరైన ధర వచ్చే వరకు నిల్వ చేసుకునే అవకాశం ఉంటుంది. ఆహార శుద్ధి పరిశ్రమలను గ్రామీణ ప్రాంతాల్లోనే ఏర్పాటు చేయడం ద్వారా రైతులకు అదనపు ఆదాయం లభిస్తుంది.రైతులకు అందే రుణ సౌకర్యాలను మరింత సరళతరం చేయాలి. విత్తనాల కొనుగోలు నుండి మార్కెటింగ్ వరకు ప్రతి దశలోనూ డిజిటల్ మాధ్యమాలను ఉపయోగించడం వల్ల పారదర్శకత పెరుగుతుంది. సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం ద్వారా అంతర్జాతీయ మార్కెట్లో భారతీయ ఉత్పత్తులకు గిరాకీ పెరిగేలా చూడాలి.

**మౌలిక సదుపాయాల విస్తరణ:** దేశాభివృద్ధిలో రవాణా మరియు మౌలిక సదుపాయాలు కీలక పాత్ర పోషిస్తాయి. 2026లో పారిశ్రామిక కారిడార్ల నిర్మాణాన్ని వేగవంతం చేయడం ద్వారా వస్తువుల రవాణా ఖర్చులను తగ్గించవచ్చు. జాతీయ రహదారులతో పాటు, ఓడరేవులను మరియు రైల్వే వ్యవస్థను అనుసంధానించే మల్టీ మోడల్ రవాణా వ్యవస్థపై దృష్టి పెట్టాలి.పట్టణ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు మెట్రో రైలు ప్రాజెక్టులను చిన్న నగరాలకు కూడా విస్తరించాలి. దీనివల్ల నగరాల్లో వ్యాపార కార్యకలాపాలు సులభతరమవుతాయి. స్మార్ట్ సిటీ ప్రాజెక్టులను కేవలం కాగితాల మీదనే కాకుండా, క్షేత్రస్థాయిలో పూర్తి స్థాయిలో అమలు చేయాలి.గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సౌకర్యాన్ని మరింత వేగవంతం చేయాలి. డిజిటల్ మౌలిక సదుపాయాలు పెరిగితేనే విద్య, వైద్యం మరియు బ్యాంకింగ్ సేవలు మారుమూల ప్రాంతాలకు చేరుతాయి. మౌలిక సదుపాయాలపై పెట్టే ప్రతి రూపాయి పెట్టుబడి భవిష్యత్తులో దేశానికి పదింతల లాభాన్ని చేకూరుస్తుంది.

**గ్రీన్ ఎనర్జీ మరియు స్థిరమైన అభివృద్ధి:** కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడుకోవడంలో భారత్ ముందుండాలి. 2026 నాటికి బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రాలపై ఆధారపడటం తగ్గించి, సౌర మరియు పవన విద్యుత్ ఉత్పత్తిని గణనీయంగా పెంచాలి. గ్రీన్ హైడ్రోజన్ వంటి భవిష్యత్తు ఇంధన వనరుల పరిశోధనపై అధిక నిధులు వెచ్చించాలి.ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని సామాన్య ప్రజలకు అందుబాటు లోకి తీసుకురావాలి. దీనికోసం దేశవ్యాప్తంగా చార్జింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం మరియు బ్యాటరీల తయారీలో స్వయం సమృద్ధి సాధించడం ముఖ్యం. దీనివల్ల పెట్రోల్ మరియు డీజిల్ దిగుమతుల భారం తగ్గి దేశ ఖజానా ఆదా అవుతుంది.పరిశ్రమల నుండి వచ్చే వ్యర్థాలను సరిగ్గా నిర్వహించడం మరియు రీసైక్లింగ్ పద్ధతులను అమలు చేయడం తప్పనిసరి చేయాలి. ప్లాస్టిక్ రహిత ఆర్థిక వ్యవస్థను నిర్మించడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చు. అభివృద్ధి అనేది కేవలం అంకెల్లోనే కాకుండా, పర్యావరణ పరిరక్షణలో కూడా కనిపించాలి.

**తయారీ రంగంలో స్వయం సమృద్ధి:** మేక్ ఇన్ ఇండియా కార్యక్రమాన్ని మరింత బలోపేతం చేస్తూ, ప్రపంచానికి తయారీ కేంద్రంగా భారత్ మారాలి. కేవలం అసెంబ్లీ చేయడం కాకుండా, వస్తువులకు అవసరమైన భాగాలను దేశీయంగానే తయారు చేసేలా పరిశ్రమలను ప్రోత్సహించాలి. ముఖ్యంగా సెమీకండక్టర్లు మరియు ఎలక్ట్రానిక్ విడిభాగాల తయారీలో భారత్ అగ్రస్థానంలో నిలవాలి.చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమలకు పన్ను రాయితీలు మరియు సులభ రుణాలను అందించాలి. ఈ పరిశ్రమలే దేశంలో అత్యధిక ఉపాధిని కల్పిస్తాయి కాబట్టి, వాటిని బలోపేతం చేయడం ద్వారా ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేయవచ్చు. ఎగుమతులపై ఆధారపడటం తగ్గించి, ప్రపంచ దేశాలకు మన ఉత్పత్తులను ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలి.రక్షణ రంగం మరియు అంతరిక్ష పరిశోధనల్లో స్వదేశీ పరిజ్ఞానాన్ని మరింతగా ఉపయోగించాలి. దీనివల్ల రక్షణ వ్యయం తగ్గడమే కాకుండా, ఇతర దేశాలకు రక్షణ పరికరాలను అమ్మడం ద్వారా విదేశీ మారక ద్రవ్యాన్ని సంపాదించవచ్చు. తయారీ రంగం బలోపేతమైతేనే దేశం నిజమైన స్వయం సమృద్ధిని సాధిస్తుంది.

వైద్య మరియు ఆరోగ్య రంగ సంస్కరణలు:
ప్రజారోగ్యం మెరుగుపడితేనే దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుంది. 2026 నాటికి దేశంలోని ప్రతి పౌరుడికి సరసమైన ధరలో నాణ్యమైన వైద్యం అందేలా చూడాలి. ప్రభుత్వ ఆసుపత్రుల ఆధునీకరణ మరియు మారుమూల గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల బలోపేతం అత్యవసరం.టెలిమెడిసిన్ వంటి సాంకేతికతను ఉపయోగించి గ్రామీణ ప్రజలకు నిపుణులైన వైద్యుల సలహాలను అందించాలి. ఆరోగ్య బీమా పథకాలను మరింత విస్తృతం చేసి, పేద ప్రజలకు వైద్య ఖర్చుల భారం తగ్గించాలి. ఔషధ తయారీలో భారత్ ఇప్పటికే అగ్రస్థానంలో ఉన్నప్పటికీ, మరిన్ని కొత్త పరిశోధనలు జరగాలి.అంటువ్యాధుల నివారణ మరియు పౌష్టికాహార లోపంపై ప్రత్యేక దృష్టి సారించాలి. ముఖ్యంగా మహిళలు మరియు పిల్లల్లో రక్తహీనత సమస్యను తగ్గించేందుకు పోషకాహార పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలి. ఆరోగ్యవంతుడైన భారతీయుడే ఆర్థిక వ్యవస్థకు అసలైన ఆస్తి.

**ఎగుమతుల వైవిధ్యం-అంతర్జాతీయ వాణిజ్యం:** భారతదేశంకేవలం ఐటీ సేవలపైనే ఆధారపడకుండా, తన ఎగుమతుల జాబితాను విస్తరించుకోవాలి. 2026 నాటికి వ్యవసాయ ఉత్పత్తులు, ఔషధాలు, ఎలక్ట్రానిక్స్ మరియు హస్త కళల ఎగుమతులను పెంచాలి. కొత్త దేశాలతో వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకోవడం ద్వారా అంతర్జాతీయ మార్కెట్లో మన వాటాను పెంచుకోవాలి. నాణ్యతా ప్రమాణాలను పెంచడం ద్వారా ప్రపంచ మార్కెట్లో భారతీయ వస్తువులకు ఉన్న పేరును నిలబెట్టుకోవాలి. ఎగుమతిదారులకు అవసరమైన మౌలిక సదుపాయాలను ఓడరేవుల వద్ద కల్పించాలి. లాజిస్టిక్స్ ఖర్చులను తగ్గించడం ద్వారా మన ఉత్పత్తులు ప్రపంచ మార్కెట్లో పోటీని తట్టుకోగలవు. విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు వ్యాపార అనుకూల వాతావరణాన్ని మెరుగుపరచాలి. పన్ను విధానాలను సరళతరం చేయడం మరియు అనుమ తుల ప్రక్రియను వేగవంతం చేయడం వల్ల మరిన్ని అంతర్జాతీయ కంపెనీలు భారత్ వైపు చూస్తాయి. ఎగుమతులు పెరిగితేనే దేశ జిడిపి గణనీయంగా పెరుగుతుంది.

**విద్యా వ్యవస్థలో మార్పులు:** భవిష్యత్తు తరాలను సిద్ధం చేయడంలో విద్యా వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుంది. 2026 నాటికి ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత విద్య వరకు నాణ్యతా ప్రమాణాలను పెంచాలి. కేవలం మార్కుల కోసం కాకుండా, సృజనాత్మకత మరియు సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించేలా పాఠ్య ప్రణాళికలు ఉండాలి.పరిశోధన మరియు అభివృద్ధిపై విద్యా సంస్థలు దృష్టి పెట్టేలా నిధులను కేటాయించాలి. విశ్వవిద్యాలయాలు మరియు పరిశ్రమల మధ్య సహకారం పెరిగితేనే కొత్త ఆవిష్కరణలు సాధ్యమవుతాయి. విదేశీ విశ్వవిద్యాలయాలు భారత్‌లో క్యాంపస్‌లను ఏర్పాటు చేసేలా ప్రోత్సహించాలి. డిజిటల్ విద్యను ప్రతి పేద విద్యార్థికి అందుబాటులోకి తీసుకురావాలి. స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు మరియు ఉచిత ఆన్‌లైన్ కోర్సుల ద్వారా విద్యా అసమానతలను తొలగించవచ్చు.

**విద్యావంతుడైన పౌరుడే దేశాభివృద్ధికి నిజమైన వారధి.**
2025లో భారతదేశం సాధించిన అద్భుతమైన వృద్ధి కేవలం ఒక ప్రారంభం మాత్రమే. పటిష్టమైన ఆర్థిక పునాదులు, డిజిటల్ విప్లవం మరియు యువశక్తి యొక్క అపారమైన సామర్థ్యం రాబోయే 2026 సంవత్సరంలో మన దేశాన్ని మరింత ఉన్నత స్థానానికి తీసుకెళ్లనున్నాయి. పైన చర్చించిన పది కీలక వ్యూహాలను చిత్తశుద్ధితో అమలు చేస్తే, భారతదేశం కేవలం ప్రపంచ ఆర్థిక శక్తిగా ఎదగడమే కాకుండా, సమ్మిళిత మరియు సుస్థిర అభివృద్ధికి ప్రపంచానికే ఒక రోల్ మోడల్‌గా నిలుస్తుంది. ప్రభుత్వం, ప్రైవేట్ రంగాలు మరియు పౌరులు సమన్వయంతో ముందడుగు వేసినప్పుడే వికసిత్ భారత్ అనే కల సాకారం అవుతుంది.

# ముక్కోటి ఏకాదశి - వైకుంఠ ద్వార దర్శన భాగ్యం !

**ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి**
**9949700037**

త్రిమూర్తుల్లో ఒకరైన శ్రీ మహావిష్ణువు సృష్టికి పాలకుడు, స్థితికర్త, సర్వేశ్వరుడు. ఆయన శంఖం, చక్రం, గత ధరించి శేషనాగుపై పవళిస్తారు. స్వామివారి పాదాల చెంత లక్ష్మీదేవి ఉంటుంది. శ్రీమహావిష్ణువును నారాయణ, శ్రీహరి వంటి పేర్లతో కూడా పిలుచుకుంటాం. శ్రీ లక్ష్మీనారాయణుడికి ఎంతో ఇష్టమైన రోజుగా వైకుంఠ ఏకాదశిని పాటిస్తున్నాం. క్షీరసాగర మథనం జరిగి హాలాహలం, అమృతం ఉద్భవించిన పవిత్ర రోజుగా వైకుంఠ ఏకాదశిని పాటిస్తున్నాం. పుష్య మాసం, శుక్లపక్ష ఏకాదశిని "వైకుంఠ ఏకాదశి" లేదా "ముక్కోటి ఏకాదశి" లేదా "మోక్షగుండం ఏకాదశి" పర్వదినంగా నిర్వహించుతుంటాం. ఈ శుభ దినం రోజు వైష్ణవ ఆలయాల్లో వైకుంఠ ద్వార దర్శనం ఏర్పాటు చేయబడుతుంది.

**వైకుంఠ ఏకాదశి ప్రత్యేక పూజలు:**
వేకువ జామున స్నానాలు చేసి, ధూప దీప నైవేద్యాలు సమర్పించి, ఉపవాస దీక్షను పాటించి, శ్రీమన్నారాయణున్ని పూజించడం, విష్ణు సహస్రనామ పారాయణం, గీతా పారాయణం, భగవాన్ నామ సంకీర్తనం,ఉత్తర ద్వార దర్శన సమయంలో శ్రీమహావిష్ణువు మూడు కోట్ల దేవతలతో కలిసి భక్తులకు దర్శనమిస్తారని, అందువల్లనే దీనికి ముక్కోటి ఏకాదశి అని పిలుస్తున్నాం. వైకుంఠ ద్వారం గుండా దైవ దర్శనాలు చేసుకోవడం జరుగుతుంది. వైకుంఠ ఏకాదశి పాటించిన భక్తులకు సంతానం, సౌభాగ్యం, దీర్ఘాయువు, సకల పాపాలు హరిస్తాయని నమ్ముతారు. వైకుంఠ వాసుడైన శ్రీ మహావిష్ణువును ఉత్తర ద్వార దర్శనం చేసుకోవడం వల్ల సకల శ్రేయస్సులు కలుగుతాయని, పునర్జన్మ ఉండదని విశ్వాసం. ఈ రోజు శ్రీ మహావిష్ణువు యోగ నిద్ర నుంచి మేల్కొంటారని పండితులు చెబుతారు. వైకుంఠ ద్వార దర్శనంతో మోక్షం సిద్ధిస్తుందని పురాణాలు వెల్లడిస్తున్నాయి.

**ఓం నమోః భగవతే వాసుదేవాయా :**
30 డిసెంబర్ 2025 వేకువ జామున 7:51 గంటలకు ప్రారంభమైన వైకుంఠ ఏకాదశి తిథి 31 డిసెంబర్ రోజు ఉదయం 5:01 గంటలకు ముగుస్తుంది. ఈ శుభ దినం రోజు శ్రీ మహా గణపతిని పూజించిన తర్వాత శ్రీ మహావిష్ణువు, శ్రీ లక్ష్మీదేవిలకు ఆవు నేతితో దీపాలను వెలిగించి, షోడసోపచార పూజ చేసి, తులసి దళాలు సమర్పించాలి. "ఓం నమో భగవతే వాసుదేవాయా " అని మనసులో అనుకుంటూ పూజలు నిర్వహించడం, వైకుంఠ ద్వార దర్శనాలు చేసుకోవడం జరగాలి. వైకుంఠ ఏకాదశి రోజు శ్రీరంగం, తిరుమల దేవాలయాల్లో అశేష భక్తజనుల కోలాహలాలు, ప్రత్యేక పూజలు జరుగుతాయి.

ముక్కోటి ఏకాదశి రోజు ఉపవాస వ్రతం, గోవింద నామ స్మరణం, బ్రహ్మచర్యం, సత్య వాక్కులు, సదాలోచనలు, మంచి పనులు, రాత్రి జాగరణ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించాలి. మన దేహమే దేవాలయం, హృదయ గుహలో పరమాత్ముడు ఉంటాడని శాస్త్ర చెబుతున్నది. ఉపవాసం ద్వారా పంచ కర్మేంద్రియాలు, పంచ జ్ఞానేంద్రియాలు, మనస్సు అనబడే 11



ఇంద్రియాలను నిగ్రహించుకుంటూ దైవారాధన చేయడం జరుగుతుంది. వీటన్నింటిని గమనించి , ఆలకించు చేసుకొని వైకుంఠ ఏకాదశి వ్రతాన్ని నిష్టగా ఆచరించి, జ్ఞానవంతులు కావాలని కోరుకుందాం.

పాఠకులు, విశ్లేషకులు, రచయితలు తమ రచనలు క్రింది చిరునామాకు గానీ సూర్య దినపత్రిక ఎడిటోరియల్ మెయిల్ ఐడికి గాని పంపవలసినదిగా మనవి మెయిల్ :
suryaeditpage@gmail.com

SPR publications, Surya Soudha, Plot.No: 185, M.C.H. NO.258/1/185, siddi vinayaka nagar, Ayyappa Society Opp: Hi-Tech City, Hyderabad - 500 072.

## జెఎస్‌డబ్ల్యూ ఎంజి మోటార్ ఇండియా ఈవీల అష్యూర్డ్ బైబ్యాక్



జెఎస్ డబ్ల్యూ ఎంజి మోటార్ ఇండియా, ఈవీ యాజమాన్యాన్ని వినియోగదారుల కోసం మరింత సులభం మరియు నిరపరమైనదిగా మార్చే లక్ష్యంతో పరిశ్రమలో తొలిసారిగా ఒక వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఈ రోజు ప్రకటించింది. ఇప్పటివరకు 3 సంవత్సరాల వరకు మాత్రమే అందుబాటులో ఉన్న లక అష్యూర్డ్ బైబ్యాక్ సౌకర్యాన్ని, ఇప్పుడు 5 సంవత్సరాల వరకు విస్తరించిన తొలి కార్-బ్రాండ్‌గా మోటార్ నిలిచింది. నిర్దిష్ట కాలపరిమితుల ముగింపులో స్థిరమైన రీసేల్ విలువను హామీ ఇవ్వడం ద్వారా, ఈ కార్యక్రమం వినియోగదారుల నమ్మకాన్ని మరింత బలోపేతం చేస్తుంది.:ఈ కొత్త, ప్రత్యేకమైన కార్యక్రమం ద్వారా, వినియోగదారులు ఎంచుకునే ప్లాన్‌ను బట్టి జెఎస్ డబ్ల్యూ ఎంజి ఈవీ యజమానులు 3, 4 లేదా 5 సంవత్సరాల తరువాత హామీ ఉన్న రీసేల్ విలువను పొందగలుగుతారు.

ఈ వినూత్న బైబ్యాక్ కార్యక్రమంపై జెఎస్ డబ్ల్యూ ఎంజిమోటార్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అనురాగ్ మెహ్రోత్రా మాట్లాడుతూ "వినియోగదారులకే కేంద్రంగా ఉన్న బ్రాండ్‌గా, ఎంజీ ఎప్పుడూ బి-ఎ-ఎ-ఎస్ (బ్యాటరీ-యాజ్-ఎ-సర్వీస్), ఈవీ బ్యాటరీలపై లైఫ్‌టైమ్ వారంటీ వంటి కార్యక్రమాలను పరిచయం చేస్తూ, యాజమాన్యాన్ని ఆనందదాయకమైన మొబిలిటీ అనుభవంగా మార్చేందుకు కృషి చేస్తోంది. ఈవీ కొనుగోలును పరిశీలిస్తున్న అనేక మంది వినియోగదారులకు రీసేల్ విలువ ఒక ముఖ్యమైన అంశంగా ఉంది. లాక్‌టన్ ఇండియా ఇన్సూరెన్స్ (బ్రోకింగ్ అండ్ అడ్వైజరీ లిమిటెడ్ ద్వారా, జునో జనరల్ ఇన్సూరెన్స్ భాగస్వామ్యంతో సులభతరం చేసిన పరిశ్రమలో తొలిసారైన ఎంజీ వ్యాల్యూ ప్రామిస్ ప్రోగ్రామ్ (అష్యూర్డ్ బైబ్యాక్) ద్వారా, జెఎస్ డబ్ల్యూ ఎంజిఈవీ యజమానులకు సంపూర్ణమనశ్శాంతిని అందించాలనుకుంటున్నాం. ఈ కార్యక్రమం ద్వారా, వినియోగదారులు 3 నుంచి 5 సంవత్సరాల వరకు కాలపరిమితిని ఎంచుకునే అవకాశంతో, హామీ ఉన్న రీసేల్ విలువను మేము అందిస్తున్నాం. కొనుగోలుదారుల ప్రధాన ఆందోళనల్లో ఒకదాన్ని తొలగించి, ఎలక్ట్రిక్ మొబిలిటీపై మరింత బలమైన నమ్మకాన్ని నిర్మించడం ద్వారా, భారతదేశంలోని ఈవీ మార్కెట్ విస్తరణలో ఈ కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని మేము విశ్వసిస్తున్నాం." అన్నారు.

## ఎబిడి మాస్ట్రో ఓధ్ ఐరిష్ విస్కీ




ముంబై : అలైడ్ బ్లెండర్స్ & డిస్టిల్లర్స్ పర్-ప్రీమియం మరియు లగ్జరీ స్పిరిట్స్ అనుబంధ సంస్థ ఏబిడి మాస్ట్రో ప్రైవేట్ లిమిటెడ్, ఓధ్ ఐరిష్ విస్కీని ప్రారంభించింది, దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న విభాగాల్లో ఒకదానిలోకి బలమైన ప్రవేశం చేసింది. సూపర్ స్టార్ రణవీర్ సింగ్ సహ-స్థాపించిన ఏబిడి మాస్ట్రో, దాని సృజనాత్మక భాగస్వామిగా కూడా పనిచేస్తున్నారు, భారతీయ మరియు ప్రపంచ ప్రేక్షకుల కోసం ప్రపంచ స్థాయి బ్రాండ్‌లను సృష్టించడంపై దృష్టి సారించారు. ఏబిడి మాస్ట్రో మేనేజింగ్ డైరెక్టర్ విక్రమ్ బసు మాట్లాడుతూ, "నిజంగా ప్రామాణికమైన ఐరిష్ వ్యక్తీకరణ, ఓధ్ ఐరిష్ విస్కీ శతాబ్దాల స్వేదన వారసత్వాన్ని కలిగి ఉంది, అదే సమయంలో సమకాలీన అంగిలితో ప్రతిధ్వనిస్తుంది. సూపర్-ప్రీమియం స్పిరిట్ యొక్క పోర్ట్‌ఫోలియోను మేము రూపొందిస్తున్నప్పుడు ఓధ్ ఒక వ్యూహాత్మక ముందడుగు. ఐరిష్ విస్కీ ఇటీవలి సంవత్సరాలలో బలమైన వృద్ధిని సాధించింది మరియు సూపర్-ప్రీమియం, నాణ్యమైన ఉత్పత్తి, ప్రస్తుత మార్కెట్ ఆటగాళ్ల కంటే న్యాయంగా ఎక్కువగా ఇండెక్స్ చేయబడింది, ఇది పరిజ్ఞానం మరియు వివేచన కలిగిన వారిని ఆకర్షించాలి". అన్నారు.

### 3,000 కోట్లను దాటిన ముత్తూట్ మైక్రోఫిన్ వ్యక్తిగత రుణాలు

భారతదేశంలోని ప్రముఖ నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ-మైక్రో ఫైనాన్స్ ఇన్‌స్టిట్యూషన్ లలో ముత్తూట్ మైక్రోఫిన్ లిమిటెడ్ వ్యక్తిగత రుణ పోర్ట్‌ఫోలియో ఏయుఎం రూ. 1000 కోట్లు దాటింది, అయితే కంపెనీ మొత్తం ఏయుఎం రూ. 13,000 కోట్లను అధిగమించింది. ఈ మైలురాయి గురించి ముత్తూట్ మైక్రోఫిన్ ఛైర్మన్ మరియు నాన్-ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీ థామస్ ముత్తూట్ మాట్లాడుతూ "ఈ విజయాలు మా వృద్ధి ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తాయి. మైక్రోఫైనాన్స్ మా వ్యాపారానికి పునాదిగా ఉన్నప్పటికీ, వ్యక్తిగత రుణాలలో మా క్రమాంకనం చేయబడిన విస్తరణ మరింత స్థితిస్థాపకంగా మరియు సమతుల్య పోర్ట్‌ఫోలియోను నిర్మించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పురోగతి బాధ్యతాయుతమైన వృద్ధి, బలమైన పాలన మరియు మా కస్టమర్‌లు మరియు వాటాదారులకు స్థిరమైన విలువను అందించడం పట్ల మా దీర్ఘకాలిక నిబద్ధతను ప్రతిబింబిస్తుంది." అన్నారు.

## అదరగొట్టిన ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్

బెంగళూరు : ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ (ఉజ్జీవన్ ఎస్ఎఫ్బి) 2025 క్యాలెండర్ సంవత్సరంలో అత్యంత ఆకర్షణీయమైన పనితీరును నివేదించింది. దీనికి అనుకూలమైన ఆర్థిక నేపథ్యం, మెరుగైన లిక్విడిటీ పరిస్థితులు, దాని వైవిధ్యభరితమైన రిటైల్ వ్యూహాన్ని క్రమశిక్షణతో అమలు చేయడం వంటి అంశాలు మద్దతు ఇచ్చాయి. సురక్షిత రుణాలలో బలమైన విస్తరణ, స్థిరమైన డిపాజిట్ సమీకరణ , డిజిటల్ మరియు కార్యాచరణ సామర్థ్యంలో నిరంతర పురోగతి ద్వారా బ్యాంక్ విస్తృత వృద్ధిని సాధించింది. అఫర్డబుల్ హౌసింగ్, మైక్రో-మార్ట్‌గేజ్‌లు, ఎంఎస్ఎంఈ , గోల్డ్ లోన్‌లు, వాహన రుణాలు , అగ్రి-బ్యాంకింగ్ వంటి సురక్షిత పోర్ట్‌ఫోలియోలలో బ్యాంక్ స్థిరమైన వృద్ధిని సాధించింది. ఈ వృద్ధికి మెరుగైన పంపిణీ బలం, అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలో లోతుగా చొచ్చుకుపోవడం, బలమైన క్రాస్-సెల్ మరియు మెరుగైన కస్టమర్ సెగ్మెంటేషన్ ద్వారా మద్దతు లభించింది, ఇది చక్కటి ఆస్తి మిశ్రమానికి మరింత దోహదపడుతుంది. ఉజ్జీవన్ ఎస్ఎఫ్బి చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ శ్రీ సదానంద్ బాలకృష్ణ కామత్ మాట్లాడుతూ, "2025లో ఆర్థిక సేవల పరిశ్రమలో మొత్తం క్రెడిట్ వాతావరణం రిస్క్ మెట్రిక్స్‌లో నిరంతర మెరుగుదలకు దోహదపడింది. బలమైన అండర్ రైటింగ్ ప్రమాణాలు , వైవిధ్యభరితమైన క్రెడిట్ బుక్ మెరుగైన ఆస్తి నాణ్యత , మొత్తం పోర్ట్‌ఫోలియో స్థిరత్వానికి దోహదపడింది. అప్‌గ్రేడ్ చేయబడిన మొబైల్ బ్యాంకింగ్ సామర్థ్యాలు, ఆటోమేటెడ్ సర్వీస్ జర్నీలు, డేటా-ఆధారిత క్రెడిట్ నిర్ణయ సాధనాలతో ఉజ్జీవన్ ఎస్ఎఫ్బి తన డిజిటల్ ప్రోగ్రామ్‌లను వేగవంతం చేసింది. కస్టమర్ విభాగాలలో అధిక డిజిటల్ స్వీకరణ ఆపరేటింగ్ సామర్థ్యాన్ని బలోపేతం చేసింది , సేవా అనుభవాన్ని పెంచింది. ప్రాసెస్ ఆప్టిమైజేషన్, స్మార్ట్ బ్రాంచ్ కార్యకలాపాలు నెట్‌వర్క్ అంతటా ఖర్చు నిర్వహణ కార్యక్రమాలకు మరింత మద్దతు ఇచ్చాయి" అని అన్నారు.

### మారియట్ ఎగ్జిక్యూటివ్ అపార్ట్‌మెంట్స్‌ను కొనుగోలు చేయనున్న వైస్రాయ్ హోటల్స్




బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ కు సమర్పించిన దాఖలాలో, 2025 డిసెంబర్ 27న నిర్వహించిన ఎక్స్‌ట్రా ఆర్డినరీ జనరల్ మీటింగ్‌లో వైస్రాయ్ హోటల్స్ లిమిటెడ్ షేర్‌హోల్డర్లు, ఎస్ఎల్ఎన్ టెర్మినస్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ను కొనుగోలు చేయడానికి ఆమోదం తెలిపినట్లు కంపెనీ వెల్లడించింది. హైదరాబాద్‌కు చెందిన హాస్పిటాలిటీ సంస్థ వైస్రాయ్ హోటల్స్ లిమిటెడ్, గచ్చిబౌలిలోని ఎస్ఎల్ఎన్ టెర్మినస్‌లో ఉన్న మారియట్ ఎగ్జిక్యూటివ్ అపార్ట్‌మెంట్స్‌ను కలిగిన ఎస్ఎల్ఎన్ టెర్మినస్ హోటల్స్ & రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ను 206 కోట్లకు కొనుగోలు చేసే అవకాశాన్ని పరిశీలిస్తోంది. ప్రస్తుతం కంపెనీ వద్ద సుమారు 470 కీస్ ఉండగా, హైదరాబాద్‌లో రాబోయే గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్ట్ ద్వారా మరో సుమారు 200 కీస్‌ను జోడించి, 2030 నాటికి మొత్తం 1,000 కీస్‌కు చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రతిపాదిత లావాదేవీ భూమి కొనుగోలు, ఇంటర్-కార్పొరేట్ లోన్ల పరిష్కారం మరియు ఈక్విటీ షేర్ల స్వాధీనాన్ని కలిగి ఉంటుంది. మొత్తం 206 కోట్లలో 105.66 కోట్లు భూమికి, 40.67 కోట్లు లోన్ల పరిష్కారానికి, 59.67 కోట్లు షేర్ల కొనుగోలుకు కేటాయించబడ్డాయి. డ్యూ డిలిజెన్స్ మరియు అవసరమైన అనుమతులు పూర్తైన తర్వాత, ఎస్ఎల్ఎన్ టెర్మినస్ హోటల్స్ & రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ పూర్తిగా వైస్రాయ్ హోటల్స్ లిమిటెడ్‌కు చెందిన అనుబంధ సంస్థగా మారనుంది.మారియట్ ఎగ్జిక్యూటివ్ అపార్ట్‌మెంట్స్ ఆస్తి సుమారు 1,65,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో విస్తరించిన 75 ఎగ్జిక్యూటివ్ గదులతో పాటు, విస్తృత పార్కింగ్ సౌకర్యాలు మరియు 2,400 చదరపు గజాలకు పైగా విడగొట్టని భూమి వాటాను కలిగి ఉంది. ఆర్థికంగా, 202425 ఆర్థిక సంవత్సరంలో ఎస్ఎల్ఎన్ టెర్మినస్ 4,345.21 లక్షల టర్నోవర్, 598.39 లక్షల పన్నుల అనంతర లాభం మరియు 864.32 లక్షల నెట్ వర్త్‌ను నమోదు చేసింది. గత మూడు సంవత్సరాలుగా ఆదాయంలో నిరంతర వృద్ధి కొనసాగుతోంది.

## నిజామీ శైలిలో తాజ్ ఫలక్ నుమాలో న్యూ ఇయర్



నూతన సంవత్సరాన్ని స్వాగతించటం కోసం తాజ్ ఫలక్ నుమా ప్యాలెస్ సన్నద్ధమైనది. ప్యాలెస్ మె-యిన్ లాన్ లో నిర్వహించబోయే ఈ వేడుక సాంస్కృతిక , సమకాలీన అనుభవాల మిశ్రమం లా ఉంటుందని ప్యాలెస్ ప్రతినిధులు తెలిపారు. సూఫీ ఖవ్వాలీ తో అతిధులకు స్వాగతం పలుకుతామని , నూతన సంవత్సర వేడుకల ప్రదర్శన ను ప్యాలెస్ మాస్టర్ చెఫ్ లు నిర్వహిస్తారని వారు వివరించారు. కచ్చే ఘోస్ట్ కి బిర్యానీ, నిజామీ బైదా పర్దా ఘోష్, ధమ్ కీ మచ్చి వంటి వంటకాలతో పాటుగా అంతర్జాతీయ లైవ్ కౌంటర్లు అతిధులకు చవులూరిస్తాయని , గ్రిల్డ్ సీ ఫుడ్ , కళాత్మక పాస్తాలు, ఆసియా స్పెషల్స్, చాట్ తో పాటుగా తాము ప్రత్యేకంగా తీర్చిదిద్దిన హల్వా, పటస్సేరి వంటి డెజర్ట్స్ రుచులు ఆకట్టుకుంటాయన్నారు.

# నోటి ఆరోగ్య రీసెట్‌కు పిలుపు

ప్రపంచం 2026లోకి అడుగుపెడుతున్న వేళ జిమ్ సభ్యత్వాలు, కఠిన ఆహార నియమాలు వంటి సంప్రదాయ నూతన సంవత్సరం తీర్మానాలకు తోడుగా ఒక ఆశ్చర్యకరమైన కొత్త ఆలోచన చేరుతోందన్నారు ప్రజారోగ్య దంత వైద్యశాస్త్రంలో ప్రొఫెసర్ డా. సోనియా దత్తా, నోటి ఆరోగ్య రీసెట్. తాజా పరిశోధనలు మరియు సమగ్ర (హోలిస్టిక్) ఆరోగ్యంపై పెరుగుతున్న దృష్టి, ఆరోగ్యకరమైన నోరు ఆరోగ్యకరమైన శరీరానికి పునాది అని స్పష్టంగా చెబుతున్నాయి. అయినప్పటికీ, నోటి సంరక్షణను తరచూ ఆరోగ్యంలోని "మరిచిపోయిన" స్థంభంగా చూస్తారు. పోషణ మరియు నిద్ర అలవాట్లను పునరాలోచించే వారు చాలామందైనా, జీర్ణ మరియు శ్వాస వ్యవస్థలకు ద్వారంగా ఉన్న నోరు అసౌకర్యం కలిగే వరకు తరచూ నిర్లక్ష్యం చేయబడుతోంది. 2026 నోటి రీసెట్ చెక్‌లిస్ట్ఈ ఏడాది తమ దైనందిన అలవాట్లను మెరుగుపరచాలనుకునే వారికి నిపుణులు ఐదు వాస్తవిక స్థంభాలను సూచిస్తున్నారు:

రెండు నిమిషాల నియమం: రోజుకు రెండుసార్లు పూర్తి 120 సెకన్ల పాటు పళ్ళు **తోమడం;**

నాలుక పరిశుభ్రత: బ్యాక్టీరియా చేరికను తొలగించేందుకు ప్రతిరోజూ నాలుక శు**భ్రపరచడం;** ఇంటర్‌డెంటల్ సంరక్షణ: దాగి ఉన్న ప్లాక్‌ను చేరుకోవడానికి ఫ్లాస్ లేదా **ఇంటర్‌డెంటల్ బ్రష్‌ల వినియోగం;**

హైడ్రేషన్: లాలాజలం ఉత్పత్తికి మద్దతుగా నీటి సేవనం **పెంచడంఇది నోటి సహజ రక్షణ;**

ఆయుర్వేద సమన్వయం: కాల పరీక్షను తట్టుకున్న వృక్ష ఔషధాలను దైనందిన సంరక్షణలో చేర్చడం. ఆధునిక ఆయుర్వేద సంరక్షణ పెరుగుదల2026కి కీలక ధోరణి ఆయుర్వేద మూలికలను ప్రధాన నోటి పరిశుభ్రతలో సమన్వయం చేయడమే. సహజ ప్రభావాన్ని అందించే పదార్థాల కోసం వినియోగదారులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు:

లవంగ నూనె: యాంటీబ్యాక్టీరియల్ లక్షణాలు మరియు అసౌకర్యాన్ని తగ్గించే సామర్థ్యానికి ప్రసిద్ధి;

పుదీనా సత్వం: నిజమైన, దీర్ఘకాలిక శ్వాస తాజాదనాన్ని అందిస్తుంది;

తోమర్ బీజం: శుభ్రమైన, ఆరోగ్యకరమైన దంతమాంసాల మద్దతుకు ప్రత్యేకంగా ఉపయోగిస్తారు.

ఈ శక్తివంతమైన మూలికలను కలిపి, ఐడీఏ (ఇండియన్ డెంటల్ అసోసియేషన్) ఆమోద ముద్రను కలిగిన డాబర్ రెడ్ వంటి ఉత్పత్తులు, సంప్రదాయ జ్ఞానం మరియు ఆధునిక క్లినికల్ ధృవీకరణ మధ్య సమతుల్యాన్ని కోరుకునే వారి ప్రాధాన్య ఎంపికగా మారుతున్నాయి.



## రూ. 2850 కోట్ల అమ్మకాలను సాధించిన సంతూర్




భారతీయ వినియోగదారులపై లోతైన అవగాహన మరియు ఐకానిక్ సంతూర్ మదర్ కథనం ఆధారంగా, ఈ బ్రాండ్ భారతీయ కుటుంబాలతో నాలుగు దశాబ్దాల పాటు చెక్కుచెదరని బంధాన్ని పెంచుకుంది మరియు పోషించింది. విప్రో కన్స్యూమర్ కేర్ & లైటింగ్ వారి సంతూర్, తన దాదాపు నాలుగు దశాబ్దాల ప్రయాణంలో ఒక కీలక మైలురాయిని చేరుకుంటూ, దేశంలోనే అతిపెద్ద సబ్బు బ్రాండ్‌గా అవతరించింది. గత 12 నెలల కంపెనీ ఇన్వాయిస్ అమ్మకాల పరంగా, సంతూర్ ఈ రోజు రూ. 2850 కోట్ల వ్యక్తిగత శుభ్రత ఉత్పత్తుల దిగ్గజంగా ఎదిగి, ఇప్పుడు అతిపెద్ద సబ్బు బ్రాండ్‌గా నిలిచింది. ఈ అద్భుతమైన మైలురాయిపై స్పందిస్తూ, విప్రో కన్స్యూమర్ కేర్ & లైటింగ్ సీఈఓ మరియు విప్రో ఎంటర్‌ప్రైజెస్ మేనేజింగ్ డైరెక్టర్ వినీత్ అగర్వాల్ ఇలా అన్నారు, "భారతదేశంలోనే అతిపెద్ద సబ్బు బ్రాండ్‌గా అవతరించడం విప్రో కన్స్యూమర్ కేర్ & లైటింగ్‌లో మా అందరికీ గర్వకారణం. సంతూర్ ప్రయాణం లోతైన వినియోగదారుల అవగాహన, క్రమశిక్షణతో కూడిన అమలు మరియు నిలకడగా విలువను సృష్టించడం కాలక్రమేణా విజయాన్ని సాధిస్తుందనే నమ్మకంపై ఆధారపడి ఉంది. మేము వినియోగదారులకు గొప్ప నాణ్యతను అందించడానికి నిరంతరం కృషి చేశాము, అది పరిమళం, ఉన్నతమైన ఇంద్రియ అనుభూతి లేదా కఠినమైన నీటిలో పనితీరు అయినా సరే, ఇవన్నీ ఉత్తేజకరమైన ప్రకటనలతో కలిసి బ్రాండ్ విజయాన్ని రూపొందించడంలో సహాయపడ్డాయి. అన్నారు."

## హై-కన్విక్షన్ వెల్త్ హబ్‌గా హైదరాబాద్



హైదరాబాద్ : ఎమ్‌కే వెల్త్ మేనేజ్మెంట్, ఎమ్‌కే గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్‌కు చెందిన వెల్త్ మేనేజ్మెంట్ విభాగంప్రకారం, భారతదేశంలో వేగంగా ఎదుగుతున్న అధిక-వృద్ధి సంపద కేంద్రంగా హైదరాబాద్ అవతరిస్తోంది. గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు ఆధారంగా బలపడుతున్న మౌలిక సదుపాయాల అభివృద్ధి మరియు వేగంగా విస్తరిస్తున్న స్టార్టప్ పర్యావరణ వ్యవస్థ ఈ పరిణామానికి ప్రధాన అంశాలుగా నిలుస్తున్నాయి. ఈ నగరం అల్ట్రా-లగ్జరీ రియల్ ఎస్టేట్‌లో బలమైన డిమాండ్‌ను చూస్తోంది. ముఖ్యంగా కోకాపేట మరియు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి మైక్రో-మార్కెట్లలో 5,000 చదరపు అడుగులకు పైగా విస్తరించిన "స్కై మాన్షన్లు" అధిక ఆదరణ పొందుతున్నాయి.

ఇది అధిక-నికర-విలువ కలిగిన వ్యక్తులలో పెరుగుతున్న సంపదతో పాటు మారుతున్న జీవ-నశైలి ఆకాంక్షలను స్పష్టంగా ప్రతిబింబిస్తోందని పేర్కొంది. ఎమ్‌కే వెల్త్ మేనేజ్మెంట్ వైస్ ప్రెసిడెంట్, అభిషేక్ వైష్, మాట్లాడుతూ, "ఈ నిర్మాణాత్మక ధోరణులు హైదరాబాద్‌ను దీర్ఘకాలిక సంపద సృష్టికి కీలక మార్కెట్‌గా నిలబెడుతున్నాయి. ఈక్విటీలు, ప్రైవేట్ మార్కెట్లు, రియల్ అసెట్స్ మరియు ప్రత్యామ్నాయ పెట్టుబడుల్లో విస్తృత అవకాశాలను అందిస్తాయి." అన్నారు. .

# హోమ్‌లేన్ 100-స్టోర్ ఫ్రాంచైజీ విస్తరణ



బెంగళూరు : భారతదేశపు ప్రముఖ ఎండ్-టు-ఎండ్ హోమ్ ఇంటీరియర్స్ సొల్యూషన్స్ ప్లాట్‌ఫామ్ అయిన హోమ్‌లేన్, 2024-25 ఆర్థిక సంవత్సరాన్ని లాభదాయకతలో ఒక కీలక మలుపు వద్ద ముగించింది. 25లో ఏటా 22% ఆదాయ వృద్ధిని సాధించి, దానిని 756 కోట్లకు చేర్చింది. నాల్గవ త్రైమాసికంలో ఈబిఐటిడిఏ పరంగా లాభాల్లోకి అడుగుపెట్టింది. ఈ జోరును కొనసాగిస్తూ, కంపెనీ తన ప్రణాళిక ప్రకారం 12 నెలల కాలంలో 100 కొత్త ఫ్రాంచై జీ-ఆధారిత స్టోర్లను జోడిస్తూ, ప్రధాన మెట్రో మార్కెట్లకు మించి తన కార్యకలాపాలను విస్తరిస్తోంది. కంపెనీ ఫ్రాంచైజ్ నెట్‌వర్క్ రెండు మోడళ్ల కింద పనిచేస్తుంది: ఫ్రాంచైజ్-ఓన్డ్, కంపెనీ-ఆపరేటెడ్ మరియు ఇటీవల ప్రవేశ పెట్టిన ఫ్రాంచైజ్-ఓన్డ్, (ఫ్రాంచైజ్-ఆపరేటెడ్) మోడల్. 2025లో, హోమ్‌లేన్ దేశవ్యాప్తంగా తన ఫ్రాంచైజ్ ఉనికిని విస్తరించింది. 40కి పైగా నగరాల్లో 55,000కి పైగా ఇళ్లను పూర్తి చేసింది. ప్రతిరోజూ దాదాపు 30 ఇళ్లను ఇన్‌స్టాల్ చేసింది. ముంబై, బెంగళూరు, ఢిల్లీ - ఎన్సీఆర్ వంటి మెట్రోపాలిటన్ హబ్‌లు మొదలుకొని సిలిగురి, జైపూర్, కొచ్చితో సహా అభివృద్ధి చెందుతున్న మార్కెట్‌ల వరకు, ఫ్రాంచైజ్-నేతృత్వంలోని మోడల్, ప్రొప్రైటరీ సాఫ్ట్‌వేర్, క్యూరేటెడ్ సరఫరా గొలు సుల మద్ద తుతో ఊహించదగిన, సాంకేతికత-ఆధారిత ఇంటీరియర్ సొల్యూషన్‌లను ప్రారంభించింది. "2025 లో మేము సాధించిన పురోగతి హోమ్‌లేన్‌లో ఉత్తేజకరమైన తదుపరి దశ వృద్ధికి వేదికను నిర్దేశిస్తుంది" అని హోమ్‌లేన్ సీఈఓ, సహ వ్యవస్థాపకుడు శ్రీకాంత్ అయ్యర్ అన్నారు.

## ఎల్ అండ్ టి కి హైదరాబాద్ గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్ కాంట్రాక్ట్

ముంబై, : హైదరాబాద్ గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్ కోసం రవాణా మౌలిక సదు-పాయాల వ్యాపార వర్టికల్ గణనీయమైన ఆర్డర్‌ను గెలుచుకుంది. ఈ ఆర్డర్ గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్ యొక్క దశ-2కి సంబంధించినది, దీనిలో రంగారెడ్డి జిల్లాలో 22.3 కి.మీ 3+3 లేన్ల యాక్సెస్-నియంత్రిత రేడియల్ రోడ్డును నిర్మిస్తున్నారు. ఎల్ అండ్ టి పరిధిలో 3.6 కి.మీ పొడవైన వయాడక్ట్, చిన్న వంతెనలు, అండర్‌పాస్‌లు మరియు కల్వర్టుల నిర్మాణం ఉంటుంది. రెండు వైపులా సర్వీస్ రోడ్ల నిర్మాణం, విస్తృతమైన నిలుపుదల నిర్మాణాలు, తుఫాను నీటి పారుదల వ్యవస్థ, ఫుట్‌పాత్‌లు, సైకిల్ ట్రాక్ మరియు ల్యాండ్‌స్కేపింగ్ పనులు కూడా ఎల్ అండ్ టి పరిధిలో ఉన్నాయి. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్‌ను రాబోయే రీజినల్ రింగ్ రోడ్‌కు అనుసంధానించే అనేక ప్రణాళికాబద్ధమైన రేడియల్ రోడ్లలో ఇది మొదటిది. ఇది ప్రాంతీయ కనెక్టివిటీని మెరుగుపరుస్తుంది మరియు వృద్ధికి మద్దతు ఇస్తుంది, ఐటీ హబ్‌లు, ఎలక్ట్రానిక్ సిటీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ మరియు భారత్ ఫ్యూచర్ సిటీకి మెరుగైన యాక్సెస్‌ను అందిస్తుంది.



## సంపద కేంద్రంగా హైదరాబాద్ ఎమ్మే వెల్త్ మేనేజ్‌మెంట్

ఎమ్మే గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ సంపద నిర్వహణ విభాగం అయిన ఎమ్మే వెల్త్ మేనేజ్‌మెంట్ ప్రకారం, హైదరాబాద్ భారతదేశంలో అధిక వృద్ధి చెందుతున్న సంపద కేంద్రంగా అవతరించింది, దీనికి గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్స్ వేగంగా విస్తరించడం, బలమైన మౌలిక సదుపాయాల అభివృద్ధి మరియు అభివృద్ధి చెందుతున్న స్టార్ట్-అప్ పర్యావరణ వ్యవస్థ కారణమని పేర్కొంది. కోకాపేట మరియు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి సూక్ష్మ మార్కెట్లలో అల్ట్రా-లగ్జరీ రియల్ ఎస్టేట్, ముఖ్యంగా 5,000+ చదరపు అడుగుల స్కై మాన్షన్స్ కోసం నగరం బలమైన డిమాండ్‌ను చూస్తోందని, ఇది అధిక నికర-విలువ గల వ్యక్తులలో పెరుగుతున్న సంపద మరియు అభివృద్ధి చెందుతున్న జీవనశైలి ఆకాంక్షలను ప్రతిబింబిస్తుందని ఇది పేర్కొంది. ఎమ్మే వెల్త్ మేనేజ్‌మెంట్ వైస్ ప్రెసిడెంట్ అభిషేక్ వైష్ మాట్లాడుతూ , ఈ నిర్మాణాత్మక ధోరణులు హైదరాబాద్‌ను దీర్ఘకాలిక సంపద సృష్టికి కీలకమైన మార్కెట్‌గా నిలిపాయి, ఈక్విటీలు, ప్రైవేట్ మార్కెట్లు, రియల్ ఆస్తులు మరియు ప్రత్యామ్నాయ పెట్టుబడులలో అవకాశాలను అందిస్తున్నాయి. అన్నారు.

## అమెజాన్ ఇన్ 'గెట్ ఫిట్ డేస్'




బెంగుళూరు 5: ఈ క్రొత్త సంవత్సరం అమెజాన్ . ఇన్ వారి 'గెట్ ఫిట్ డేస్ 'తో , మీ ఫిట్నెస్ సంకల్పాల దిశలో మరో అడుగు ముందుకు వేయండి. క్రీడలు మరియు ఫిట్నెస్లకు అవసరమైన సామాగ్రుల విస్తృతశ్రేణితో సహా నుండి ఇటీవల విడుదల చేసిన ఉత్పత్తులను ఇక్కడ మీరు కనుగొనవచ్చు. ఇంటివద్ద వం-్కవుట్ రొటీన్ను సెటప్ చేసుకుంటున్నా లేక మీ ఫిట్నెస్ గేర్ను అప్గ్రేడ్ చేసుకుంటున్నా, యోనెక్స్, లైఫ్లాంగ్, ఇంకా మరెన్నో విశ్వసనీయమైన బ్రాండ్లకు చెందిన ఉత్పత్తులను ఎక్స్ప్లోర్ చేయండి. ఈవెంట్ సందర్భంగా డెబిట్ మరియు క్రెడిట్ కార్డుల పై ఉత్కంఠభరితమైన ఆఫర్లను కూడా కస్టమర్లు పొంది ఆనందించవచ్చు."మా కస్టమర్లు ఫిట్నెస్కు ఇస్తున్న ప్రాధాన్యం నానాటికి పెరుగుతోంది. దానితో, అమెజాన్. ఇన్ లో అత్యంత వేగంగా పెరుగుతున్న విభాగాల్లో ఇది ఒకటి అయ్యింది. స్పోర్ట్స్ మరియు ఫిట్నెస్ ఉపకరణాలు మొదలుకుని వేరబుల్స్ (ధరించగలిగినవి) వరకు పలు ఉత్పత్తుల పట్ల ఈ ఆసక్తి కనిపిస్తోంది. కస్టమర్లు, సమాచారం తెలుసుకుని ఛాయిస్లు నిర్ధారించుకోగలిగే విధంగా ఏఐ-సశక్తీకృత ఆవిష్కరణలు, కస్టమర్ రేటింగులు, లైవ్ షాపింగ్ అనుభవాల మద్దతుతో, అగ్రశ్రేణి బ్రాండ్లు కొత్తగా విడుదల చేస్తున్న ఉత్పత్తులతో మేము మా శ్రేణిని పెంపొందిస్తున్నాము. సేవలు అందించగల ప్రతి పిన్ కోడ్కు ఉత్కంఠభరితమైన డీల్స్ మరియు వేగవంతమైన డెలివరీతో మేము భారతదేశవ్యాప్తంగా ఉన్న కస్టమర్లకు, వారు తమ ఫిట్నెస్ ప్రయాణాలను ప్రారంభించటం లేదా కొనసాగించటాన్ని సులభతరం చేస్తున్నాము.", అని కార్తిక్ సుబ్బరాయప్ప డైరెక్టర్, కిచెన్, హోమ్ ఇంప్రూవ్మెంట్ అండ్ స్పోర్ట్స్, అమెజాన్ ఇండియా అన్నారు.

## గృహయజమాని కల నిజం చేసే గోద్రేజ్ ప్రాపర్టీస్ లిమిటెడ్




"2025 అనేది భారతీయ రియల్ ఎస్టేట్‌కు స్థిరమైన వృద్ధిని అందించిన సంవత్సరం, బలమైన గృహ శోషణ, దృఢమైన ధర నిర్ణయ విధానం మరియు కీలకమైన మెట్రోలలో ప్రధాన మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల డెలివరీ ద్వారా ఇది జరిగిందని ఎండి సిఈఓ గౌరవ్ పాండే అన్నారు. . పెరుగుతున్న ఆదాయాలు మరియు అధికారిక ఉద్యోగ సృష్టి ద్వారా డిమాండ్ ప్రాథమికంగా తుది వినియోగదారుల దృష్టి కేంద్రీకరించబడింది, అయితే వినియోగదారులు పారదర్శకత మరియు అమలు ఖచ్చితత్వం కోసం బ్రాండెడ్ డెవలపర్‌లను ఎక్కువగా ఎంచుకోవడంతో ఏకీకరణ వేగవంతమైంది. మనం 2026లోకి అడుగుపెడుతున్నప్పుడు, క్రమశిక్షణ కలిగిన సరఫరా మరియు ఆరోగ్యకరమైన డిమాండ్-ఇన్వెంటరీ బ్యాలెన్స్ ద్వారా ఈ రంగం స్థిరమైన, విస్తృత-ఆధారిత వృద్ధికి సిద్ధంగా ఉంది. బహుళ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు పూర్తి దశకు చేరుకోవడం మరియు పట్టణ ఉపాధి డ్రైవర్లు బలంగా ఉండటంతో, ఊహాజనిత కార్యకలాపాల కంటే నిజమైన గృహయజమాని ఆకాంక్షలలో ఊపు కొనసాగుతుందని మేము ఆశిస్తున్నాము." అన్నారాయన.

## ఎస్ బి ఐ లో 541 మంది పిఓల నియామకం




ముంబై : దేశంలో అతిపెద్ద మరియు అత్యంత విశ్వసనీయ బ్యాంకు అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, దేశవ్యాప్తంగా 541 ఖాళీలను భర్తీ చేస్తూ ప్రొబేషనరీ ఆఫీసర్ రిక్రూట్‌మెంట్ 2025 తుది ఫలితాలను ఈరోజు ప్రకటించింది. ఎంపికైన అభ్యర్థుల జాబితా బ్యాంకు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంది. పరిశ్రమలో అత్యంత ముఖ్యమైన నియామక కార్యక్రమాలలో ఒకటిగా, బ్యాంకు నాయకత్వ పైప్‌లైన్‌ను నిర్మించడం మరియు బ్యాంకింగ్ సేవలలో రాణించడానికి దాని దీర్ఘకాలిక నిబద్ధత ద్వారా జూనియర్ మేనేజ్‌మెంట్ కేడర్‌లోకి యువ మరియు డైనమిక్ ప్రతిభను చేర్చడానికి ఈ నియామక డ్రైవ్ చేపట్టబడింది. జూన్ 2025లో 505 మంది ప్రొబేషనరీ అధికారుల నియామకం తర్వాత, ఈ తాజా నియామకం తన మానవ మూలధనాన్ని బలోపేతం చేయడంపై నిరంతర దృష్టిని నొక్కి చెబుతుంది. ఎంపికైన ప్రొబేషనరీ అధికారులు దేశవ్యాప్తంగా వ్యాపార విభాగాలలో నియమించబడతారు, ఎంపిక చేసిన అంతర్జాతీయ పోస్టింగ్‌లు మరియు సీనియర్ మరియు టాప్ మేనేజ్‌మెంట్ పాత్రలకు పురోగతికి నిర్మాణాత్మక మార్గం ఉంటుంది. ఆగస్టు 2025లో జరిగిన ఆన్‌లైన్ ప్రిలిమినరీ పరీక్షలతో ఎంపిక ప్రక్రియ ప్రారంభమైంది, ఆ తర్వాత సెప్టెంబర్ 2025లో నిర్వహించిన ప్రధాన పరీక్షలు జరిగాయి. ప్రధాన పరీక్ష నుండి షార్ట్‌లిస్ట్ చేయబడిన అభ్యర్థులు తరువాత సైకోమెట్రిక్ అసెస్‌మెంట్, గ్రూప్ ఎక్సర్‌సైజ్ మరియు పర్సనల్ ఇంటర్వ్యూతో సహా ఎంపిక ప్రక్రియ యొక్క దశకు చేరుకున్నారు. ఈ నియామకాలు 2026లో 18,000 మందిని నియమించాలనే బ్యాంకు యొక్క విస్తృత ప్రణాళికలో భాగం, ఇది దాని అతిపెద్ద నియామక డ్రైవ్‌లలో ఒకటి. దీనిపై మాట్లాడుతూ, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చైర్మన్ శ్రీ సిఎస్ సెట్టి మాట్లాడుతూ, "కేటగిరీలలో మా మొత్తం నియామకాలు దాదాపు 18,000 మంది, వీరిలో దాదాపు 13,500 మంది క్లరికల్ రిక్రూట్‌మెంట్, 3,000 మంది ప్రొబేషనరీ అధికారులు మరియు స్థానిక ఆధారిత అధికారులు ఉంటారు. మేము ఈ కొత్త టాలెంట్ పూల్‌లో చేరినందున, అభివృద్ధి చెందుతున్న కస్టమర్ సేవ మరియు సాంకేతిక అవసరాలకు అనుగుణంగా నిర్మాణాత్మక నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడం ద్వారా మా మానవ వనరుల సామర్థ్యాలను మరింత బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాము." అన్నారు.



# ఆరావళి మైనింగ్‌కు సుప్రీం నో

● గతంలో ఇచ్చిన ఉత్తర్వులను నిలిపివేస్తూస్టే ● సుప్రీం కోర్టు ఆదేశాలు స్వాగతించిన కేంద్రం, కాంగ్రెస్

న్యూఢిల్లీ : ఆరావళి పర్వతాల్లో గనుల తవ్వకాలపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీచేసింది. 100 మీటర్లలోపు ఉన్న ఆరావళి పర్వతాల వద్ద మైనింగ్‌కు అనుమతులు ఇస్తూ గతంలో ఇచ్చిన ఉత్తర్వులను నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. తదుపరి ఉత్తర్వుల వరకూ గత ఆదేశాలను నిలిపివేస్తూ సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం తాజాగా నిర్ణయం తీసుకుంది. ఆరావళి పర్వతాలకు సంబంధించి సుప్రీంకోర్టు ఆమోదించిన నిర్వచనంపై వివాదం చెలరేగడంతో ఈ అంశాన్ని సుమోటోగా స్వీకరించి అత్యున్నత న్యాయస్థానం విచారణ చేపట్టింది.

పర్యావరణ కార్యదర్శి నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు : ఆరావళి పర్వత శ్రేణులను క్షుణ్ణంగా అధ్యయనం చేయడం కోసం పర్యావరణ కార్యదర్శి నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటుకు సుప్రీం ఆదేశించింది. నాలుగు రాష్ట్రాల సీఎస్‌లను ఈ కమిటీలో సభ్యులుగా నియమించుతూ ఉత్తర్వులు జారీ చేసింది. పర్యావరణ ముప్పునకు పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని సూచించింది. కొత్త కమిటీ నివేదిక వచ్చే వరకు నవంబర్ 20న ఇచ్చిన తీర్పును నిలిపివేస్తున్నట్లు సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ అంశంపై తగిన వివరణ ఇవ్వాలని కేంద్రంతో పాటు ఢిల్లీ, రాజస్థాన్, గుజరాత్, హరియాణా రాష్ట్రాలకు సుప్రీం నోటీసులు జారీ చేసింది. ఈ కేసు తదుపరి విచారణను వచ్చే ఏడాది జనవరి 21కి వాయిదా వేస్తూ సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

సుప్రీం నిర్ణయాన్ని స్వాగతించిన కేంద్ర మంత్రి : మరోవైపు సుప్రీం కోర్టు తీసుకున్న నిర్ణయాన్ని కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ స్వాగతించారు. ఆరావళి పర్వతాల పరిరక్షణ, పునరుద్ధరణకు కేంద్రం కట్టుబడి ఉందని వెల్లడించారు. ఈ సమస్యను అధ్యయనం చేసేందుకు కొత్త కమిటీని నియమించడాన్ని ఆయన స్వాగతించారు.

సుప్రీం నిర్ణయంపై కాంగ్రెస్ హర్షం : అటు సుప్రీం కోర్టు తీసుకున్న నిర్ణయం పట్ల కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్, రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్ హర్షం వ్యక్తం చేశారు. గత కొన్ని రోజులుగా ఆరావళి పర్వతాలపై రాజకీయాలు చేస్తున్నారంటూ నన్ను, మూడు సార్లు రాజస్థాన్ ముఖ్యమంత్రిగా చేసిన అశోక్ గహ్లోత్ను కేంద్ర పర్యావరణ మంత్రి తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ విషయంపై ఈరోజు సుప్రీం కోర్టు క్లారిటీ ఇచ్చింది. ఆరావళి పర్వతాలపై ఇచ్చిన నిర్వచనంపై సుప్రీం కోర్టు స్టే విధించింది. ఢిల్లీ, హరియాణా, గుజరాత్తో పాటు ముఖ్యంగా ఆ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న రాజస్థాన్లోని 19 జిల్లాలకు ఇవి చాలా ముఖ్యమైనవి. అలాంటి ఆరావళి పర్వతాలను నాశనం చేయాలని కేంద్రం కంకణం కట్టుకుంది. సుప్రీం కోర్టు స్టే విధిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. ప్రజలు కోరుకుంటున్నదాన్ని కేంద్రం అర్థం చేసుకుంటుందని భావిస్తున్నాం. నాలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా ప్రజలు, మీడియా ఈ ఉద్యమాన్ని ముందుకుతీసుకెళ్లారు. అని అన్నారు.

దేశంలోనే అతిపురాతన పర్వతశ్రేణి ఆరావళి. ఇక్కడ అక్రమంగా పొందిన అనుమతులతో అడ్డగోలుగా మైనింగ్ జరుగుతోందని ఎప్పటినుంచో ఆందోళన ఉంది. ఇలాంటి సమయంలో 100 మీటర్లు అంటే 328 అడుగుల కంటే ఎక్కువ ఎత్తున్నవి మాత్రమే పర్వతాలంటూ కేంద్రం కొత్త నిర్వచనం చెప్పింది. దీనిని సుప్రీం కోర్టు సైతం ఆమోదించింది. దీంతో 100 మీటర్ల కంటే తక్కువ ఎత్తులో ఉన్న కొండల్లో మైనింగ్‌కు అనుమతించింది కేంద్రం. అయితే, దీనివల్ల హరియాణా, రాజస్థాన్, గుజరాత్, ఢిల్లీకి ముప్పు తప్పదని పర్యావరణవేత్తలు హెచ్చరించారు. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు, ప్రజల నుంచి తీవ్ర నిరసనలు చేపట్టాయి. ఈ నేపథ్యంలో ఆరావళి పర్వత శ్రేణులు ఉన్న రాష్ట్రాలు కొత్తగా మైనింగ్ లీజులేవీ ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిషేధం విధించింది.

# ఢిల్లీని కమ్మేసిన పొగమంచు

● విమానాలు రద్దు, రైళ్లు ఆలస్యం ● తీవ్రంగా ప్రభావితమైన వాయుకాలుష్యం
● ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక



న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీతో పాటు నేషనల్ క్యాపిటల్ రీజియన్ (ఎన్‌సీఆర్) ప్రాంతాలను సోమవారం ఉదయం పొగమంచు, తీవ్రమైన వాయు కాలుష్యం కమ్మేశాయి. తక్కువ దృశ్యమానత కారణంగా ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఐజీఐ)లో విమాన రాకపోకలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. భద్రతా కారణాల దృష్ట్యా పలు విమానాలు రద్దుకాగా, మరికొన్ని ఆలస్యంగా నడిచాయి. మరోవైపు రోడ్డు రవాణా, రైలు సేవలపైన కూడా పొగమంచు ప్రభావం తీవ్రంగా పడింది.

50 మీటర్లకే పరిమితమైన దృశ్యమానత : ఆదివారం రాత్రి నుంచే ఢిల్లీలో దట్టమైన పొగమంచు కమ్ముకుంది. అనేక ప్రాంతాల్లో దృశ్యమానత 50 మీటర్లకే పరిమితమవ్వగా, కొన్ని చోట్ల పూర్తిగా కనిపించని పరిస్థితి నెలకొంది. ఆనంద్ విహార్, ధౌలా కువాన్, అక్షర్ధామ్, ద్వారక, కర్తవ్య పథ్ వంటి ప్రాంతాల్లో పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. వాహనదారులు హెడ్‌లైట్లు, పార్కింగ్ లైట్లు ఆన్ చేసి నెమ్మదిగా ప్రయాణించారు. ఈ నేపథ్యంలో భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఉదయం వేళల్లో రెడ్ అలర్ట్ జారీ చేసింది. అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దని, రోడ్లపై అత్యంత జాగ్రత్తగా ఉండాలని ప్రజలను హెచ్చరించింది.

ఐజీఐ విమానాశ్రయంలో విమానాల రద్దు : తీవ్రంగా తగ్గిన దృశ్యమానత వల్ల ఐజీఐ విమానాశ్రయంలో విమానాల రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. ఢిల్లీ నుంచి హైదరాబాద్, ముంబయి, బెంగళూరు, చెన్నై, కోల్‌కతా, అహ్మదాబాద్, గువాహటి, వారణాసి, జోధ్‌పుర్, గోరఖ్‌పుర్ వంటి ప్రధాన నగరాలకు వెళ్లే విమానాలను పలు ఎయిర్‌లైన్స్ రద్దు చేశాయి. ఎయిర్ ఇండియా నుంచి అత్యధికంగా విమానాలు రద్దుకాగా, ఇండిగో సేవలూ ప్రభావితమయ్యాయి. తక్కువ దృశ్యమానతలో టేకాఫ్, ల్యాండింగ్ చేయడం ప్రమాదకరమని ఎయిర్‌లైన్స్ అధికారులు తెలిపారు. ప్రయాణికుల భద్రత కోసమే ఈ నిర్ణయాలు తీసుకున్నామని, ముందుగానే సమాచారం ఇచ్చామని పేర్కొన్నారు.

రైళ్లు గంటల కొద్దీ ఆలస్యం : పొగమంచు ప్రభావం రైలు రాకపోకలపై కూడా తీవ్రంగా కనిపించింది. న్యూఢిల్లీ, ఓల్డ్ ఢిల్లీ, ఆనంద్ విహార్, హజ్రత్ నిజాముద్దీన్ స్టేషన్లకు వచ్చే 40కిపైగా రైళ్లు గంటల కొద్దీ ఆలస్యమయ్యాయి. హౌరా న్యూఢిల్లీ రాజధాని ఎక్స్‌ప్రెస్ 5.5 గంటలకు పైగా ఆలస్యమవగా, భువనేశ్వర్ తేజస్ రాజధాని 4.5 గంటలు ఆలస్యమైంది. రాంచీ- న్యూఢిల్లీ రాజధాని నాలుగు గంటలకు పైగా ఆలస్యమైంది. వందే భారత్, శతాబ్ది, దురంతో వంటి ప్రీమియం రైళ్లు కూడా షెడ్యూల్ కంటే ఆలస్యంగా నడిచాయి. సిగ్నల్స్ స్పష్టంగా కనిపించకపోవడంతో లోకో పైలట్లు రైళ్లను నెమ్మదిగా నడపాల్సి వస్తోందని ఉత్తర రైల్వే అధికారులు తెలిపారు. ప్రయాణికులు ఇంటి నుంచి బయలుదేరే ముందు రైలు స్థితిని పరిశీలించాలని సూచించారు.

తీవ్ర స్థాయిలో వాయు కాలుష్యం : సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (సీపీసీబీ) ప్రకారం సోమవారం ఉదయం 9 గంటలకు ఢిల్లీ సగటు ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ) 400కి చేరింది. ఇది సీవియర్ కేటగిరీలోకి వస్తుంది. ఆనంద్ విహార్, వివేక్ విహార్, వజీర్‌పుర్, రోహిణి, పంజాబీ బాగ్, పటపర్గంజ్ వంటి ప్రాంతాల్లో ఏక్యూఐ 430 నుంచి 455 మధ్య నమోదైంది. ఎన్‌సీఆర్‌లోని నోయిడా, గ్రేటర్ నోయిడా, గాజియాబాద్, గురుగ్రామ్‌లో కాలుష్యం తీవ్రంగానే ఉంది.

గ్రాప్ ఆంక్షలు కొనసాగింపు- ఆరోగ్య హెచ్చరిక : కాలుష్యం మరింత పెరిగితే గ్రాప్ - 4 చర్యలు అమలు చేసే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ఇప్పటికే గ్రాప్3 ఆంక్షలు కొనసాగుతున్నాయి. వాహనాల తనిఖీలు ముమ్మరం చేయగా, కాలుష్య నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలపై జరిమానాలు విధించారు. మరోవైపు, వైద్యులు ప్రజలకు కీలక సూచనలు చేశారు. చిన్నపిల్లలు, వృద్ధులు, శ్వాసకోశ సమస్యలు ఉన్న వారు బయటకు వెళ్లకుండా ఉండాలని సూచించారు. పొగమంచు- కాలుష్యం కలిసి ప్రమాదకర పరిస్థితిని సృష్టిస్తున్న నేపథ్యంలో సూచనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు.




# ఐక్యరాజ్య సమితి ఘోరంగా విఫలం

●మా దేశమే నిజమైన యుఎన్‌గా మారింది ●ఇప్పటి వరకు ఎనిమిది యుద్ధాలను ఆపేశాను
● డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

వాషింగ్టన్ : ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఉద్రిక్తతలను పరిష్కరించడంలో ఐక్యరాజ్యసమితి (యూఎన్) ఘోరంగా విఫలమైందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం అమెరికానే నిజమైన' ఐక్యరాజ్యసమితిగా మారిందని పేర్కొన్నారు. థాయ్‌లాండ్ - కంబోడియాల మధ్య నెలకొన్న సరిహద్దు వివాదాన్ని తాము పరిష్కరించామని, త్వరలోనే అక్కడ కాల్పులు పూర్తిగా నిలిచిపోతాయని ఆయన ప్రకటించారు. ఆదివారం తన ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు.

**థాయ్‌లాండ్-కంబోడియా శాంతి ఒప్పందం!**

గత కొద్ది రోజులుగా థాయ్‌లాండ్, కంబోడియా సరిహద్దుల్లో జరుగుతున్న భీకర పోరాటానికి ముగింపు పలకడంపై డొనాల్డ్ ట్రంప్ హర్షం వ్యక్తం చేశారు. మా మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం ఉభయ దేశాలు తిరిగి శాంతియుత స్థితికి చేరుకుంటాయి. ఈ విషయంలో ఇరు దేశాల నేతలు ప్రదర్శించిన చొరవ నిజంగా అభినందనీయం. ఇలాంటి వివాదాల పరిష్కారం వేగంగా, అత్యంత కచ్చితంగా ఉండాలి అని ట్రంప్ పేర్కొన్నారు.

**ఐక్యరాజ్యసమితి పూర్తిగా విఫలమైంది!**

ప్రపంచ శాంతిని కాపాడటంలో ఐక్యరాజ్యసమితి కేవలం ప్రేక్షక పాత్రకే పరిమితమైందని ట్రంప్ విమర్శించారు. గడిచిన 11 నెలల్లో 8 యుద్ధాలను నేను ఆపాను. రష్యా-ఉక్రెయిన్ మధ్య జరుగుతున్న యుద్ధంతో సహా ఏ ఒక్క అంతర్జాతీయ సమస్యలోనూ ఐక్యరాజ్యసమితి కనీస సహాయం చేయలేదు. అందుకే అమెరికానే ఇప్పుడు అసలైన ఐక్యరాజ్యసమితిగా మారింది అని ట్రంప్ ఎద్దేవా చేశారు. సెప్టెంబర్‌లో జరిగిన ఐరాస సాధారణ అసెంబ్లీ సమావేశంలో కూడా ట్రంప్ ఇదే తరహాలో ఐరాస పనితీరును తూర్పారబట్టారు.

**ఎనిమిది యుద్ధాలను ఆపేశా!!**

తాను రెండోసారి అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తరువాత ఏకంగా 8 కీలక అంతర్జాతీయ వివాదాలను పరిష్కరించానని ట్రంప్ ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. భారత్ - పాకిస్థాన్, ఇజ్రాయెల్ - ఇరాన్, కొసావో - సెర్బియా, కాంగో - రువాండా, ఈజిప్ట్ - ఇథియోపియా, ఆర్మేనియా - అజర్‌బైజాన్, థాయ్‌లాండ్ - కంబోడియా మొదలైన దేశాల మధ్య ఘర్షణలను లేదా యుద్ధాలను తానే ఆపానని ఆయన మరోసారి చెప్పుకున్నారు.మరోవైపు థాయ్‌లాండ్- కంబోడియా మధ్య కుదిరిన కౌలాలంపూర్ శాంతి ఒప్పందాన్ని తూచా తప్పకుండా అమలు చేయాలని అమెరికా విదేశాంగ శాఖ ఇరు దేశాలను కోరింది. సరిహద్దుల్లో శాంతి నెలకొనడం అంతర్జాతీయంగా ఊరటనిచ్చే అంశమని వైట్హౌస్ అభిప్రాయపడింది.జెలెన్‌స్కీతో భేటీ రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికే దిశగా ఆదివారం ఫ్లోరిడాలోని పామ్ బీచ్ నివాసంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్‌స్కీతో ట్రంప్ భేటీ కానున్నారు. శాంతి ప్రణాళికలో భాగంగా ఈ సమావేశం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

పుతిన్ డెడ్లీ వార్నింగ్ : మరోవైపు ఉక్రెయిన్‌కు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. శాంతియుత పరిష్కారానికి ఉక్రెయిన్ తిరస్కరిస్తే, బల ప్రయోగం ద్వారా అన్ని సైనిక లక్ష్యాలను సాధించి తీరుతామని ఆయన స్పష్టం చేశారు. ఉక్రెయిన్ శాంతిమార్గాన్ని కోరుకోకుంటే, సైనిక శక్తిని ప్రయోగించడం మినహా తమకు మరో మార్గం లేదని తేల్చి చెప్పారు. తాజాగా రష్యా సాయుధ బలగాల కమాండ్ పోస్ట్‌ను పుతిన్ సందర్శించారు. ఈ సందర్భంగా రష్యా సాయుధ బలగాల చీఫ్ ఆఫ్ జనరల్ స్టాఫ్ వ్యాలెరీ గెరాసిమోవ్, ఇతర ముఖ్య కమాండర్లు, సాయుధ బలగాల ఉన్నతాధికారులతో ఆయన భేటీ అయ్యారు. అనంతరం సాయుధ బలగాలను ఉద్దేశించి ప్రసంగిస్తూ, రష్యా - ఉక్రెయిన్ యుద్ధం గురించి పుతిన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం రష్యా - ఉక్రెయిన్ సరిహద్దుల్లో బఫర్ జోన్ ఏర్పాటు పనులు శరవేగంగా జరుగుతున్నాయని వెల్లడించారు. ఉక్రెయిన్‌లోని డాన్‌బాస్, జపోరోజై ప్రాంతాల్లో రష్యా సాయుధ బలగాలు ముమ్మందుకు దూసుకుపోతున్నాయని ఆయన తెలిపారు. ఉక్రెయిన్‌లోని జపోరోజై ప్రాంతంలో ఉన్న గులైపోల్, రష్యా బలగాల హస్తగతం అయ్యాయని తెలిసిందని పుతిన్ చెప్పారు.

# తుది దశకు ఉక్రెయిన్- రష్యా శాంతి ఒప్పందం

● దాదాపు నాలుగేళ్లుగా సాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ● 90శాతం అంగీకారం కుదిరినట్లు చెప్పిన జెలెన్‌స్కీ
● ఇక యుద్ధం ముగింపే తరువాయంటూ ట్రంప్ ఆనందం



వాషింగ్టన్ః ఉక్రెయిన్- రష్యా యుద్ధానికి ముగింపు పలికే శాంతి ఒప్పందానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలు కీలక దశకు చేరుతున్నట్లు కనిపిస్తున్నాయి. ఉక్రెయిన్ రష్యా శాంతి ఒప్పందం తుది దశకు చేరుకున్నట్లు ట్రంప్ వెల్లడించారు. ఈ భీకర యుద్ధం రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అత్యంత భయంకరమైనదిగా ట్రంప్ అభివర్ణించారు. దీనికి ముగింపు పలకడమే తన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం ఫ్లోరిడాలోని మార్-ఏ-లాగో క్లబ్‌లో శాంతి ఒప్పందంపై చర్చించేందుకు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ట్రంప్ భేటీ అయ్యారు. ఈ చారిత్రక సమావేశం తర్వాత ఇరువురు దేశాధినేతలు మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ట్రంప్ శాంతి ఒప్పందంపై కీలక కామెంట్స్ చేశారు. చర్చలు ఫలప్రదంగా జరిగాయని పేర్కొన్నారు. జెలెన్‌స్కీతో సమావేశానికి ముందే తాను పుతిన్ తో మాట్లాడినట్లు చెప్పారు. అలాగే, యూరోపియన్ నేతలతో కూడా తాను మాట్లాడినట్లు తెలిపారు.మా మధ్య అద్భుతమైన సమావేశం జరిగింది. చాలా విషయాలపై చర్చించాము. మీటింగ్‌కు ముందు నేను రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మాట్లాడాను. జెలెన్‌స్కీతో సమావేశం రెండు గంటలకు పైగా కొనసాగింది. శాంతి ఒప్పందానికి చాలా దగ్గర్లో ఉన్నాం. బహుశా చాలా చేరువలో ఉన్నామని నేను భావిస్తున్నాను. జెలెన్‌స్కీ, నేను ఇప్పుడే యూరోపియన్ నేతలతో మాట్లాడాం. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అత్యంత భయంకరమైన ఈ యుద్ధాన్ని ముగించే దిశగా చాలా పురోగతి సాధించాం అని - ట్రంప్ అన్నారు. డాన్‌బాస్ భూభాగంపై విలేకరులు అడిగిన ప్రశ్నపై ట్రంప్ స్పందించారు. శాంతి ఒప్పందం దాదాపు ఖరారైందని అయితే ఇంకా కొన్ని క్లిష్టమైన, సున్నితమైన అంశాలు మిగిలి ఉన్నాయని ట్రంప్ అంగీకరించారు. అందులో ప్రధానమైనది తూర్పు ఉక్రెయిన్ భూభాగమైన డాన్‌బాస్ సంబంధించిన అంశమని తెలిపారు. ఈ ఒప్పందంలో భూమి అంశమే ప్రధాన సమస్య. కానీ పరిష్కారానికి చాలా దగ్గరగా వచ్చాం. ఇది చాలా కఠినమైన అంశమే, అయినా చివరికి దీనికి పరిష్కారం దొరుకుతుందని నేను భావిస్తున్నాను అని ట్రంప్ ఆశాభావం వ్యక్తం చేశారు. యుద్ధం ఇప్పుడు ముగియాలని లేకపోతే ఇంకా చాలాకాలం కొనసాగుతుందని ట్రంప్ పేర్కొన్నారు. దీనివల్ల ప్రజలు అధిక సంఖ్యలో మరణిస్తూనే ఉంటారని ఆందోళన వ్యక్తం చేశారు. అలా జరగడం పుతిన్‌కు, జెలెన్‌స్కీకి, తనకు ఇష్టం లేదన్నారు. ఇదే సమయంలో ఒప్పందం ఎంత శాతం పూర్తయిందో చెప్పడానికి నిరాకరించిన ట్రంప్, చర్చలు తుది దశకు చేరుతున్నాయని తెలిపారు.

90శాతం అంశాలపై ఏకాభిప్రాయం: జెలెన్‌స్కీ శాంతి చర్చల్లో భాగంగా ఉక్రెయిన్ ప్రతిపాదించిన 20 పాయింట్ల ప్రణాళికపై ప్రధానంగా దృష్టి సారించినట్లు జెలెన్‌స్కీ పేర్కొన్నారు. శాంతి ప్రణాళికలోని 90 శాతం అంశాలపై ఇరు పక్షాల మధ్య అంగీకారం కుదిరిందని తెలిపారు. అమెరికా-ఉక్రెయిన్ మధ్య రక్షణ పరమైన హామీలపై 100 శాతం స్పష్టత వచ్చిందన్నారు. ఐరోపా దేశాలు కూడా ఇందులో భాగస్వాములు కానున్నట్లు తెలిపారు. యుద్ధం ముగిసిన తర్వాత ఉక్రెయిన్ సైన్యం స్థాయి, ఆయుధ సంపత్తిపై పూర్తి స్థాయి అంగీకారం లభించినట్లు పేర్కొన్నారు. ఉక్రెయిన్ ఆర్థిక వ్యవస్థను తిరిగి పుంజుకునేలా చేసే ప్లాన్ తుది దశకు చేరుకుందని జెలెన్‌స్కీ వెల్లడించారు.మేము అన్ని అంశాలపై చర్చించాం. గత కొన్ని వారాలుగా అమెరికా, ఉక్రెనియిన్ బృందాలు సాధించిన పురోగతిని అభినందిస్తున్నాం. 20 అంశాల శాంతి ప్రణాళికపై 90 శాతం అంగీకారం కుదిరింది. అమెరికా-ఉక్రెయిన్ భద్రతా హామీలపై 100 శాతం అంగీకారం కుదిరింది. అమెరికా,యూరప్, ఉక్రెయిన్ భద్రతా హామీలు కూడా దాదాపుగా ఖరారయ్యాయి. ఒప్పందం ముగిసిన తర్వాత చేసే ప్రణాళికపై కూడా చర్చలు జరిపాం. శాశ్వత శాంతిని సాధించడంలో భద్రతా హామీలు ఒక కీలకమైన మైలురాయి అని నమ్ముతున్నాం. ఉక్రెయిన్ శాంతికి సిద్ధంగా ఉంది చర్చల సమయంలోనూ ఉక్రెయిన్‌పై దాడి : ఒకవైపు శాంతి చర్చలు జరుగుతుండగా ఉక్రెయిన్- రష్యా మధ్య ఉద్రిక్తతలు తగ్గలేదు. చర్చలు జరుగుతున్న సమయంలోనే ఉక్రెయిన్‌లోని స్లోవియన్స్క్ నగరంలో రష్యా జరిపిన దాడుల్లో పలువురు మరణించినట్లు తెలుస్తోంది. ఈ ఘటనను జెలెన్‌స్కీ తీవ్రంగా ఖండించారు. గతవారం రోజుల్లోనే రష్యా 2,100 డ్రోన్లు, 94 మిసైళ్లతో ఉక్రెయిన్‌పై భారీ దాడులు చేసింది. అందుకే ఈ యుద్ధాన్ని సాగదీయకుండా వీలైనంత త్వరగా ఒప్పందాన్ని పూర్తి చేయాలని ట్రంప్ బృందం ప్రయత్నిస్తోంది.

# చైనా-తైవాన్ మధ్య ఉద్రిక్తతలు

తైవాన్ః : తైవాన్‌ను రక్షించేందుకు అవసరమైతే తాము రంగంలోకి దిగుతామని జపాన్ ప్రధాని సనాయె తకాయిచి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఉద్రిక్తతలను రాజేశాయి. తాజాగా చైనా దళాలు తైవాన్‌ను చుట్టుముట్టి భారీఎత్తున యుద్ధ విన్యాసాలు చేయనున్నట్లు ప్రకటించాయి. ఇప్పటికే ఆ దేశ వాయుసేన, నేవీ, రాకెట్ ఫోర్స్ దళాలు తైవాన్ సమీపంలోకి తరలించే పనిలో బీజింగ్ నిమగ్నమైంది.తాజాగా చైనాకు చెందిన పీఎల్ఏ ఈస్టర్న్ థియేటర్ కమాండ్ సీనియర్ కర్నల్ షి యీ మాట్లాడుతూ తాము 'జస్టిస్ మిషన్ 2025' పేరిట తైవాన్ జలసంధిలో యుద్ధ విన్యాసాలు చేయనున్నట్లు ప్రకటించారు. సముద్ర, గగనతల యుద్ధ సన్నద్ధతను పరీక్షించుకోవడం, ద్వీప సమూహాల బయట బ్లాకేడ్స్ నిర్వహించడం వంటివి చేయనున్నట్లు చెప్పారు. "తైవాన్‌లోని వేర్పాటువాద శక్తులకు ఇది బలమైన హెచ్చరిక జాతీయ సమైక్యత, సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడానికి చైనా తగిన చర్యలు తీసుకొంటుంది" అని చెప్పారు.మరోవైపు తైవాన్‌కు ఆయుధాలు విక్రయిస్తామని అమెరికా ప్రకటించిన కొన్ని రోజుల్లోనే చైనా తీవ్రంగా స్పందించింది. ఇప్పటికే బీజింగ్ 20 అమెరికా రక్షణ రంగ సంస్థలు, 10 మంది ఎగ్జిక్యూటివ్‌లపై ఆంక్షలు విధించింది.

# సెంగార్‌కు షాకిచ్చిన సుప్రీంకోర్టు



● ఉన్నావ్ అత్యాచార కేసులో హైకోర్టు ఉత్తర్వులపై స్టే
● సీబీఐ దాఖలు చేసిన పిటిషన్పై విచారణ

న్యూఢిల్లీ : 2017 ఉన్నావ్ అత్యాచార కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఆ కేసులో దోషిగా తేలిన మాజీ బీజేపీ ఎమ్మెల్యే కుల్దీప్ సెంగార్‌కు విధించిన జీవిత ఖైదు శిక్షను నిలిపివేస్తూ ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు స్టే విధించింది. ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ముగ్గురు న్యాయమూర్తుల సెలవు బెంచ్ విచారించింది. సీబీఐ పిటిషన్‌పై సమాధానం ఇవ్వాలంటూ సెంగార్‌కు నోటీసులు జారీ చేసింది.మరోవైపు, అత్యాచార కేసులో బాధితురాలికి న్యాయం జరగాలంటూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సుప్రీంకోర్టు ఎదుట ఆందోళన చేపట్టారు. నిరసనకు ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబా నాయకత్వం వహించారు. నిరసన కార్యక్రమంలో పాల్గొన్న పలువురు కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మహిళా హక్కుల కార్యకర్త యోగిత భయానా మీడియాతో మాట్లాడుతూ బాధితురాలికి సుప్రీంకోర్టుపై పూర్తి నమ్మకం ఉందని తెలిపారు. బాధితురాలి ఆరోగ్యం ప్రస్తుతం స్థిరంగానే ఉంది. ఆమె స్వయంగా కోర్టులో హాజరై తన పోరాటాన్ని తానే సాగించాలని నిర్ణయించుకుంది. సుప్రీంకోర్టు తప్పకుండా ఈ యువతికి న్యాయం చేస్తుందని భయానా తెలిపారు.




## పట్టాలు తప్పిన ఇంటర్

# ఓషియానిక్ రైలు

● మెక్సికోలో ఘోర రైలు ప్రమాద ఘటనలో 13 మంది మృతి
● 98 మందికి గాయాలు



వాషింగ్టన్ : ఉత్తర అమెరికా దేశం మెక్సికోలోని ఓక్సాకా రాష్ట్రంలో ఇంటర్ ఓషియానిక్ రైలు పట్టాలు తప్పింది. ఈ ఘటనలో 13 మంది ప్రాణాలు కోల్పోయారు. పలువురు గాయపడ్డారు. ఓక్సాకా , వెరాక్రూజ్ రాష్ట్రాలను కలిపే ఇంటర్ ఓషియానిక్ రైలు నిజాండా పట్టణం సమీపంలోని ఒక మలుపు వద్ద పట్టాలు తప్పిందని అధికారులు తెలిపారు. సమాచారం అందగా హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని సహాయక బృందాలు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టినట్లు చెప్పారు.

రైలులో 250 మంది : ప్రమాద సమయంలో రైలులో మొత్తం 250 మంది ఉన్నారు. మెక్సికో నేవీ వెల్లడించిన వివరాల ప్రకారం, ఇందులో 241 మంది సాధారణ ప్రయాణికులు ఉన్నారు. మరో తొమ్మిది మంది రైల్వే సిబ్బంది ఉన్నారు. రైలు పట్టాలు తప్పడంతో బోగీలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇప్పటివరకు 13 మంది మరణించినట్లు అధికారులు ధ్రువీకరించారు. మొత్తం క్షతగాత్రుల సంఖ్య 98కి చేరింది. వీరిలో 36 మందికి ప్రస్తుతం ఆసుపత్రిలో అత్యవసర వైద్య చికిత్స అందిస్తున్నారు. మరో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉందని వెల్లడించారు. 139 మంది ప్రయాణికులు ప్రాణాపాయం నుంచి సురక్షితంగా బయటపడ్డారు.

హుటాహుటిన సహాయక చర్యలు : ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, అధికారులు స్పందించారు. సమాచారం అందుకున్న మెక్సికో నేవీ బృందాలు అక్కడకు చేరుకున్నాయి. దాదాపు 360 మంది నావికాదళ సిబ్బంది రంగంలోకి దిగారు. రెస్క్యూ ఆపరేషన్ కోసం 20 వాహనాలు, 4 అంబులెన్సులు, 3 ఎయిర్ అంబులెన్సులను మోహరించారు. పరిస్థితులను సమీక్షించడానికి ఒక టాక్టికల్ డ్రోన్‌ను కూడా వాడారు. బోగీల మధ్య ఇరుక్కున్న వారిని బయటకు తీశారు. క్షతగాత్రులను దగ్గరలోని మతియాస్ రొమేరో, సెలినా క్రజ్, జుచిటాన్, ఇక్స్‌టెపెక్ ప్రాంతాల్లోని ఐఎంఎస్ఎస్ ఆసుపత్రులకు తరలించారు.

ప్రెసిడెంట్ షీన్ బామ్ దిగ్భ్రాంతి : ఈ ఘటనపై మెక్సికో ప్రెసిడెంట్ క్లాడియా షీన్ బామ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వేదికగా ఆమె స్పందించారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇదొక దురదృష్టకర సంఘటన. దుర్ఘటనలో 13 మంది చనిపోవడం బాధాకరం అని పేర్కొన్నారు. సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు నేవీ సెక్రటరీని, అంతర్గత వ్యవహారాల శాఖ అధికారులను ఘటనా స్థలానికి పంపించారు. బాధితుల కుటుంబాలను వ్యక్తిగతంగా పరామర్శించాలని అధికారులను ఆదేశించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. మెక్సికో అటార్నీ జనరల్ ఎర్నెస్టినా గోడోయ్ రామోస్ ఈ ఘటనపై స్పందించారు. రైలు ప్రమాదంపై సమగ్ర దర్యాప్తునకు ఆదేశించినట్లు సోషల్ మీడియా వేదికగా తెలిపారు. ప్రమాదం ఎలా జరిగింది? ఆ సమయంలో రైలు వేగం ఎంత? సాంకేతిక లోపం ఏమైనా తలెత్తిందా? ట్రాక్ వద్ద ఉన్న మలుపు ప్రమాదానికి కారణమా? అనే కోణాల్లో విచారణ జరుపుతున్నారు.

ఇంటర్ ఓషియానిక్ రైలు విశిష్టత : ఈ రైలు మార్గానికి మెక్సికోలో చాలా ప్రాముఖ్యత ఉంది. దీనిని 2023లోనే మాజీ అధ్యక్షుడు ఆండ్రెస్ మాన్యుయెల్ లోపెజ్ ఒబ్రాడోర్ ప్రారంభించారు. ఇది ప్రతిష్టాత్మకమైన ఇంటర్ ఓషియానిక్ కారిడార్ ప్రాజెక్టులో భాగం. పసిఫిక్ మహాసముద్రం వైపు ఉన్న సెలినా క్రూజ్ నౌకాశ్రయాన్ని, గల్ఫ్ కోస్ట్ వైపు ఉన్న కోట్జాకోల్కోస్‌తో ఈ రైలు కలుపుతుంది. పనామా కాలువకు పోటీగా వాణిజ్య రవాణా మార్గాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో దీనిని నిర్మించారు. ఇంతటి ప్రతిష్టాత్మకమైన రైలు ప్రమాదానికి కావడం చర్చనీయాంశమైంది.

# యుపీ పోలీసు శాఖ త్రినేత్ర ఏఐ అప్లికేషన్



ఉత్తరప్రదేశ్ పోలీస్ డిపార్ట్‌మెంట్ కోసం త్రినేత్ర అనే ఏఐ అప్లికేషన్‌ను ప్రారంభించినంది ఈ అప్లికేషన్ ఏఔ ని ఉపయోగించి రికార్డులను డిజిటలైజ్ చేసి శోధిస్తుంది మరియు నేరస్థుల రికార్డులను కలిగి ఉంటుంది, దర్యాప్తులు, సాధారణ తనిఖీలు, ధృవీకరణలు మరియు పోలీసు చెక్‌పోస్టుల సమయంలో రియల్-టైమ్ సమాచారాన్ని తిరిగి పొందడంలో గ్రౌండ్ జీరో వద్ద ఉన్న పోలీసు దళాలకు సహాయపడుతుంది. ఈ యాప్‌ను యుపి పోలీస్ డైరెక్టర్ జనరల్ ఓపీ సింగ్, ఐపిఎస్, క్రైమ్ ఐజిపి ఎస్కె భగత్ మరియు ఉత్తరప్రదేశ్ పోలీస్ ఎస్పీ క్రైమ్ సోమెన్ బర్మా నాయకత్వంలో ప్రారంభించారు. ఇది అన్ని జైళ్లు, డిసిఆర్‌డి లు, సిఎస్ ఆర్ బి మరియు సిసిటిఎన్ ఎస్ నుండి డేటాతో అనుసంధానించబడి రాష్ట్రంలో చురుకుగా ఉన్న నేరస్థుల అస్పష్టత లేని, పునరావృతం కాని డేటాను సృష్టిస్తుంది. వాస్తవానికి, రాష్ట్రంలోని వివిధ జిల్లాలు మరియు ప్రాంతాలలో చురుకుగా ఉన్న ఐదు లక్షల మంది నేరస్థుల రికార్డులను కలిగి ఉన్న మొదటి పోలీసు యాప్ ఇది. డేటాబేస్‌లో పేరు తప్పుగా వ్రాయబడినప్పటికీ, మెరుగైన ఖచ్చితత్వంతో నేరస్థులను శోధించడంలో పోలీసు దళాలకు సహాయపడటానికి స్టాక్ యాప్‌లో -ఆధారిత ఫొనెటిక్ శోధనను కూడా ప్రారంభించాడు.ప్రారంభించిన తర్వాత, త్రినేత్ర ఆండ్రాయిడ్ యాప్ ద్వారా 75 జిల్లాలు, 6 (రైల్వే పోలీసులు), (ఉగ్రవాద నిరోధక దళాలు) మరియు స్పెషల్ టాస్క్ ఫోర్స్ లను చేరుకుంటుందని భావిస్తున్నారు. యాప్ యొక్క పైలట్ దశ ప్రారంభమైన వారంలోనే, లక్నోలో ఒక రోజు జరిగిన కాల్పుల కేసులో వాంటెడ్ అయిన ఒక ఈ ప్రాజెక్ట్‌ను వారి పర్యవేక్షణలో నడిపిస్తున్నారు. యుపి 100 ప్రధాన కార్యాలయంలో జరిగినత్రినేత్ర ప్రారంభోత్సవానికి ఇతర ప్రముఖ పోలీసు అధికారులు కూడా హాజరయ్యారు.త్రినేత్ర పోలీసు దళాలను వారి జేబుల్లో అత్యున్నత సాంకేతికతను తీసుకెళ్లడానికి సన్నద్ధం చేస్తుంది. ఈ అప్లికేషన్‌తో, పోలీసు సిబ్బంది చిత్రాలు లేదా వీడియోలు వంటి సాధారణ బయోమెట్రిక్ లక్షణాల ద్వారా నేరస్థులను సులభంగా నమోదు చేయవచ్చు లేదా శోధించవచ్చు. ముఖ గుర్తింపు, దృశ్య శోధన, యంత్ర అభ్యాసం మరియు లోతైన అభ్యాసంలో స్టాక్ యొక్క నైపుణ్యంతో ఈ యాప్ ఆధారితం, తక్కువ రిజల్యూషన్ చిత్రాలు మరియు వీడియోలతో బాగా పనిచేస్తుంది మరియు ఏ ఇతర నేర గుర్తింపు వ్యవస్థ కంటే మెరుగైన ఖచ్చితత్వాన్ని అందిస్తుంది.ఈ అప్లికేషన్ ఏఔ ని ఉపయోగించి రికార్డులను డిజిటలైజ్ చేసి శోధిస్తుంది మరియు నేరస్థుల రికార్డులను కలిగి ఉంటుంది, దర్యాప్తులు, సాధారణ తనిఖీలు, ధృవీకరణలు మరియు పోలీసు చెక్‌పోస్టుల సమయంలో రియల్-టైమ్ సమాచారాన్ని తిరిగి పొందడంలో గ్రౌండ్ జీరో వద్ద ఉన్న పోలీసు దళాలకు సహాయపడుతుంది. ఈ యాప్‌ను యుపి పోలీస్ డైరెక్టర్ జనరల్ ఓపీ సింగ్, ఐపిఎస్, క్రైమ్ ఐజిపి ఎస్కె భగత్ మరియు ఉత్తరప్రదేశ్ పోలీస్ ఎస్పీ క్రైమ్ సోమెన్ బర్మా నాయకత్వంలో ప్రారంభించారు. - ఆధారిత గ్యాంగ్ ఐడెంటిఫికేషన్ టెక్నాలజీతో త్రినేత్ర నేరస్థుడిని మాత్రమే కాకుండా వివిధ జిల్లాలు మరియు రాష్ట్రాలలోని కొన్ని ప్రాంతాలలో చురుకుగా ఉన్న వారి సహచరులను కూడా గుర్తిస్తుంది.ఉత్తరప్రదేశ్ విస్తరణ అత్యుత్తమ నవీకరణలతో వస్తుంది. ఇది అన్ని జైళ్లు, డిసిఆర్‌డి లు, సిఎస్ ఆర్ బి మరియు సిసిటిఎన్ ఎస్ నుండి డేటాతో అనుసంధానించబడి రాష్ట్రంలో చురుకుగా ఉన్న నేరస్థుల అస్పష్టత లేని, పునరావృతం కాని డేటాను సృష్టిస్తుంది. వాస్తవానికి, రాష్ట్రంలోని వివిధ జిల్లాలు మరియు ప్రాంతాలలో చురుకుగా ఉన్న ఐదు లక్షల మంది నేరస్థుల రికార్డులను కలిగి ఉన్న మొదటి పోలీసు యాప్ ఇది. డేటాబేస్‌లో పేరు తప్పుగా వ్రాయబడినప్పటికీ, మెరుగైన ఖచ్చితత్వంతో నేరస్థులను శోధించడంలో పోలీసు దళాలకు సహాయపడటానికి స్టాక్ యాప్‌లో -ఆధారిత ఫొనెటిక్ శోధనను కూడా ప్రారంభించాడు.






## సింగరేణి గురించి మాట్లాడే అర్హత హరీశ్ రావుకు లేదు

### ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ బి. జనక్ ప్రసాద్



తెలంగాణ బ్యూరో‌ప్రతినిధిః సింగరేణి గురించే మాట్లాడే అర్హత హరీశ్ రావుకు లేదని ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ బి.జనక్ ప్రసాద్ అన్నారు. గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో జనక్ ప్రసాద్ మాట్లాడుతూ సింగరేణి సంస్థపై హరీశ్ రావు మాట్లాడే నైతిక అర్హతే లేదని తీవ్రంగా విమర్శించారు. మీ పదేళ్ల పాలనలోనే పార్లమెంట్‌లో మీ పార్టీ ఎంపీలు సింగరేణిని ప్రైవేటీకరించే కుట్రకు మద్దతుగా బిల్లుకు ఆమోదం తెలిపిన విషయం రాష్ట్ర ప్రజలకు తెలిసిందే. మీరు ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్న సమయంలో సింగరేణి నిధులను ఇష్టారాజ్యంగా వినియోగించి, సంస్థపై సుమారు రూ.30 వేల కోట్ల బకాయిలు మోపారు. అంతేకాదు, సింగరేణి సొమ్మును సిద్దిపేటకు తరలించి, ఆ నిధులతో అక్కడ స్టేడియం నిర్మించిన విషయాన్ని కార్మికులు, ప్రజలు మరువలేదన్నారు. ఇలాంటి నేపథ్యంతో ఇప్పుడు సింగరేణి మీద, కాంగ్రెస్ ప్రభుత్వంపై మాట్లాడితే ఎవరు నమ్ముతారని ప్రశ్నించారు. మీ పాలనలోనే మెడికల్ కాలేజీకి రూ.500 కోట్లు కేటాయించినప్పటికీ, కార్మికుల పిల్లలకు కనీస స్థాయిలో మెడికల్ సీట్లు సక్రమంగా కేటాయించలేకపోయిన ఘోర వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందని తెలిపారు.

ప్రస్తుత ప్రభుత్వంపై మాట్లాడే నైతిక హక్కు మీకు లేదని కార్మికులు భావిస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన తర్వాత కార్మికులకు రూ.1 కోటి ప్రమాద బీమా కల్పించినది వాస్తవం కాదా? ఎన్నడూ లేనివిధంగా కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5,000 పెంపు, ఈ ఏడాది బోనస్‌ను రూ.5,500కు పెంచినది నిజం కాదా? అలాగే సింగరేణి నియామకాల్లో 3540 సంవత్సరాల వయో పరిమితి పెంపు, కాంట్రాక్ట్ కార్మికులకు ప్రత్యేక బోనస్, బీసీ లైజనింగ్ అధికారిని నియమించడం వంటి కీలక నిర్ణయాలు కార్మికుల సంక్షేమానికి దోహదపడ్డాయని గుర్తు చేశారు. మీ పాలనలో సింగరేణికి కొత్త బొగ్గు బావులు రాకుండా కుట్రలు చేసి, సంస్థ అస్తిత్వాన్నే దెబ్బతీశారని, ఆర్థికంగా బలహీనపరిచారని విమర్శించారు.

గడిచిన 10 ఏళ్లలో సింగరేణి ఎలా వంచించారో అప్పటి బీఆర్ఎస్ అనుబంధ కార్మిక సంఘం అయినా కవిత ను అడిగితే చెప్తుందని అన్నారు. ఇప్పుడు అకస్మాత్తుగా సింగరేణిపై ప్రేమ చూపించినా, కార్మికులు గానీ, ప్రజలు గానీ నమ్మే పరిస్థితిలో లేరని స్పష్టం చేశారు.

## తండ్రికి ఉన్న సంస్కారం కేటీఆర్ లేకపాయే

### టీపీసీసీ జనరల్ సెక్రటరీ చనగాని దయాకర్



తెలంగాణ బ్యూరో‌ప్రతినిధిః తండ్రి కేసీఆర్‌కు ఉన్న సంస్కారం కేటీఆర్ లేకపాయే టీపీసీసీ జనరల్ సెక్రటరీ చనగాని దయాకర్ విమర్శించారు. సోమవారం ఆయన గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి, కేసీఆర్ ని పరామర్శిస్తుంటే గౌరవంగా అందరూ నిలబడితే కేటీఆర్ సీట్లోనే ఉండి నిలబడక పోవటం హంకారానికి నిదర్శనం. సీఎం కి ఇచ్చే మర్యాద కూడా లేకపోవడం సిగ్గుచేటు. మర్యాదల గురించి, విలువల గురించి కేటీఆర్ మాట్లాడడం హాస్యాస్పదం అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాజీ సీఎం కేసీఆర్ ని పలుకరించి నమస్కారం చేయడం మానవ విలువలు, రాజకీయ విలువల్ని గౌరవించడం అన్నారు. ప్రజా ప్రభుత్వం లో ప్రతి పక్షాల పాత్ర ఉండాలి కోరుకుంటుంది. ప్రజల నుండి వచ్చిన వ్యతిరేకత తో కెసిఆర్ అసంబ్లీ వచ్చారని చనగాని దయాకర్ అన్నారు.

## ముగిసిన ఐబొమ్మ రవి కస్టడీ విచారణ

### కీలక వివరాలు సేకరించిన పోలీసులు




తెలంగాణ బ్యూరో‌ప్రతినిధిః ఐబొమ్మ నిర్వాహకుడు ఇమంది రవి కస్టడీ విచారణ పూర్తయింది. ఇమంది రవి కేసులో హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కీలక వివరాలు సేకరించారు. ప్రహ్లాద్ వెల్లేల పేరిట రవి పాన్, డ్రైవింగ్ లైసెన్స్ తీసుకున్నాడు. గతంలో ప్రహ్లాద్ తన రూమ్మేట్ అని రవి పోలీసులకు చెప్పాడు. దీంతో పోలీసులు బెంగళూరు నుంచి ప్రహ్లాద్‌ను పిలిపించి విచారించారు. కస్టడీలో ఉన్న ఇమంది రవి ఎదుటే ప్రహ్లాద్‌ను పోలీసులు ప్రశ్నించారు రవి ఎవరో తనకు తెలీదని పోలీసులకు ప్రహ్లాద్ చెప్పాడు. తన పేరుతో రవి పాన్, లైసెన్స్ తీసుకున్నట్లు తెలిసి షాక్‌కు గురయ్యానని ప్రహ్లాద్ అన్నాడు. ప్రహ్లాద్ డాక్యుమెంట్లు ఇమంది రవి దొంగలించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇక, గతంలో చేసిన బ్యాంక్ ట్రాన్సక్షన్లను చూపించి రవిని పోలీసులు ప్రశ్నించారు. లక్షల్లో లావాదేవీలు, డొమైన్ కొనుగోలు, ఐపీ మాస్క్ చేయడం గురించి రవిని పోలీసులు ప్రశ్నించారు. సర్వర్ లోడ్ కెపాసిటీ గురించి, ఎవరెవరు ఆ సర్వర్ మైంటైన్ చేస్తున్నారు అని కూడా పోలీసులు ఆరా తీశారు . త్వరలోనే పైరసి రాకెట్‌లో మరిన్ని అరెస్టులు ఉండే అవకాశం కనబడుతోంది. కాగా, రవి 12 రోజుల కస్టడీ ఈ రోజుతో ముగిసింది. రవిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించిన పోలీసులు అనంతరం నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు.

## బీసీలపై ఎందుకీ కుట్రలు

- స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లు తగ్గింపు అక్రమాలు అవక తవకలు
- ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిల చెల్లింపుపై నిర్లక్ష్యం
- హాస్టల్స్- గురుకుల పాఠశాలలో విద్యార్థుల అనారోగ్యం మరణాలు
- 2 లక్షల ఉద్యోగాల భర్తీపై అసెంబ్లీలో అధికార పక్షాన్ని నిలదీయాలి
- బీసీ నేత, ఎంపీ ఆర్.కృష్ణయ్య.. ప్రతిపక్షాలకు బహిరంగ లేఖ



తెలంగాణ బ్యూరో‌ప్రతినిధిః గ్రామపంచాయతీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానంకు భిన్నంగా బీసీల రిజర్వేషన్లను 42 శాతం నుంచి 22 శాతం తగ్గించి అమలు చేయడంలో 17శాతంకు తగ్గించి తీవ్ర అవకతవకలకు పాల్పడ్డారు. బీసీలకు మోసం చేశారు. అన్యాయం చేశారు. 2జిల్లాలలో 28 మండలాలు జీరో రిజర్వేషన్లపై కూడా తీవ్రంగా అన్యాయం చేశారు. కొన్ని జిల్లాల, మండలాలలో జీరో రిజర్వేషన్లు బీసీలకు చేసిన దగా మోసంపై ప్రతిపక్షాలు అధికార పక్షాన్ని నిలదీయాలని ప్రశ్నిందాలని తెలంగాణ బిసి జాక్ చైర్మన్ ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు.ఎన్నికలకు ముందు వెయ్యి సార్లు ఎట్టి పరిస్థితులలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని పదే పదే ప్రకటించారు. బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగబద్ధత న్యాయబద్ధత ఉన్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యం ఉండడం వల్లనే అమలు చేయలేకపోయారని విమర్శించారు. అదేవిధంగా బీసీ/ఈబీసీ/ఎస్సీ/ఎస్టీ/మైనారిటీ విద్యార్థుల ఫీజు రియంబర్స్ బకాయిలు దాదాపు పదివేల కోట్లు చెల్లించడంలో చేస్తున్న నిర్లక్ష్యంపై కూడా చర్చించాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఫీజుల బకాయిలు చెల్లించడం కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే పేద కులాల చదువుకోరాదని దురుద్దేశ్యంతో బడ్జెట్ విడుదల చేయకుండా స్కీమును నీరు కారుస్తున్నారు. బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు చదువు మానుకుంటున్నారు. ఇబ్బందులకు గురవుతున్నారు. ఇంకొక వైపు కాలేజీ యాజమాన్యాలు ఆర్థిక ఇబ్బందులకు అప్పుల పాలై కాలేజీ మూసి వేస్తున్నారు. ఇక రాష్ట్ర ప్రభుత్వం అధికారుల యొక్క నిర్లక్ష్యం వలన ఇప్పటివరకు దాదాపు హాస్టళ్ళలలో గురుకుల పాఠశాలలో వంద మందికిపైగా విద్యార్థులు మరణించారు. 2 వేల మందికిపైగా ఆనారోగ్యం పాలయ్యారు. హాస్టళ్ళ గురుకులాల నిర్వహణలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యానికి పాల్పడుతుందని, ఈ సమస్యపై అసెంబ్లీలో చర్చించాలి. మొత్తం 300 బీసీ కాలేజ్ హాస్టళ్ళ 310 బీసీ గురుకుల పాఠశాలలో చాలీదాలని అద్దె భవనాల్లో నిర్వహించడం వలన విద్యార్థులు తీవ్ర నిర్లక్ష్యం గురవుతున్నారని దీని మూలంగా మరణాలు, అనారోగ్య పాలవుతున్నారని విమర్శించారు.

ఇంకా కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో వాగ్దానం ప్రకారం రెండు లక్షల ఉద్యోగాల భర్తీపై కూడా నిర్లక్ష్యం చేయడానికి నిలదీయాలి. గ్రూప్-1 పరీక్షల నిర్వహణ అవకతవకలపై కోర్టు తీర్పులపై చర్చలు జరపాలని కోరాడు, అలాగే ఒక సంవత్సరం రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ గాలికి వదిలేసి రెండు సంవత్సరాలు గడిచిన 60 వేల ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదని దీనిపై కూడా చర్చ జరపాలని కోరారు.

కాంట్రాక్టు అవుట్సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు నెలల తరబడి చెల్లించకుండా జాప్యం చేయడం పట్ల నిలదీయాలని కోరారు. ఫీజుల బకాయిలు కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జీతాల బకాయిలు చెల్లించకుండా కాంట్రాక్టర్ల బిల్లులు 20 శాతం కమిషన్ తీసుకొని కోట్లకు -కోట్లు చెల్లిస్తున్న తీరుపై నిలదీయాలని కృష్ణయ్య ప్రతిపక్ష పార్టీలను కోరారు.

## హైదరాబాద్‌లో మరోసారి డ్రగ్స్ కలకలం

- లక్షన్నర విలువ చేసే ఎండీఎంఏ డ్రగ్స్ పట్టివేత
- ఇద్దరిని అరెస్ట్ చేసిన ఎస్‌వోటి పోలీసులు



తెలంగాణ బ్యూరో‌ప్రతినిధి: నగరంలో మరోసారి డ్రగ్స్ పట్టుబడటం కలకలం రుపుతోంది. మియాపూర్‌లో 11 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్ పట్టుబడింది. మియాపూర్‌లో ఎండీఎంఏ డ్రగ్స్ విక్రయానికి ప్రయత్నిస్తున్న ఇద్దరు నిందితులను మాదాపూర్ ఎస్‌వోటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు రంగంలోకి దిగిన ఎస్‌వోటీ మాదాపూర్ టీమ్, ముంబై నుంచి డ్రగ్స్ తీసుకువచ్చి మియాపూర్ ప్రాంతంలో విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో రవి, రవిలను అనే ఇద్దరిని అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుంచి సుమారు 11 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన డ్రగ్స్ విలువ సుమారు లక్షా యాభై వేల రూపాయలుగా అంచనా వేస్తున్నారు. అరెస్ట్ అయిన ఇద్దరూ మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన వారుగా గుర్తించారు. ప్రస్తుతం ముంబైలో నివసిస్తూ డ్రగ్స్ అక్రమ రవాణా చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఈ ఘటనపై మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మరోవైపు మాదాపూర్‌లోని ఓ హోటల్‌లో గంజాయి పట్టుబడింది. పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు.... గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు హోటల్ లో వంట మనిషి గా పని చేస్తున్న అభిలాష్ మండల్‌గా గుర్తించారు. అభిలాష్ మండల్ వద్ద నుండి ఒక లక్ష రూపాయలు విలువ చేసే ముదున్నర కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. హోటల్‌కు వచ్చే వ్యక్తులే టార్గెట్‌గా గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మాదాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## సినీ నటి మాధవీలతకు బిగ్ షాక్

- సరూర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు
- సోషల్ మీడియాలో సాయిబాబా దేవుడు కాదని తప్పుడు ప్రచారాలు చేసినందుకు మాధవీలతపై కేసు నమోదు



తెలంగాణ బ్యూరో‌ప్రతినిధి: ప్రముఖ సినీనటి మాధవీలతకు బిగ్ షాక్ తగిలింది. ఆమెపై సరూర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సోషల్ మీడియాలో సాయిబాబా దేవుడు కాదని తప్పుడు ప్రచారాలు, వ్యాప్తి చేసినందుకు మాధవీలతపై కేసు నమోదు చేశారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం... నటి మాధవీలతతో పాటు, ఈ ప్రచారానికి పాల్పడిన పలువురు యూట్యూబర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లపై కూడా ఈ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వారు పెట్టిన పోస్టు వల్ల ప్రజల భావోద్వేగాలకు నష్టం జరిగిందని ఎఫ్ఐఆర్‌లో ప్రస్తావించారు. మంగళవారం మాధవీలతతో పాటు మిగతా యూట్యూబర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు సరూర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో హాజరుకావాలని తెలిపారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసులోని ఇతర వివరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఈక్రమంలో వారి సోషల్ మీడియా ఖాతాలపై నిఘా పెట్టినట్లు సమాచారం. సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## ఎక్కడ తగ్గాలో ఎక్కడ నెగ్గాలో తెలిసిన వ్యక్తి సీఎం రేవంత్

### ఫిషరీష్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్



తెలంగాణ బ్యూరో‌ప్రతినిధిః ఎక్కడ తగ్గాలో ఎక్కడ నెగ్గాలో తెలిసిన వ్యక్తి సీఎం రేవంత్ రెడ్డి మెట్టు సాయి కుమార్ ఫిషరీష్ కార్పొరేషన్ చైర్మన్ అన్నారు. సోమవారం గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్ తన ప్రేమ హుందాతనం మరొక సారి నిరూపించుకున్నారు. అసెంబ్లీ సాక్షి గా ప్రతిపక్ష నేత మాజీ సీఎం కేసీఆర్ కు సీఎం రేవంత్ రెడ్డి మర్యాద పూర్వకంగా షేక్ హ్యాండ్ ఇచ్చారు. మూడడుగులు సీఎం ముందుకు వస్తే.. కేసీఆర్ నిలుచున్నాడు. సభలో ఇద్దరు పాడి కౌశిక్ రెడ్డి, కేటీఆర్ లు అహంకారంతో కూర్చొనే ఉన్నారు. అహంకార అజ్ఞాన ఎమ్మెల్యే లుగా పాడి, కేటీఆర్ లు మిగిలారని మెట్టు సాయి కుమార్ విమర్శించారు.

## ప్రాజెక్టు ఒకటే
## పేరు మారుతూనే ఉంటుంది!

- పోలవరం లేపిన రాజకీయ నామకరణాల చర్చ
- అమరజీవి సేవలకు గౌరవం ఇవ్వాలన్న ఉద్దేశ్యం ప్రశంసనీయం
- కానీ రాజకీయల కోసం పేరు మార్చాలా?" ప్రజల్లో చర్చ



**ఎం.గణేశ్, సూర్య ప్రధాన ప్రతినిధి**

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రభుత్వాలు మారిన ప్రతిసారీ అభివృద్ధి ప్రాజెక్టులు, సంక్షేమ పథకాల పేర్లు కూడా మారిపోతున్నాయన్న విమర్శలు ఇప్పుడు మరింత బలంగా వినిపిస్తున్నాయి. పాలన మారినా ప్రజల అవసరాలు మారవు, కానీ ఆ అవసరాలను తీర్చేందుకు రూపొందించిన పథకాలకు మాత్రం కొత్త పేర్లు పెట్టడం రాజకీయ సంస్కృతిగా మారిందన్న అభిప్రాయం ప్రజల్లో నెలకొంది. ఇప్పుడు పోలవరం ప్రాజెక్టు పేరు మరోసారి చర్చల కేంద్రంగా మారింది.రాష్ట్రానికి జీవనాడిగా భావించే పోలవరం ప్రాజెక్టు తొలుత రాజకీయ రంగు లేకుండా "పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు"గా ప్రారంభమైంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో, దీనికి "ఇందిరా సాగర్ (పోలవరం) బహుళార్ధ సాధక ప్రాజెక్టు" అనే పేరు పెట్టారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ పేరు జోడించడంతో పోలవరం ప్రాజెక్టు అధికారికంగా ఒక రాజకీయ నామకరణానికి లోనైంది. రాష్ట్ర విభజన అనంతరం టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ ప్రజల్లో సులభంగా గుర్తించేలా "పోలవరం ప్రాజెక్టు" అనే పేరే ప్రధానంగా వినియోగంలోకి వచ్చింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం హయాంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ ప్రాజెక్టుకు అమరజీవి పొట్టి శ్రీరాములు పేరు పెట్టాలని ప్రతిపాదించడంతో పోలవరం మరోసారి రాజకీయ నామకరణాల చక్రంలోకి ప్రవేశించింది. పవన్ కళ్యాణ్ ప్రతిపాదనకు జనసేన ఎమ్మెల్సీ నాగబాబు బహిరంగ మద్దతు ప్రకటించారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా పథకాలకు, ప్రాజెక్టులకు నాయకుల పేర్లు పెట్టే సంస్కృతి గతంలో కొనసాగిందని విమర్శించిన నాగబాబు, ఆంధ్రప్రదేశ్ కోసం ప్రాణత్యాగం చేసిన మహానుభావుల పేర్లను ప్రాజెక్టులకు నామకరణం చేయడమే సముచితమని వ్యాఖ్యానించారు. అయితే ఈ వాదనకు మద్దతు ఉన్నప్పటికీ, అదే సమయంలో మరో పేరు మార్పు కూడా అదే పాత రాజకీయ సంప్రదాయానికి కొనసాగింపే అన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.

**పేర్లు మారిన ప్రధాన నీటి ప్రాజెక్టులు**

శ్రీశైలం ప్రాజెక్టు మొదట శ్రీశైలం జలవిద్యుత్ ప్రాజెక్టుగా పిలవబడింది. అధికారిక పత్రాల్లో పీవీ నరసింహారావు సాగర్ వంటి పేర్లు ప్రతిపాదన దశలోకి వచ్చినప్పటికీ, ప్రజల్లో శ్రీశైలం అనే పేరే నిలిచిపోయింది.తెలంగాణఆంధ్ర సరిహద్దులో ఉన్న నాగార్జునసాగర్ ప్రాజెక్టు తొలుత కృష్ణానది ప్రాజెక్టుగా పిలువబడింది. ఆ తర్వాత దానికి నాగార్జునసాగర్ అనే పేరు స్థిరపడింది. అయితే కొన్ని దశల్లో ఇందిరా సాగర్ వంటి పేర్లతో పునర్నామకరణంపై చర్చలు జరిగినా అధికారిక మార్పు జరగలేదు. ప్రకాశం బ్యారేజ్‌ను తొలుత బీజవాడ ఆనకట్టగా వ్యవహరించగా, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు గౌరవార్థం ప్రకాశం బ్యారేజ్‌గా నామకరణం చేశారు.

**వెలిగొండ ప్రాజెక్టును అధికారికంగా ఉగాదిగండికోట రిజర్వాయర్ లింక్**

**సంక్షేమ పథకాలదీ అదే తీరు :** సంక్షేమ పథకాల విషయంలో ఈ ధోరణి మరింత స్పష్టంగా కనిపిస్తుంది. ఆరోగ్య బీమా పథకం కాంగ్రెస్ హయాంలో ఆరోగ్యశ్రీగా కొనసాగితే, టీడీపీ ప్రభుత్వం దాన్ని ఎన్టీఆర్ వైద్య సేవగా మార్చింది. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అదే పథకం వైఎస్సార్ ఆరోగ్యశ్రీగా మారింది. రైతులకు ఆర్థిక సాయం అందించే పథకం టీడీపీ హయాంలో అన్నదాత సుఖీభవగా ఉండగా, వైసీపీ హయాంలో వైఎస్సార్ రైతు భరోసాగా పేరు మారింది. ఇందిరమ్మ ఇళ్లు, ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం, పేదలందరికీ ఇళ్లు వంటి పేర్లు వసతి గృహాల పథకాల్లో వచ్చిన మార్పులకు ఉదాహరణలు.

అలాగే ఇందిరమ్మ పింఛన్లు, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, వైఎస్సార్ పెన్షన్ కానుకగా మారిన వృద్ధాప్య పింఛన్ల పథకం కూడా ప్రభుత్వ మార్పుతో పేర్లు మారిన తీరును ప్రతిబింబిస్తుంది.

**ముగింపు :** ఈ అన్ని ఉదాహరణలు ఒక ప్రశ్నను ముందుకు తెస్తున్నాయి. అభివృద్ధి లక్ష్యాలు ఒకటే అయినప్పుడు, వాటి పేర్లు మాత్రం ఎందుకు మారాలి అన్నది. ప్రజలకు అవసరమైన సాగునీరు, తాగునీరు, ఆరోగ్యం, నివాసం వంటి మౌలిక అంశాల కంటే, ప్రాజెక్టులు ఏ పేరు మీద అమలవుతున్నాయన్నదే రాజకీయ చర్చగా మారుతుండటం ప్రజాస్వామ్య పరంగా ఎంతవరకు సమంజసం అన్న ప్రశ్న తలెత్తుతోంది. ఇప్పుడు పోలవరం ప్రాజెక్టుకు పొట్టి శ్రీరాములు పేరు పెట్టాలన్న ప్రతిపాదన కూడా అదే నేపథ్యంతో చూడబడుతోంది. అమరజీవి సేవలకు గౌరవం ఇవ్వాలన్న ఉద్దేశ్యం ప్రశంసనీయం అయినప్పటికీ, మరోసారి పేరు మార్పు జరగడం రాజకీయ నామకరణాల పరంపరలో మరో అధ్యాయమే అన్న వాదన కూడా బలంగా వినిపిస్తోంది. ప్రాజెక్టు పేరు ఏదైనా, అది పూర్తై రాష్ట్రానికి పూర్తి స్థాయిలో ఉపయోగపడటమే ప్రజల ఆశగా నిలుస్తోంది.

## టీడీపీ నేత సాయిబాబా కుటుంబ సభ్యులకు చంద్రబాబు పరామర్శ



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : టీడీపీ సీనియర్ నేత, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు పిన్నమనేని సాయిబాబా కుటుంబ సభ్యులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫోన్‌లో పరామర్శించారు. సాయిబాబా మృతి పార్టీకి... వ్యక్తిగతంగా తనకు తీరని లోటని అన్నారు. సాయిబాబు కుటుంబ సభ్యులకు సోమవారం సీఎం చంద్రబాబు ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఎన్టీఆర్‌తో, తనతో సాయిబాబాకు ఉన్న సాన్నిహిత్యాన్ని ఈ సందర్భంగా చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. ఎన్టీఆర్ అభిమాన సంఘాల సమాఖ్య అధ్యక్షులుగా సాయిబాబా అందరికీ సుపరిచితులని సీఎం కొనియాడారు. ఎన్టీఆర్ భవన్‌కు వెళ్లిన సమయంలో ముందుగా వచ్చి స్వాగతం పలుకుతారని, అటువంటి నేతను కోల్పోవడం బాధాకరమని అన్నారు. సాయిబాబా కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలిపిన సీఎం... అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

## స్త్రీశక్తి పథకం అమలు వేగవంతం

- మహిళా ప్రయాణీకులకు గుర్తింపుకార్డు నిబంధనలను తొలగించాలి
- సి.యం. చంద్రబాబుకు ఇ.యు నాయకుల వినతి



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : విజయవంతం ప్రభుత్వం ప్రతిస్టాత్మకంగా ప్రవేశ పెట్టిన స్త్రీశక్తీ పథకం భవిష్యత్ లో మరింతగా విజయవంతం కావాలంటే మూడువేలు బస్సులను పెంచి,పదివేల సిబ్బందిని నియమించాలని,అలాగే మహిళా ప్రయాణీకులలో ఇతర రాష్ట్రాలకు చెందిన మహిళా ప్రయాణీకులు పెద్దగా లేనందున ఆదార్ కార్డు,ఇతర గుర్తింపు కార్డులు నిభందనలు తొలగించితే కండక్టర్లపై పనిబారం తగ్గడమే కాకుండా,దీనివలన కూటమి ప్రభుత్వానికి మహిళా ప్రయాణీకులలో ఇంకా మంచి పేరు వస్తుందని విజ్ఞప్తి చేస్తూ సోమవారం సచివాలయంలో గౌఃముఖ్యమంత్రి గారిని కలిసిన సందర్భంగా లేఖ ఇచ్చి విజ్ఞప్తి చేసామని ఏపి పిటిడి(ఆర్టీసి) ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు,ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య,ఉప ప్రధానకార్యదర్శి యం.డి.ప్రసాద్ సోమవారం ఒక ప్రకటన తెలియజేసారు.అలాగే ప్రభుత్వ పరిధిలో పెండింగు ఉన్న సమస్యలలో ప్రధానంగా ఉన్న సమస్యలు పరిష్కారించాలని ఉద్యోగులకు పిఆర్సీ,డీఏ బకాయిలు చెల్లించాలని,రిటైర్డు ఉద్యోగులకు చెల్లించాల్సిన గ్రాడ్యూటీ,లీవ్ డబ్బులు చెల్లించాలని తదితర 10 డిమాండ్లతో లేఖ ఇచ్చామని తెలిపారు.

## 6 నుండి 18 వరకు సారస్ మస్కట్ తయారీ

### విమెన్ ఫ్రెండ్లీ, ఎకో ఫ్రెండ్లీ వేదికలు



గుంటూరు : సారస్ - సేల్ ఆఫ్ ఆర్టికల్స్ ఆఫ్ రూరల్ ఆర్టిసన్స్ సొసైటీ) ప్రదర్శనను జనవరి 6వ తేదీ నుండి 18వ తేదీ వరకు గుంటూరులో నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో సోమవారం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గుంటూరు పట్టణంలో నర్సరావుపేట రహదారిలో రెడ్డి కళాశాల ఎదురుగా ఉన్న స్థలంలో ప్రదర్శన శాలల ఏర్పాటు జరుగుతుందన్నారు. రాష్ట్రంలో మొట్ట మొదటిసారిగా జాతీయ స్థాయి సారస్ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కోరారు. దేశంలోని అన్ని రాష్ట్రాల నుండి ఆయా రాష్ట్రాల సంస్కృతులను ప్రతిబింబించే చేనేతలు, హస్తకళలు, ఇతర సామగ్రిని ప్రదర్శించడం, విక్రయించడం జరుగుతుందని తెలిపారు. మినీ భారత సాంస్కృతిక, కళా సమ్మేళనంను తలపిస్తుందని చెప్పారు. ఆరు వందల మందికి పైగా చేనేత, హస్త కళాకారులు, సాంస్కృతిక కళాకారులు వస్తున్నారని, 250కు పైగా ప్రదర్శన శాలలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. హ్యాండ్లూమ్స్, హ్యాండిక్రాఫ్ట్స్, చీరలు, షాల్స్, కార్పెట్లు, బెడ్ షీట్ లు, వెదురు, లోహ, గాజు ఉత్పత్తులు, సాంప్రదాయ, ఆర్గానిక్ ఆహార పదార్థాలు, ఆభరణాలు, గృహ అలంకరణ వస్తువులు, ఆహార పదార్థాలు వంటి ఉత్పత్తులు ప్రదర్శన, విక్రయం జరుగుతుందన్నారు. ఈ మినీ భారత సమ్మేళనంలో గుంటూరు సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక విశేషాలు తెలియజేసి జిల్లా విశిష్టతను చాటిచెప్పుటకు వేదికగా మలచాలని పిలుపునిచ్చారు. పారిశుధ్య నిర్వహణను గుంటూరు నగర పాలక సంస్థ పర్యవేక్షించాలని అన్నారు. చిన్నారుల క్రీడా వినోదానికి అవసరగు అమ్యూజి మెంట్ పార్క్ ను ఏర్పాటు చేయాలని తెలిపారు. పార్కింగ్ ఏర్పాట్లను, రద్దీ రీత్యా తీసుకోవలసిన చర్యలు పోలీసు శాఖ తీసుకోవాలని సూచించారు. ఆహార పదార్థాల తయారీ ప్రక్రియ - ఫుడ్ కోర్టులు ఉంటాయని, ఆహార పదార్థాలు తయారీలో ఎటువంటి కలుషితం జరగరాదని, నాణ్యతలో ఎటువంటి లోపాలు ఉండరాదని, దీనిని జిల్లా పౌర సరఫరాల అధికారి పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విమెన్ ఫ్రెండ్లీ, ఎకో ఫ్రెండ్లీ దేశం నలుమూలల నుండి స్వయం సహాయక సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొంటున్నందున వారి సురక్షిత, భద్రత మన బాధ్యత అన్నారు.

ఎట్టి పరిస్థితుల్లోను గుంటూరు గౌరవం, అభిమానం వారు చూరగోనలని పిలుపునిచ్చారు. స్వయం సహాయక సంఘాలు తయారు చేసే పర్యావరణ హిత సామగ్రిని వినియోగిస్తూ ప్లాస్టిక్ నిషేధిత జోన్ గా, స్వచ్ఛతకు శ్రీకారం చుట్టే విధంగా తీర్చిదిద్దాలని అన్నారు.

ఈ సమావేశంలో గుంటూరు నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజా వలి, రెవిన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస రావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, సెర్ప్ డిప్యూటీ సి.ఇ.ఓ ఎ.కళ్యాణ చక్రవర్తి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి, ఉద్యాన శాఖ ఉప సంచాలకులు రవీంద్ర బాబు, జిల్లా పౌర సరఫరాల అధికారి పి.కోమలి పద్మ, డి.ఆర్.డి.ఎ ప్రాజెక్టు డైరెక్టర్ టి.విజయ లక్ష్మి, లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్ రెడ్డి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్, జిల్లా విద్యా శాఖ అధికారి డా.షేక్ సలీం భాషా, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి యు. చెన్నయ్య, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ జయలక్ష్మి, పర్యాటక శాఖ అధికారి రమ్య తదితరులు పాల్గొన్నారు.





# పొలిటికల్ కుదుపులు

# సంచలనాలు

## 2025లో ఢిల్లీ పీఠాన్ని కోల్పోయిన ఆప్ - 27 ఏళ్ల తర్వాత హస్తినలో బీజేపీ పాగా- బిహార్‌లో మళ్లీ ఎన్‌డీఏ అఖండ విజయం - - అంతర్గత విభేదాలతో ఓడిన విపక్ష కూటమి - ఓట్లచోరీ జరుగుతోందంటూ విపక్షాల ఆరోపణ

**2025 సంవత్సరంలో మన దేశ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కంచుకోటగా ఉన్న ఢిల్లీలో 27 ఏళ్ల తర్వాత బీజేపీ పాగా వేసింది. అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారనే అభియోగాలు ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఇమేజ్‌ను మసకబార్చాయి. ఆయన్ను అధికార పీఠానికి దూరం చేశాయి. అనూహ్యంగా ఉప రాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖర్ రాజీనామా చేయడం చర్చనీయాంశంగా మారింది. కేంద్ర ప్రభుత్వంతో విభేదాల వల్లే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారనే ప్రచారం జరిగింది. ఆ వివరాలిప్పుడు చూద్దాం.**

**బిహార్‌లో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై విపక్షాలు సంచలన ఆరోపణలు చేశాయి. ఎస్ఐఆర్ పేరుతో ఓట్ల చోరీకి కేంద్ర ఎన్నికల సంఘం పాల్పడుతోందని ఆరోపించాయి. ఎస్ఐఆర్ నిర్వహణపై సుప్రీంకోర్టు పలు ఆదేశాలివ్వగా, ఈసీ కొన్ని వివరణలు ఇచ్చుకుంది. ఈనేపథ్యంలో బిహార్‌లో జరిగిన ఎన్నికల్లో మళ్లీ ఎన్‌డీఏ కూటమి ఘన విజయం సాధించింది. 10వసారి నీతీశ్ సీఎం అయ్యారు. ఇక ఇదే సమయంలో బిహార్‌లోని లాలూ ఫ్యామిలీలో చీలిక అంశం హాట్ టాపిక్‌గా మారింది. ఈ పొలిటికల్ కుదుపులు, సంచలన పరిణామాల సమగ్ర సమాచారంతో ఈటీవీ భారత్ 2025 – ఇయర్ ఎండర్ మీకోసం!**

### 2025 అవలోకనం

### ఢిల్లీ పీఠం : బీజేపీ విజయం– కేజ్రీవాల్ ఓటమి :



దేశ రాజధాని ఢిల్లీలో 1998 నుంచి 2025 వరకు కేవలం రెండు పార్టీల హవా వీచింది. 1998 నుంచి 2013 వరకు హస్తినను హస్తం పార్టీ ఏలింది. 2013 నుంచి 2025 వరకు ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీని వరుస విజయాలు వరించాయి. కానీ ఈ ఏడాది(2025) ఫిబ్రవరి 5న జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్య ఫలితం వచ్చింది. ఢిల్లీలోని మొత్తం 70 అసెంబ్లీ స్థానాల్లో 48 సీట్లను బీజేపీ కైవసం చేసుకుంది. ఆప్ 22 సీట్లకే పరిమితమైంది. 27 ఏళ్ల తర్వాత తొలిసారిగా ఢిల్లీ గడ్డపై బీజేపీ సర్కారు ఏర్పాటైంది. షాలిమార్‌బాగ్ ఎమ్మెల్యే రేఖాగుప్తా ఢిల్లీ సీఎం అయ్యారు. ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ తన సిట్టింగ్ స్థానం (న్యూఢిల్లీ నియోజకవర్గం)లో బీజేపీ అభ్యర్థి పర్వేశ్ వర్మ చేతిలో 3,182 ఓట్ల తేడాతో ఓడిపోవడం సంచలనం సృష్టించింది. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో ఢిల్లీలోని 70 సీట్లలో 62 స్థానాలను ఆప్ గెల్చుకుంది. ఆ ఎన్నికల్లో బీజేపీకి 8 సీట్లే వచ్చాయి. కానీ ఈసారి లెక్క రివర్స్ అయింది. ఆప్‌కు చెందిన 62 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలలో 40 మంది ఓడిపోయారు. ఆశ్చర్యకరంగా ఈ 40 సీట్లన్నీ ఈసారి నేరుగా బీజేపీ ఖాతాలో చేరాయి. తద్వారా ఈ ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 48 సీట్లను కమలదళం చేజిక్కించుకుంది. గతంలో ఢిల్లీని ఏకఛత్రాధిపత్యంగా ఏలిన కాంగ్రెస్ వరుసగా మూడోసారి ఒక్క సీటును కూడా గెలవలేకపోయింది. కేజ్రీవాల్‌పై అవినీతి ఆరోపణలు: అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీ సీఎం హోదాలో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారనే ఆరోపణలు వచ్చాయి. మద్యం పాలసీ రూపకల్పన సందర్భంగా మద్యం సిండికేట్ల నుంచి ఆయన ముడుపులను పుచ్చుకున్నారనే అభియోగాలతో కేసులు నమోదయ్యాయి. సీఎం అధికారిక నివాసం పునరుద్ధరణ పనులకు సంబంధించిన శీష్ మహల్ వివాదం ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీసింది.

### : ఎస్ఐఆర్‌పై రగడ : ఈసీపై విపక్షాల ఆరోపణలు



Screen grab from video posted on X by @ANI

ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ఈ ఏడాది పెద్ద రాజకీయ రగడ జరిగింది. కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ), బీజేపీపై విపక్షాలు సంచలన ఆరోపణలు చేశాయి. సరిగ్గా అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని నెలల ముందే బిహార్‌లో ఎస్ఐఆర్‌ను ఎందుకు నిర్వహిస్తున్నారని నిలదీశాయి. ఆధార్, ఓటర్ ఐడీ, రేషన్ కార్డులను ధృవీకరణ పత్రాలుగా అంగీకరించబోమని అప్పట్లో ఈసీ చెప్పడం పెద్ద వివాదానికి దారితీసింది. తమకు మద్దతు ఇచ్చే మైనారిటీలు, దళితులు, యువత ఓట్లను చోరీ చేసేందుకు, వాటిని తొలగించేందుకు ఈసీ కసరత్తు చేస్తోందని ఆర్‌జేడీ, కాంగ్రెస్ ఆరోపించాయి. ఎస్ఐఆర్ ప్రక్రియపై అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ వంటి సంస్థలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. మరోవైపు జూన్ 25న బిహార్ రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియను ఈసీ ప్రారంభించింది. జూలై 10న ఎస్ఐఆర్ ప్రక్రియపై ఈసీకి సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక ఆదేశం ఇచ్చింది. ఓటర్ల గుర్తింపు, నమోదు కోసం ఆధార్, రేషన్ కార్డు, ఓటర్ ఐడీలను ప్రాథమిక ధృవీకరణ పత్రాలుగా అంగీకరించాలని నిర్దేశించింది. దీంతో ఆ మేరకు ఎస్ఐఆర్ నిర్వహణ నిబంధనల్లో ఈసీ మార్పులు చేసింది. జులై 25న బిహార్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియ ముగిసింది. ఆగస్టు 1న బిహార్ ఓటర్ల ముసాయిదా జాబితాను ఈసీ ప్రచురించింది. దీని ప్రకారం దాదాపు 65 లక్షల మంది పేర్లను ఓటర్ల జాబితాల నుంచి తొలగించారు. తదుపరిగా ఓటర్ల జాబితాలపై అభ్యంతరాల స్వీకరణ, సవరణల ప్రక్రియను ఈసీ మొదలుపెట్టింది. ఈక్రమంలో ఆగస్టు 14న సుప్రీంకోర్టు మరోసారి ఈసీకి ఆదేశాలు ఇచ్చింది. ఓటర్ల తుది జాబితా తయారీలో పారదర్శకత ఉండాలని, తొలగించిన ఓటర్ల వివరాలను బహిర్గతం చేయాలని నిర్దేశించింది. ఆధార్ వంటి పత్రాలను ఓటర్ల ధృవీకరణకు అనుమతించాలని పునరుద్ఘాటించింది. ఆధార్ కార్డును ఓటరు గుర్తింపు కోసం 12వ అధికారిక పత్రంగా చేర్చాలని ఈసీకి సెప్టెంబర్ 8న సుప్రీంకోర్టు మరో ఆర్డర్ ఇచ్చింది. సెప్టెంబర్ 9న కేంద్ర ఎన్నికల సంఘం బిహార్ ప్రధాన ఎన్నికల అధికారికి ఒక లేఖ రాసింది. ఓటర్ల నమోదు ప్రక్రియలో ఆధార్‌ను గుర్తింపు కార్డుగా అంగీకరించాలని అధికారికంగా ఆదేశించింది. ఎట్టకేలకు సెప్టెంబర్ 30న బిహార్ తుది ఓటర్ల జాబితాను ఈసీ ప్రచురించింది. దీని ఆధారంగానే 2025 నవంబరులో బిహార్ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి.

### దేశంలోని ఇతర రాష్ట్రాల్లోనూ ఎస్ఐఆర్




బిహార్ తర్వాతనే ప్రస్తుతం తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్, పుదుచ్చేరిలలో కూడా ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిర్వహిస్తున్నారు. అయితే, దీనిపై కూడా పలు రాజకీయ పార్టీలు (ఉదాహరణకు తమిళనాడులో డీఎంకే) సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ప్రస్తుతం చట్టపరమైన సవాళ్ల మధ్య ఈ రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ కొనసాగుతోంది.

### ఓట్ల చోరీ ఆరోపణలు : ఈసీ వివరణలు




ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలోని చాలా అంశాలపై విపక్ష పార్టీలు తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేశాయి. ఆగస్టు 1న ఈసీ విడుదల చేసిన బిహార్ ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకారం దాదాపు 65 లక్షల మంది ఓటర్ల పేర్లను తొలగించారు. దీనిపై విపక్ష పార్టీలు మండిపడ్డాయి. తమకు అనుకూలంగా ఉండే దళితులు, ముస్లింలు, ఓబీసీలు, నిరుపేద వర్గాల ఓట్లను వ్యూహాత్మకంగా తొలగించారని ఆరోపించాయి. బీజేపీ, ఈసీ కలిసి ఓట్లచోరీకి పాల్పడుతున్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఆర్‌జేడీ అగ్రనేత తేజస్వి యాదవ్ ఫైర్ అయ్యారు. బీజేపీకి లబ్ధి చేకూర్చేలా ఈసీ పనిచేస్తోందని విమర్శించారు. ఓటర్ల నమోదు, తొలగింపు ప్రక్రియలో ఒక ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి తమ మద్దతుదారులను ఏరివేస్తున్నారని విపక్ష నేతలు పేర్కొన్నారు. తమ వాదనను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 1 వరకు 16 రోజుల పాటు విపక్ష కూటమి ఓటర్ అధికార్ యాత్రను బిహార్‌లో నిర్వహించింది. రాహుల్ గాంధీ సారథ్యంలో ఈ యాత్ర జరిగింది.




### ఎస్ఐఆర్‌పై ఈసీ ఏం చెప్పింది ?

జులై 27, 2025: అర్హులైన ఏ ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని, తప్పుడు ప్రచారాల ను నమ్మొద్దని ఈసీ స్పష్టం చేసింది. ఆగస్టు 17, 2025: బిహార్‌లో తొలగించిన 65 లక్షల మంది ఓటర్ల వివరాలను సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కేవలం 56 గంటల్లోనే వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ తెలిపారు.

**ఆగస్టు 24, 2025:** ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియ రాజ్యాంగబద్ధంగా, పారదర్శకంగా జరుగుతోందని, 98.2% మంది ఓటర్ల ధృవీకరణ పూర్తయిందని ఈసీ ప్రకటించింది.

**సెప్టెంబర్ 30, 2025:** తుది జాబితా ప్రచురణ సందర్భంగా ఈసీ కీలక ప్రకటన చేసింది. రాజకీయ లబ్ధి కోసమే విపక్షాలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని మండిపడింది. ఎవరైనా ఆధారాలతో సహా ఏడు రోజుల్లోగా అఫిడవిట్ సమర్పిస్తే విచారణకు సిద్ధమని సవాల్ విసిరింది.



### బిహార్‌లో మళ్లీ ఎన్‌డీఏ– పదోసారి నీతీశ్ ప్రమాణం :

బిహార్‌లో ఎస్ఐఆర్ వివాదం నడుమ నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం నీతీశ్ కుమార్ సారథ్యంలోని ఎన్డీఏ ఘన విజయం సాధించింది. విపక్ష ఇండియా కూటమికి 2025లో బిగ్ షాక్ తగిలింది. లబిహార్‌పై కాంగ్రెస్, ఆర్‌జేడీ పెట్టుకున్న గంపెడాశలు ఆవిరయ్యాయి. నవంబరు 6, 11 తేదీల్లో రెండు విడతల్లో జరిగిన అసెంబ్లీ పోల్స్‌లో తిరుగులేని మెజారిటీతో ఎన్‌డీఏ కూటమి విజయఢంకా మోగించింది. మొత్తం 243 స్థానాలకుగానూ 202 సీట్లను ఎన్‌డీఏ కైవసం చేసుకుంది. ఎన్నికల్లో నమోదైన మొత్తం ఓట్లలో 47.2 శాతం ఎన్‌డీఏకు, 37.3 శాతం ఓట్లు ఇండియా కూటమికి పడ్డాయి. ఈ 10 శాతం ఓట్ల తేడా వల్లే ఎన్‌డీఏకు ఏకపక్ష విజయం దక్కింది. జేడీయూ అధినేత నీతీశ్ కుమార్ పదోసారి బిహార్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి రికార్డు సృష్టించారు. బీజేపీకి చెందిన సామ్రాట్ చౌదరి, విజయ్ కుమార్ సిన్హాలను ఉప ముఖ్యమంత్రులుగా చేశారు.

### లాలూ కుటుంబంలో చీలిక :

### తేజ్ ప్రతాప్, రోహిణి ఆచార్య దూరం



ఈ ఏడాది ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబం ప్రముఖంగా జాతీయ స్థాయిలో వార్తల్లో నిలిచింది. బిహార్ రాజకీయాల నుంచి లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబాన్ని వేరుచేసి చూడలేం. 1990 నుంచి 2005 వరకు ఆ రాష్ట్రంలో లాలూ హవా నడిచింది. 1990లో తొలిసారిగా లాలూ బిహార్ సీఎం అయ్యారు. 1997 నుంచి 2005 వరకు బిహార్ సీఎంగా లాలూ సతీమణి రాబ్రీదేవి వ్యవహరించారు. 2015 నుంచి 2017 మధ్యకాలంలో రాష్ట్రంలోని సంకీర్ణ ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా లాలూ చిన్న కుమారుడు తేజస్వి యాదవ్ వ్యవహరించాడు. కానీ పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్ మంత్రి పదవికి పరిమితం అయ్యారు. దీంతో తనకు తండ్రి తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదనే అభిప్రాయానికి ఆనాడే తేజ్ ప్రతాప్ యాదవ్ వచ్చారు. 20222024 మధ్య కాలంలో సంకీర్ణ ప్రభుత్వంలో మరోసారి తేజస్వి యాదవ్ డిప్యూటీ సీఎం అయ్యారు. కానీ తేజ్ ప్రతాప్‌కు ఎలాంటి పదవీ దక్కలేదు. ఈ పరిణామంతో లాలూ కుమారుల మధ్య గ్యాప్ మరింత పెరిగింది.

### పెళ్లి తర్వాత మారిన తేజ్ ప్రతాప్ సీన్



రాజకీయంగా తీసుకునే ప్రతి నిర్ణయం వెనుక ఒక బలమైన కారణం ఉంటుంది. 2022–2024 మధ్యకాలం లో తేజ్ ప్రతాప్‌కు కనీసం మంత్రి పదవి కూడా దక్కకపో వడానికి కూడా ఒక కారణం ఉంది. ఆ వివరాల్లోకి వెళితే, 2018 సంవత్సరం మే2న బిహార్ మాజీ సీఎం దరోగాప్రసాద్ రాయ్ మనవరాలు ఐశ్వర్యా రాయ్‌తో లాలూ పెద్ద కొడుకు తేజ్ ప్రతాప్‌కు వివాహం జరిగింది. అయితే తనకు భార్య నుంచి విడాకులు ఇప్పించాలంటూ పాట్నా ఫ్యామిలీ కోర్టును 2018 నవంబరు మొదటివారంలో తేజ్ ప్రతాప్ ఆశ్రయించారు. రాజకీయ ప్రయోజనం కోసం తనకు బలవంతంగా ఈ పెళ్లి చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.
ఆ సంబంధం వద్దని పదేపదే చెప్పినా తల్లిదండ్రులు వినలేదని వాపోయారు. దీంతో తనపై తేజ్ ప్రతాప్ దాడి చేశాడని, డ్రగ్స్ తీసుకోమని చెప్పేవాడని, క్రాస్ డ్రెస్సింగ్ చేయమనే వాడు అంటూ ఐశ్వర్యా రాయ్ కూడా కేసు పెట్టింది. ఈ విడాకుల పిటిషన్ ప్రస్తుతం ఫ్యామిలీ కోర్టులో పెండింగ్‌లోనే ఉంది. పెళ్లి చేసిన ఆరు నెలల్లోనే పెద్ద కొడుకు ఇలా చేయడం లాలూకు ఆగ్రహాన్ని తెప్పించింది. ఈ కారణం వల్లే 20222024 మధ్య కాలంలో సంకీర్ణ ప్రభుత్వంలో తేజ్ ప్రతాప్‌కు కనీసం మంత్రి పదవిని లాలూ కేటాయించలేదన్న ప్రచారం జరిగింది. దీంతో అప్పటి నుంటి లాలూ ఫ్యామిలీలో తేజ్ ప్రతాప్ ఒకవైపు, మిగతా కుటుంబ సభ్యులు మరోవైపు అన్న చందంగా మారింది. 2025లో వీరి మధ్య వివాదాలు ఒక్కసారిగా బయటకు వచ్చాయి. 2025 మే నెలలో తేజ్ ప్రతాప్ యాదవ్ సోషల్ మీడియాలో సంచలన పోస్ట్‌లు పెట్టారు. అనుష్క యాదవ్ అనే మహిళను రెండో వివాహం చేసుకున్నానని ప్రకటించారు. ఇది తెలుసుకున్న లాలూ అగ్గిమీద గుగ్గిలం అయ్యారు. ఆర్‌జేడీ నుంచి, సొంతింటి నుంచి పెద్ద కొడుకును ఆరేళ్ల పాటు బహిష్కరించారు. ఇది రాష్ట్రంతో పాటు జాతీయ రాజకీయాల్లో సంచలనమైంది.

### ఆర్‌జేడీకి లాలూ కుమార్తె గుడ్‌బై



లాలూ కుమార్తె రోహిణి ఆచార్య కాడా ఈ ఏడాది రాజకీయ సంచలనానికి కారణమైంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్జేడీ ఓటమి తర్వాతా 2025 నవంబర్ 15న సోషల్ మీడియా వేదికగా ఆమె ప్రకటన చేశారు. తాను రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు, తన కుటుంబాన్ని వదులుకుంటున్నట్లు వెల్లడించారు. తేజస్వీ యాదవ్ సన్నిహితులు, పార్టీ కీలక నేతలైన సంజయ్ యాదవ్ (రాజ్యసభ ఎంపీ), రమీజ్ తనను అవమానించారని ఆమె ఆరోపించారు. పార్టీ ఓటమికి తననే బాధ్యురాలిని చేస్తూ వారు తనను రాజకీయాల నుంచి తప్పుకోమన్నారని తెలిపారు. రోహిణి నిర్ణయం వెలువడిన 24 గంటల్లోనే, ఆమెకు మద్దతుగా లాలూ మరో ముగ్గురు కుమార్తెలు (రాజలక్ష్మి, రాగిణి, చందా) కూడా పాట్నాలోని తమ తల్లిదండ్రుల నివాసాన్ని వదిలి ఢిల్లీకి వెళ్లిపోయారు. లాలూ పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్ తన సోదరి రోహిణికి మద్దతు ప్రకటించారు. సంజయ్ యాదవ్ లాంటి బయటి వ్యక్తుల వల్ల తన కుటుంబం నాశనమవుతోందని ఆయన విమర్శించారు. ప్రస్తుతం లాలూ కుటుంబం రాజకీయంగా రెండు వర్గాలుగా చీలిపోయింది. ఒకవైపు తేజస్వి యాదవ్, మరోవైపు రోహిణి, తేజ్ ప్రతాప్, మిగిలిన సోదరీమణులు ఉన్నారు.

### ఉప రాష్ట్రపతి పదవి : జగదీప్ ధన్‌ఖడ్ అనూహ్య రాజీనామా



జగదీప్ ధన్‌ఖడ్ ఉప రాష్ట్రపతి పదవికి అకస్మాత్తుగా రాజీనామా చేయడం అనేది ఈ ఏడాది సంచలన అంశం. 2022 సంవత్సరం ఆగస్టు 11న ఉప రాష్ట్రపతి పదవిని చేపట్టిన ఆయన 2025 జులై 21న రాజీనామా చేశారు. ఉప రాష్ట్రపతి కాకముందు బీజేపీలో సీనియర్ నేతగా జగదీప్ ధన్‌ఖడ్ మంచిపేరు తెచ్చుకున్నారు. ఆయన 2003 సంవత్సరం నుంచి బీజేపీలో వివిధ హోదాల్లో సేవలు అందిస్తున్నారు. పార్టీ వ్యవహారాలు, సిద్ధాంతాలపై ఆయనకు పూర్తి పట్టు, అవగాహన ఉన్నాయి. సాధారణంగా ఉప రాష్ట్రపతి పదవిని చేపట్టే వారు ఐదేళ్ల పాటు అందులో కొనసాగుతారు. కానీ జగదీప్ ధన్‌ఖర్ మూడేళ్లకే ఎందుకు రాజీనామా చేశారు అనేది పెద్ద ప్రశ్న. తన ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని, వైద్యుల సలహా మేరకు పదవి నుంచి తప్పుకుంటున్నట్లు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు పంపిన రాజీనామా లేఖలో జగదీప్ ధన్‌ఖడ్ పేర్కొన్నారు.

**జగ్‌దీప్ ధన్‌ఖడ్ రాజీనామా వెనుక :** అధికారికంగా ఆరోగ్య కారణాలను జగదీప్ ధన్‌ఖడ్ చెప్పినప్పటికీ, రాజీనామా వెనుక ఇతరత్రా కారణాలు ఉన్నాయనే చర్చ రాజకీయ వర్గాల్లో జరిగింది. జస్టిస్ యశ్వంత్ వర్మను తొలగించాలని 63 మంది ప్రతిపక్ష ఎంపీలు ఇచ్చిన నోటీసును రాజ్యసభ ఛైర్మన్ హోదాలో జగదీప్ ధన్‌ఖడ్ ఆమోదించారు. ఈ నిర్ణయం కేంద్ర ప్రభుత్వ పెద్దలకు నచ్చలేదనే కథనాలు వచ్చాయి. కొన్ని సందర్భాల్లో ఆయన తీసుకున్న పలు నిర్ణయాల వల్ల, కేంద్ర ప్రభుత్వంతో గ్యాప్ పెరిగిందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. రాజ్యసభ ఛైర్మన్‌గా ధన్‌ఖర్ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ ప్రతిపక్షాలు గతంలో ఆయనపై అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టాయి.
కొత్త ఉప రాష్ట్రపతి ఎన్నిక: జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాతో 2025 సెప్టెంబరులో ఉప రాష్ట్రపతి ఎన్నిక నిర్వహించారు. సీపీ రాధాకృష్ణన్ 2025 సెప్టెంబరు 12న భారత కొత్త ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు స్వీకరించారు.

**ఘ.న.దీలీఊ – 94407 40015**

# మంధాన 10కే మైలురాయి




తిరువనంతపురంలోని గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ స్టేడియంలో శ్రీలంకతో జరిగిన ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో నాలుగో టీ20లో భారత మహిళల జట్టు శ్రీలంకను ఓడించి, 30 పరుగుల తేడాతో విజయం సాధించి సిరీస్‌లో 4-0 ఆధిక్యాన్ని సాధించింది. భారత ఓపెనర్లు స్మృతి మంధాన (80) మరియు షఫాలీ వర్మ (79) బ్యాటింగ్‌లో రాణించగా, అరుంధతి రెడ్డి మరియు వైష్ణవి శర్మ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. భారత ఓపెనర్ స్మృతి మంధాన అంతర్జాతీయ క్రికెట్‌లో తన అద్భుతమైన ప్రదర్శనను కొనసాగిస్తోంది. భారత అగ్రశ్రేణి బ్యాటర్ తిరువనంతపురంలోని గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో ఒక కీలక మైలురాయిని సాధించింది. భారత్ ఇప్పటికే సిరీస్‌లో 4-0 ఆధిక్యంలో ఉంది మరియు డిసెంబర్ 30న జరగనున్న సిరీస్‌లోని చివరి మ్యాచ్‌లో పర్యాటక జట్టుపై క్లీన్ స్వీప్ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. 10,000 పరుగులు చేసిన అత్యంత వేగవంతమైన బ్యాటర్‌గా మంధాన నిలిచింది ఆతిథ్య జట్టు మొదట బ్యాటింగ్ చేసిన తర్వాత, ఇన్నింగ్స్ ఏడవ ఓవర్‌లో భారత ఓపెనర్ ఈ మైలురాయిని చేరుకుంది. ఈ మ్యాచ్‌కు ముందు, మంధాన అన్ని ఫార్మాట్లలో 280 అంతర్జాతీయ మ్యాచ్‌లలో 9,973 పరుగులు చేసింది మరియు ఈ మైలురాయిని చేరుకోవడానికి ఆమెకు 27 పరుగులు అవసరం. ఆమె కేవలం 20 బంతుల్లోనే ఈ ఘనతను సాధించి, 48 బంతుల్లో 80 పరుగుల అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడింది, క్రీజులో ఉన్న సమయంలో 11 ఫోర్లు మరియు మూడు సిక్సర్లు బాదింది. ముఖ్యంగా, ఆమె 281 ఇన్నింగ్స్‌లలో ఈ ఘనతను సాధించి, 291 ఇన్నింగ్స్‌లలో ఈ మైలురాయిని చేరుకున్న మిథాలీ రికార్డును అధిగమించింది. మహిళల క్రికెట్‌లో 10,000 పరుగులు చేసిన మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ తర్వాత, మంధాన ఇప్పుడు రెండవ భారత బ్యాటర్‌గా నిలిచింది. అలాగే, మిథాలీ, సూజీ బేట్స్ (10,652), మరియు షార్లెట్ ఎడ్వర్డ్స్ (10,273) తర్వాత 10కే క్లబ్‌లో చేరిన ప్రపంచవ్యాప్తంగా నాల్గవ బ్యాటర్‌గా ఆమె నిలిచింది. మిథాలీ తన కెరీర్‌లో 699 టెస్ట్ పరుగులు, 7805 వన్డే పరుగులు మరియు 2364 టీ20 పరుగులు చేసింది. న్యూజిలాండ్‌కు చెందిన సూజీ బేట్స్ ఇప్పటివరకు 5936 వన్డే పరుగులు మరియు 4716 టీ20 పరుగులు సాధించింది. ఇంగ్లాండ్‌కు చెందిన షార్లెట్ ఎడ్వర్డ్స్ 1676 టెస్ట్ పరుగులు, 5992 వన్డే పరుగులు మరియు 2605 టీ20 అంతర్జాతీయ పరుగులు సాధించింది.

అలాగే, ఆమె మహిళల టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లలో అత్యధిక సిక్సర్లు కొట్టిన భారత బ్యాటర్‌గా నిలిచింది. ఈ ఫార్మాట్‌లో 80 సిక్సర్లతో, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ సాధించిన 78 సిక్సర్ల రికార్డును అధిగమించింది. మహిళల క్రికెట్‌లో అత్యధిక అంతర్జాతీయ పరుగులు

10868 - మిథాలీ రాజ్ (భారత్)
10652 - సూజీ బేట్స్ (న్యూజిలాండ్)
10273 - షార్లెట్ ఎడ్వర్డ్స్ (ఇంగ్లాండ్)
10053 - స్మృతి మంధాన (భారత్)

రెండు జట్లకు అత్యధిక టీ20 అంతర్జాతీయ స్కోరు

తిరువనంతపురంలో పరుగుల వరద పారింది, రెండు జట్లు తమ ఇన్నింగ్స్‌లో 200కు పైగా పరుగులు సాధించాయి. మొదట బ్యాటింగ్ చేసిన భారత్, టాప్ ఆర్డర్ ఆటగాళ్ల సహకారంతో 221/2 భారీ స్కోరును నమోదు చేసింది. ఓపెనర్లు మంధాన (80) మరియు షఫాలీ (79) భారత జట్టుకు పటిష్టమైన పునాది వేయగా, రిచా ఘోష్ కేవలం 16 బంతుల్లోనే అజేయంగా 40 పరుగులు చేసి ఆ ఊపును కొనసాగించింది. ఈ సందర్భంగా, భారత్ మహిళల టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లలో తమ అత్యధిక స్కోరును నమోదు చేసింది, ముంబైలోని డీవై పాటిల్ స్టేడియంలో వెస్టిండీస్‌పై సాధించిన 217/4 పాత రికార్డును అధిగమించింది. మహిళల టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లలో భారత జట్టు 200కు పైగా స్కోర్లు 221/2 వర్సెస్ శ్రీలంక, తిరువనంతపురం, 2025,217/4 వర్సెస్ వెస్టిండీస్, డీవై పాటిల్, 2024,210/5 వర్సెస్ ఇంగ్లాండ్, ట్రెంట్ బ్రిడ్జ్, 2025,201/5 వర్సెస్ యూఏఈ, దంబుల్లా, 2024శ్రీలంక ఈ మ్యాచ్‌లో ఓడిపోయినప్పటికీ, వారు కూడా ఈ ఫార్మాట్‌లో తమ అత్యధిక స్కోరును నమోదు చేశారు. స్కోరుబోర్డుపై 191/6 పరుగులు నమోదు చేసి, శ్రీలంక మహిళల క్రికెట్‌లో తమ అత్యధిక స్కోరును నమోదు చేసింది, గత సంవత్సరం దంబుల్లాలో మలేషియాపై సాధించిన 184/4 పాత రికార్డును అధిగమించింది.

# మంగళూరు కంబళలో కొత్త రికార్డు

దక్షిణ కన్నడ జిల్లాలోని మంగళూరు, బంగ్రా కూలూరులోని గోల్డ్‌ఫించ్ సిటీలో జరిగిన రామ-లక్ష్మణ జోడు కరే కంబళలో, కర్ణాటక తీరప్రాంత జానపద క్రీడ అయిన కంబళలో కొత్త రికార్డు సృష్టించబడింది. కంబళలో మెరుపు వేగంతో పరుగెత్తేవాడిగా ప్రసిద్ధి చెందిన శ్రీనివాస గౌడ రికార్డును మస్తికట్టే స్వరూప్ బద్దలు కొట్టాడు. శనివారం ప్రారంభమైన మంగళూరు కంబళ ఆదివారం ముగిసింది. కంబళ పోటీల సీనియర్ విభాగం ఫైనల్ పోటీలో, బడగబెట్టు సందీప్ శెట్టికి చెందిన దున్నపోతులు 125 మీటర్ల పొడవున్న కంబళ ట్రాక్‌ను కేవలం 10.87 సెకన్లలో పూర్తి చేసి కొత్త రికార్డు సృష్టించాయి. ఈ రికార్డును 100 మీటర్లకు పరిగణనలోకి తీసుకుంటే 8.69 సెకన్లుగా నమోదైంది. గాంధీ మైదాన్ సంతు మరియు సూరత్కల్ పంచ అనే దున్నపోతులు ఈ రికార్డును నెలకొల్పాయి. ఈ దున్నపోతులను పరుగెత్తించిన మస్తికట్టే స్వరూప్‌ను కంబళ కమిటీ సన్మానించింది. సంవత్సరాల క్రితం మంగళూరులో జరిగిన కంబళలో శ్రీనివాస గౌడ 100 మీటర్లను 8.78 సెకన్లలో పూర్తి చేసి రికార్డు సృష్టించాడు. ఇప్పుడు మస్తికట్టే స్వరూప్ మంగళూరు కంబళ ఫైనల్‌లో 100 మీటర్లను 8.69 సెకన్లలో పూర్తి చేసి ఆ రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. గత మూడేళ్లుగా నేను కంబళ దున్నపోతులను పరుగెత్తిస్తున్నాను. గతంలో జూనియర్ విభాగంలో పాల్గొనేవాడిని. ఈ సంవత్సరం మొదటిసారిగా సీనియర్ విభాగంలో పరుగెత్తాను. సీనియర్ విభాగంలో 3 కంబళలలో పాల్గొన్నాను. ఇప్పుడు ఈ కొత్త రికార్డును సృష్టించాను. ఇది ఊహించని విజయం, అని రికార్డు బద్దలు కొట్టిన తర్వాత స్వరూప్ ఆనందం వ్యక్తం చేశాడు. దున్నపోతుల యజమాని సందీప్ శెట్టి మాట్లాడుతూ, స్వరూప్ చాలా తెలివైన యువకుడని అన్నారు. గతంలో ఇదే కంబళలో తాడు విభాగంలో ఈ దున్నపోతులు రెండో స్థానంలో నిలిచాయి. గత సంవత్సరం వరకు స్వరూప్ జూనియర్ విభాగంలో పాల్గొనేవాడు. ఈ సంవత్సరం సీనియర్ విభాగంలో పాల్గొన్నాడు. చాలా తెలివైన యువకుడు. ఈ రికార్డుకు నా దున్నపోతులు మరియు స్వరూప్ ఇద్దరూ కారణం. ఈ రికార్డు ఊహించనిది, అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా కంబళ కమిటీ చైర్మన్ దేవిప్రసాద్ శెట్టి తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. తమ యజమానులు శిక్షణ ఇచ్చిన విధంగా కంబళా దున్నపోతులు ఎలా పరుగెత్తగలవో ఇది చూపిస్తుంది. పోటీలో గెలవడానికి అవసరమైన తెలివితేటలు వాటికి ఉన్నాయి. గతంలో శ్రీనివాస గౌడ ఒక అద్భుతమైన ఘనత సాధించగా, ఇప్పుడు స్వరూప్ ఆ రికార్డును బద్దలు కొట్టాడు. అతను 100 మీటర్ల దూరాన్ని 8.69 సెకన్లలో పరుగెత్తి ఒక రికార్డు సృష్టించాడు. దీనితో కంబళా చరిత్రలో సరికొత్త లిఖించబడింది.





# అల్జీరియా నాకౌట్‌కు అర్హత



ఆదివారం అల్జీరియా, రబాత్‌లో జరిగిన రియాద్ మహ్రెజ్ పెనాల్టీ ద్వారా బుర్కినా ఫాసోను 1-0 తేడాతో ఓడించి ఆఫ్రికా కప్ ఆఫ్ నేషన్స్‌లో నాకౌట్ దశకు అర్హత సాధించిన మూడవ దేశంగా ఈజిప్ట్ మరియు నైజీరియా తర్వాత నిలిచింది. మర్రకేష్‌తో జరిగిన ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లో కామెరూన్‌తో 1-1తో డ్రా చేసుకున్న డిఫెండింగ్ ఛాంపియన్స్ ఐవరీ కోస్ట్ ఈ ముగ్గురితో చేరలేకపోయింది. మరోచోట, మొజాంబిక్ 3-2 తేడాతో గాబన్‌ను ఓడించి తొలి ఆఫ్కాన్ విజయం కోసం 39-నిరీక్షణను ముగించగా, కాసాబ్లాంకాలో ఈక్వటోరియల్ గినియాను 1-0 తేడాతో ఓడించి సుడాన్ చివరి-16 స్థానానికి తిరిగి పోటీలోకి వచ్చింది. కెప్టెన్ మహ్రెజ్ మొదటి అర్ధభాగం మధ్యలో స్పాట్ నుండి గోల్ చేశాడు మరియు అల్జీరియా ఆ తర్వాత దృఢంగా నిలిచిన బుర్కినాబే జట్టుపై కఠినమైన పోటీని గెలుచుకుంది. మాంచెస్టర్ సిటీకి చెందిన రాయన్ ఐట్-నౌరిని ఓడించినప్పుడు ఆటను నిర్ణయించిన పెనాల్టీ లభించింది. సుడాన్‌పై ప్రారంభ 3-0 తేడాతో ఓటమిలో తన బ్రేస్‌ను అనుసరించి, ఈ ఆఫ్కాన్ లో తన గోల్స్ సంఖ్యను మూడు గోల్స్‌కు తీసుకెళ్లిన మహ్రెజ్ తన 23వ నిమిషంలో ఎటువంటి తప్పు చేయలేదు. లీసెస్టర్ సిటీ మరియు మాంచెస్టర్ సిటీ మాజీ వింగర్ ఇప్పుడు టోర్నమెంట్‌లో తొమ్మిది గోల్స్ సాధించాడు, ఇది అల్జీరియన్ రికార్డు. 1990 మరియు 2019లో ఆఫ్రికన్ ఛాంపియన్‌లైన అల్జీరియా, గ్రూప్ లో రెండు ఆటల తర్వాత గరిష్టంగా ఆరు పాయింట్లను కలిగి ఉంది మరియు ఇంకా ఒక్క గోల్ కూడా ఇవ్వలేదు, వ్లాదిమిర్ పెట్కోవిక్ జట్టు ప్రీ-టోర్నమెంట్ ఫేవరెట్‌లలో ఒకటిగా వారి బిల్లింగ్‌కు అనుగుణంగా ఉంది. ఫ్రాన్స్ లెజెండ్ జినెడిన్ జిదానే తన కుమారుడు లూకా డెజర్ట్ ఫాక్స్ తరపున గోల్ చేయడం చూడటానికి 18,522 మంది ప్రేక్షకులలో ఉన్నాడు - అతను సుడాన్‌పై విజయంలో కూడా ఉన్నాడు. మేము చాలా కఠినమైన మ్యాచ్‌ను ఆశించాము. మేము చాలా కష్టపడి పోరాడాము మరియు అతి ముఖ్యమైన విషయం ఏమిటంటే మేము ఆట గెలిచాము. ఇప్పుడు మేము అర్హత సాధించాము మరియు అదే ప్రధాన లక్ష్యం అని అల్జీరియా ఫార్వర్డ్ ఇబ్రహీం మాజా, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అన్నారు. వారు చాలా కఠినంగా ఉంటారని మాకు ముందే తెలుసు కానీ మేము దానికి వ్యతిరేకంగా పోరాడాలి, దర్టీగా ఉండాలి, చాలా కష్టపడి టాకిల్ చేయాలి అని చెప్పాము మరియు మేము ఈ రోజు దానిని బాగా చేసాము. సూడాన్‌కు ప్రోత్సాహం సౌల్ కోకో సొంత గోల్‌తో ఈక్వటోరియల్ గినియాపై విజయం సాధించిన తర్వాత, సూడాన్ అదే గ్రూప్ నుండి అర్హత సాధించే అవకాశాలను పెంచుకుంది. దురదృష్టవంతుడైన టొరినో సెంటర్-బ్యాక్ కోకో 74వ నిమిషంలో తన సహచరుడు లూయిస్ అసు ఫ్రీ-కిక్ క్లియర్ చేయడానికి ప్రయత్నించినప్పుడు బంతి అతని నుండి బయటకు వచ్చి నెట్‌లోకి దూసుకెళ్లింది. 1970 ఆఫ్కాన్ కు సుడాన్ ఆతిథ్యం ఇచ్చి గెలిచాడు, కానీ అప్పటి నుండి ఆరు టోర్నమెంట్ ప్రదర్శనలలో 18 మ్యాచ్‌లలో ఇది వారి రెండవ విజయం. ఏప్రిల్ 2023లో సైన్యం మరియు ప్రత్యర్థి పారామిలిటరీ రాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ () మధ్య అంతర్యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి దేశం నాశనమైనప్పటికీ, సుడాన్ మొరాకోలో పోటీ పడుతోంది. గ్రూప్ లో, మాంచెస్టర్ యునైటెడ్ వింగర్ అమద్ డియల్లో ఆఫ్కాన్ డిఫెండింగ్ ఛాంపియన్స్ ఐవరీ కోస్ట్ తరపున కామెరూన్‌తో జరిగిన డ్రాలో గోల్ చేశాడు, దీని వలన వారు అగ్రస్థానాన్ని పంచుకున్నారు. 4 రోజుల క్రితం మొజాంబిక్‌తో జరిగిన మ్యాచ్ విజేతను గుర్తించిన 51 నిమిషాల తర్వాత దయల్లో తన రెండవ ఆఫ్కాన్ గోల్ చేశాడు. కానీ జూనియర్ ట్చామడే నుండి వచ్చిన షాట్ ఫిస్లైన్ కోనన్ నుండి డిఫ్లెక్షన్ తీసుకొని ఐదుసార్లు ఛాంపియన్స్ కామెరూన్‌ను సమం చేయడానికి ముందు ఆధిక్యం ఐదు నిమిషాలు మాత్రమే కొనసాగింది. ఐవరీ కోస్ట్ మరియు కామెరూన్ జట్ల మధ్య నాలుగు పాయింట్లు ఉన్నాయి, మొజాంబిక్ కంటే ఒకటి ఎక్కువ. దక్షిణ తీరప్రాంత నగరం అగాదిర్‌లో జరిగిన ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లో గాబన్‌ను ఓడించడం ద్వారా మొజాంబిక్ తొలి ఆఫ్కాన్ విజయం కోసం చాలా కాలంగా ఎదురుచూసిన ఆటను ముగించింది. 1986లో టోర్నమెంట్‌లో ఆరుసార్లు తొలిసారి ఆడినప్పటి నుండి మాంబాస్ జట్టు నాలుగు డ్రాలు చేసుకుని 12 సార్లు ఓడిపోయింది. ఈరోజు చారిత్రాత్మక రోజు. మేము చాలా ఇబ్బందులు మరియు అడ్డంకులను అధిగమించి ఇక్కడికి చేరుకుని ఎవరూ ఊహించనిది సాధించాము అని మొజాంబిక్ కోచ్ చిక్విన్హో కాండే అన్నారు. మా అత్యంత ఆశావాద అభిమానులు కూడా గాబన్‌పై విజయాన్ని ఊహించి ఉండరు. మొజాంబిక్ ఎప్పుడూ మ్యాచ్ గెలవదని ప్రజలు అన్నారు. జాతీయ జట్టును ఈ విజయానికి నడిపించిన గౌరవం నాకు లభించింది. ఫైసల్ బంగాల్, జెనీ కాటమో మరియు డియోగో కాలిలా గోల్స్ మొజాంబికన్స్ తరపున సీసా పోరాటాన్ని గెలిచాయి, వారు హాఫ్ టైం నాటికి 2-1 ఆధిక్యంలో ఉన్నారు.

## ప్రపంచ రాపిడ్ చెస్ ఛాంపియన్ షిప్‌లో తెలుగుతేజాలు

● కోనేరు హంపి, అర్జున్ అద్భుత ప్రదర్శన ● మహిళల విభాగంలో హంపీ కాంస్య పతకం ● ప్రశంసలు కురిపించిన తెలుగురాష్ట్రాల సీఎంలు



ఎఫ్ ఐ డిఈ ప్రపంచ రాపిడ్ చెస్ ఛాంపియన్ షిప్‌లో కోనేరు హంపి, అర్జున్ అద్భుత ప్రదర్శన కనబర్చారు. మహిళల విభాగంలో హంపీ కాంస్య పతకం సాధించారు. మరోవైపు ఓపెన్ విభాగంలో అర్జున్ సైతం కాంస్యం గెలుచుకున్నారు. దీంతో సీఎం రేవంత్ రెడ్డి ఎక్స్ వేదికగా కోనేరు హంపి, అర్జున్‌ను ప్రశంసించారు. అసాధారణ నైపుణ్యం, పట్టుదల, పోటీతత్వం ప్రదర్శిస్తూ అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్ లో దేశానికి, తెలంగాణకు గర్వకారణంగా నలిచారంటూ ప్రశంసించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. మరోవైపు ఏపీ సీఎం చంద్రబాబు సైతం హంపీ, అర్జున్ లను ప్రశంసించారు. ఒక్క ఫలితంతో ఛాంపియన్లను అంచనా వేయలేమని పేర్కొన్నారు. అత్యున్నత స్థాయిలో పదేపదే పోటీపడే ధైర్యమే వారిని నిలబెడుతుందని తెలిపారు. ప్రపంచ వేదికపై కాంస్యం సాధించడం మీ నైపుణ్యానికి నిదర్శనం ప్రశంసించారు. మీ ప్రయాణం నిలకడ దేశంలోని లక్షలాది మందికి స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. పురుషుల్లో విశ్వనాథన్ ఆనంద్ తరవాత ఈ ఘనత సాధించిన ఏకైక భారత క్రీడాకారుడిగా అర్జున్ నిలిచాడన్నారు.

# కనిష్క్‌కు వరల్డ్ కప్ పిలుపు



రాబోయే అండర్-19 ప్రపంచ కప్ 2026 మరియు దక్షిణాఫ్రికా పర్యటన కోసం హర్యానాకు చెందిన యువ క్రికెటర్ కనిష్క్ చౌహాన్‌ను భారత జట్టుకు ఎంపిక చేయడం, అలాగే ఐపీఎల్ వేలంలో అతడిని కొనుగోలు చేయడంతో ఇక్కడ అతని స్వస్థలంలో సంబరాలు వెల్లువెత్తాయి. కుడిచేతి వాటం బ్యాట్స్‌మన్ మరియు ఆఫ్-బ్రేక్ స్పిన్ బౌలర్ అయిన ఆల్‌రౌండర్ చౌహాన్‌ను శనివారం, జనవరి-ఫిబ్రవరి 2026లో జింబాబ్వే మరియు నమీబియాలో జరగనున్న అండర్-19 ప్రపంచ కప్ కోసం 15 మంది సభ్యుల జట్టులో చేర్చారు. జనవరి 3, 5 మరియు 7 తేదీలలో దక్షిణాఫ్రికాలో జరగనున్న మూడు వన్డే మ్యాచ్‌ల కోసం భారత జట్టులో కూడా చౌహాన్ చోటు సంపాదించాడు. స్థానిక యువకుడి ఎంపికతో ఝజ్జర్ మరియు సిర్సాలో పండుగ వాతావరణం నెలకొంది, ఇక్కడే చౌహాన్ పెరిగాడు మరియు రాష్ట్ర స్థాయి క్రికెట్ ఆడాడు. చౌహాన్ ప్రస్తుతం సిర్సాలో నివసిస్తున్నాడు మరియు షా సత్నామ్ బాయ్స్ కళాశాలలో బి.ఎ. రెండవ సంవత్సరం చదువుతున్నాడు. అతను చాలా సంవత్సరాలుగా స్థానిక స్టేడియంలో సాధన చేస్తున్నాడు. అతని శిక్షణకు సౌకర్యంగా ఉండటానికి అతని కుటుంబం మొదట్లో సిర్సాకు వలస వెళ్లింది, కానీ తర్వాత ఝజ్జర్‌కు తిరిగి వచ్చింది. డిసెంబర్ 16న అబుదాబిలో జరిగిన ఐపీఎల్ 2026 మినీ-వేలంలో, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సిబి) చౌహాన్‌ను అతని కనీస ధర రూ. 30 లక్షలకు కొనుగోలు చేసింది. ఐపీఎల్ వేలం మరియు అండర్-19 ప్రపంచ కప్, దక్షిణాఫ్రికా పర్యటన జట్టుకు ఎంపికైన తర్వాత, సిర్సాకు తిరిగి వచ్చిన చౌహాన్‌కు ఘన స్వాగతం పలికారు. చౌహాన్ తండ్రి ప్రదీప్ కుమార్ ఒక రైతు, మరియు అతని తల్లి సరిత గృహిణి. చౌహాన్ సెప్టెంబర్ 26, 2006న జన్మించాడు. అతను కుటుంబంలో ఏకైక కుమారుడు. కనిష్క్ చిన్న వయస్సు నుండే క్రికెట్‌పై ఆసక్తి చూపించాడు. నాలుగేళ్ల వయసులో ఘజియాబాద్‌లోని ఒక క్రికెట్ అకాడమీలో చేరాడు. ఎనిమిదేళ్ల వయసులో కనిష్క్ సిర్సాలో ట్రయల్స్ ఇచ్చాడు. తమ కుమారుడి శిక్షణకు మద్దతుగా, ఆ కుటుంబం 2014లో ఝజ్జర్ నుండి సిర్సాకు వలస వెళ్లింది. చౌహాన్ షా సత్నామ్ స్టేడియంలో క్రికెట్ ఆడటం ప్రారంభించాడు. సుమారు 15 సంవత్సరాల అంకితభావం తర్వాత, 2024లో అండర్-19 జట్టుకు ఎంపికైనప్పుడు అతనికి అంతర్జాతీయ మ్యాచ్ ఆడే మొదటి అవకాశం లభించింది మరియు ఇంగ్లాండ్‌పై తన అరంగేట్రం చేశాడు. చౌహాన్ ఇంగ్లాండ్‌లో 5 వన్డే మ్యాచ్‌లు ఆడి, 8 వికెట్లు తీసి 114 పరుగులు చేశాడు. ఈ ప్రదర్శనకు గాను, అతను సిరీస్ ఉత్తమ ఆల్-రౌండర్ అవార్డును కూడా అందుకున్నాడు. ఇంగ్లాండ్‌లో తన మొదటి పర్యటనలో చూపిన ప్రదర్శన ఆధారంగా, చౌహాన్‌ను ఆస్ట్రేలియా పర్యటనకు ఎంపిక చేశారు. ఆ తర్వాత అతను ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన ఛాలెంజర్ ట్రోఫీలో ఆడాడు. ఈ మ్యాచ్‌లలో అతని ప్రదర్శన అండర్-19 ఆసియా కప్ జట్టుకు ఎంపిక కావడానికి దారితీసింది. అండర్-19 ఆసియా కప్ లీగ్ మ్యాచ్‌లలో పాకిస్తాన్‌పై చౌహాన్ అద్భుతమైన ఆల్-రౌండ్ ప్రదర్శన కనబరిచాడు. డిసెంబర్ 14న జరిగిన మ్యాచ్‌లో, అతను 48 పరుగులు చేసి 3 వికెట్లు తీశాడు, ఈ ఆల్-రౌండ్ ప్రదర్శనకు గాను అతనికి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. ఈ ప్రదర్శనే ప్రపంచ కప్ జట్టులో అతని ఎంపికకు ఆధారంగా పరిగణించబడుతోంది. మీడియాతో సంభాషణలో, చౌహాన్ సిర్సాలోని షా సత్నామ్ స్టేడియంలో తన కెరీర్‌ను ప్రారంభించానని చెప్పాడు. ఇంగ్లాండ్ మరియు ఆస్ట్రేలియాతో జరిగిన టోర్నమెంట్‌లో తాను బాగా ఆడానని, అయితే అండర్-19 ఆసియా కప్‌లో పాకిస్తాన్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో భారత జట్టు సరిగ్గా ఆడలేదని, దానివల్ల ఫైనల్‌లో ఓడిపోయామని చెప్పాడు. అయితే, ఓటమికి గల కారణాల నుండి పాఠాలు నేర్చుకున్నాము, తదుపరి టోర్నమెంట్‌లో టీమ్ ఇండియా తరపున నేను మరింత మెరుగ్గా రాణిస్తానని ఆశిస్తున్నాను.

# పావని సరయు డబుల్ గోల్డ్



సౌత్‌జోన్ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ స్విమ్మర్ పావని సరయు రెండు స్వర్ణ పతకాలతో మెరిసింది. తెలంగాణ స్విమ్మింగ్ సంఘం ఆధ్వర్యంలో గచ్చౌలి స్టేడియంలో ఈ పోటీలు జరుగుతున్నాయి. రెండో రోజు ఆదివారం మహిళల 200 మీటర్ల వ్యక్తిగత మెడ్లీ విభాగంలో అగ్రస్థానం దక్కించుకున్న పావని సరయు... 400 మీటర్ల వ్యక్తిగత మెడ్లీ విభాగంలోనూ 'టాప్'లో నిలిచింది. బాలికల అండర్ 1517 వయో విభాగం 200 మీటర్ల మెడ్లీ రేసును పావని 2 నిమిషాల 36.86 సెకన్లలో ముగించి పసిడి పతకాన్ని తన ఖాతాలో వేసుకుంది. ఇదే పోటీలో ఆంధ్రప్రదేశ్‌కే చెందిన అవిఘ్న చింతల 2 నిమిషాల 37.69 సెకన్ల టైమింగ్‌తో రజత పతకం దక్కించుకుంది. కర్ణాటక స్విమ్మర్ హితశ్రీ (2 నిమిషాల 41.81 సెకన్లు) కాంస్యం గెలుచుకుంది. బాలికల అండర్ 1517 వయోవిభాగం 400 మీటర్ల వ్యక్తిగత మెడ్లీలో పావని 5 నిమిషాల 39.90 సెకన్లలో గమ్యాన్ని చేరి బంగారు పతకం నెగ్గింది. కర్ణాటక స్విమ్మర్లు హితశ్రీ (5 నిమిషాల 45.81 సెకన్లు), ప్రతీక్ష గౌడ (5 నిమిషాల 46.32 సెకన్లు) రజత, కాంస్యాలు గెలుచుకున్నారు.

సూర్య
# సినిమా

# అల్టిమేట్ మేకింగ్ తో అంచనాలు పెంచేస్తున్న "రాజా సాబ్" ట్రైలర్ 2.ఓ.



రెబల్ స్టార్ ప్రభాస్ నటిస్తున్న ప్రెస్టీజియస్ మూవీ "రాజా సాబ్". ఈ చిత్రాన్ని హారర్ కామెడీ జానర్‌లో ఎవర్ గ్రీన్ మూవీగా నిలిచిపోయేలా తెరకెక్కిస్తున్నారు దర్శకుడు మారుతి. "రాజా సాబ్" సినిమాను భారీ ప్రొడక్షన్ వ్యాల్యూస్‌తో అన్ కాంప్రమైజ్డ్‌గా నిర్మిస్తున్నారు నిర్మాతలు టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ ఈ చిత్రంలో హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. సంక్రాంతి సందడిని రెట్టింపు చేసేందుకు జనవరి 9న "రాజా సాబ్" సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ సినిమా ట్రైలర్ 2.ఓ రిలీజ్ చేశారు. ఎన్నో సర్ ప్రైజింగ్ ఎలిమెంట్స్ ప్యాకేజ్ చేసిన ఈ ట్రైలర్ ప్రేక్షకుల్ని "రాజా సాబ్" ప్రపంచంలోకి తీసుకెళ్లింది. "రాజా సాబ్" ట్రైలర్ 2.ఓ ఎలా ఉందో చూస్తే – గంగమ్మ (జరీనా వాహబ్) ముద్దుల మనవడు రాజా సాబ్ (ప్రభాస్), అన్నీ మర్చిపోయే గంగమ్మ తన భర్త (సంజయ్ దత్)ను మర్చిపోలేక పోతుంది. ఓ మిస్టరీగా మారిన తాతను కలిసే సాహసానికి రాజా సాబ్ సిద్ధమవుతాడు. అడుగు అడుగునా ప్రమాదాలు నిండి ఉన్న మయసభ లాంటి తాత భారీ హవేలీలో అడుగుపెడతాడు రాజాసాబ్. ఆ హవేలీలోకి వెళ్లిన వారిని ఎవరిని ఎలా వేటాడాలో డిజైన్ చేసి పెడతాడు తాత. హిప్టాటిజంతో పాటు దుష్ట శక్తులను శాసించగల తాత.. రాజా సాబ్, అతనితో వచ్చిన వారిని ఎలా ఇబ్బంది పెట్టాడు? తాత సృష్టించిన ప్రమాదాల నుంచి రాజా సాబ్ ఎలా బయటపడ్డాడు? తాను వెళ్లిన మిషన్‌ను రాజా సాబ్ కంప్లీట్ చేసుకున్నాడా? లేదా?, దేవనగర సంస్థ జమీందారిణి గంగాదేవి, సాధారణ మధ్య తరగతి గంగమ్మగా ఎందుకు జీవిస్తోంది? అనే అంశాలతో ట్రైలర్ ఆకట్టుకుంది. రాజాసాబ్‌గా ప్రభాస్ స్టన్నింగ్ పర్ ఫార్మెన్స్ చేశారు. ఆయన కనిపించిన రెండు డిఫరెంట్ మేకోవర్స్ ట్రైలర్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గ్రాండ్ మేకింగ్, సర్ ప్రైజింగ్ రైటింగ్, హై క్వాలిటీ విజువల్ ఎఫెక్ట్స్‌తో అద్భుతమైన రాజా సాబ్ ప్రపంచాన్ని సృష్టించారు డైరెక్టర్ మారుతి. మూవీ మేకింగ్‌లో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అల్టిమేట్ ప్యాషన్ మరోసారి ఈ ట్రైలర్‌తో ప్రూవ్ అవుతోంది.

## సైక్ సిద్ధార్థ చాలా డిఫరెంట్ గా ప్రజెంట్ చేశారు



యంగ్ హీరో శ్రీ నందు తన అప్ కమింగ్ మూవీ ఃసైక్ సిద్ధార్థఃకు రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా బ్యాకింగ్ తో వస్తున్నారు. ఈ చిత్రానికి వరుణ్ రెడ్డి దర్శకత్వం వహించారు. స్పిరిట్ మీడియా, నందునెస్ కీప్ రోలింగ్ పిక్చర్స్ బ&cలపై శ్రీ నందు, శ్యామ్ సుందర్ రెడ్డడి సంయుక్తంగా నిర్మించారు. మాడ్ మాక్స్-స్టైల్ మాడ్‌నెస్‌తో యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన సైక్ సిద్ధార్థలో హై ఎనర్జీ ఎంటర్‌టైన్మె వుండబోతుంది. ఈ చిత్రంలో యామిని భాస్కర్ కథానాయికగా నటించగా, ప్రియాంక రెబెకా శ్రీనివాస్, సాక్షి అత్రీ, మౌనిక కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే విడుదలైన టీజర్ ట్ర కు అద్భైన రెస్పాన్స్ వచ్చింది. జనవరి 1న సైక్ సిద్ధార్థ గ్రగా విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రెస్ మీట్ నిర్వహిం చారు. నిర్మాత డి.సురేష్ బాబు మాట్లాడుతూ.. సినిమాలకి ముఖcంగా చిన్న సినిమాలకి ఆడియన్స్ థియేటర్స్‌కి రావడం తగ్గిపోతుందని తరుచు మాట్లాడు తుంటాం. అయితే కొన్నిసార్లు చిన్న సినిమాలని ఆడియన్స్ చాలా అద్భుతంగా థియేటర్స్ లో ఆదరిస్తున్నారు. రాజు వెడ్స్ రాంబాయి లిటిల్ హార్ట్స్ లాంటి కొన్ని సినిమాల్లో వస్తున్నాయి. అలాగే ఇతర భాషల్లో కూడా చిన్న సినిమాలు అద్భుతాలు చేస్తున్నాయి. చిన్న సినిమాలపై హోప్ అయితే ఉంది. ఈ సినిమాని సపోర్ట్ చేయడానికి కారణం డైరెక్టర్ వరుణ్ సినిమాని చాలా డిఫరెంట్ ప్రజెంట్ చేశాడు. సినిమాని చూసిన వెంటనే తీసుకోమని చెప్పాను. చాలా ఇంట్రెస్ట్‌గా సినిమా తీశారు. సినిమా బాగుంటే ఆడియన్స్ కచ్చితంగా చూస్తున్నారు. అలాగే టికెట్ రేట్స్ కూడా మేము దృష్టిలో పెట్టుకుంటున్నాము.

## ఈషా బ్లాక్‌బస్టర్ విజయం క్రెడిట్ ప్రేక్షకులదే



ఇటీవల లిటిల్‌హార్ట్స్, రాజు వెడ్స్ రాంబాయి వంటి బ్లాక్‌బస్టర్స్ అందించిన బన్నీ వాస్, వంశీ నందిపాటిల సక్సెస్‌ఫుల్ ద్వయం తాజాగా నందిపాటి ఎంటర్ టైన్ మెంట్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్స్ పై 'ఈషా'అనే హారర్ థ్రిల్లర్‌ను అందించారు. ఈ క్రిస్మస్‌కు విడుదలైన ఈ చిత్రం ఈ క్రిస్మస్ విజేతగా నిలిచింది. అఖిల్‌రాజ్ త్రిగుణ్ హీరోలుగా నటిస్తున్న ఈ చిత్రంలో హెబ్బాప టేల్ కథానాయిక. సిరి హనుమంతు, బబ్లూ, పృథ్వీరాజ్ ఇతర ముఖ్య పాత్ర ల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని హెచ్‌వీఆర్ ప్రొడక్షన్స్ పతాకంపై ప్రముఖ నిర్మాత కేవెల్ దామోదర ప్రసాద్ సమర్పణలో హేమ వెంకటేశ్వరరావు ఈ చిత్రాన్ని నిర్మించారు. శ్రీనివాస్ మన్నె దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం బ్లాక్‌బస్టర్ దిశగా దూసుకెళుతోంది. ఈనేపథ్యంలో చిత్ర టీమ్ బ్లాక్‌బస్టర్ మీట్‌ను నిర్వ హించారు. నిర్మాత బన్నీవాస్ మాట్లాడుతూ ఒక సినిమా హిట్ అనడానికి వసూళ్లు ప్రామాణికం, ఈ చిత్రం రెండు తెలుగు రాష్ట్రాల్లో మొదటిరోజు రెండు కోట్ల 20 లక్షలు గ్రాస్‌ను వసూలు చేసింది. చిన్న చిత్రాల్లో ఇది రికార్డు.

## పెద్ది నుంచి అప్పలసూరి పాత్రలో జగపతిబాబు

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం హైలీ యాంటిసిపేటెడ్ రూరల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ పెద్ది షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ చిత్రానికి బుచ్చి బాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. అభివృద్ధి నిమాస్ బ&cపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని గర్వంగా సమర్పిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో, అద్భుతమైన నిర్మాణ విలువలతో రూపొందుతున్న పెద్ది ఒక అద్భుతమైన థియేట్రికల్ ట్రీట్ అనుభూతిని అందించబోతోంది. రామ్ చరణ్ సరసన



జాన్వీకపూర్ కథానాయికగా నటిస్తుండగా, శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, దివేందు శర్మ వంటి నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అప్పలసూరి పాత్రలో జగపతి బాబును పరిచయం చేస్తూ చిత్ర బృందం ఆయన ఫస్ట్-లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో జగపతి బాబు ఇంటెన్స్ అవతార్‌లో కనిపిస్తున్నారు. ఇది సినిమాలోని గ్రామీణ నేపథ్యానికి పర్ఫెక్ట్ యాప్ట్. చెదిరిన సాల్ట్ అండ్ పెప్పర్ జుట్టు మునుపెన్నడూ చూడని అవతార్‌లో కనిపిస్తూ,తన రఫ్ లుక్‌కు మరింత వన్నె తెచ్చారు. దారంతో కట్టిన విరిగిన కళ్లద్దాలు ఆ పాత్ర యొక్క కఠినమైన వcక్తిత్వాన్ని, అప్పలసూరి పాత్ర డెప్త్‌ని ఇంటెన్స్‌గా ప్రజెంట్ చేశాయి. తన పాత్రల విషయంలో ఎంతో సెలెక్టివ్‌గా వcవహరించే సీనియర్ నటుడు బోమన్ ఇరానీ ఈ ప్రాజెక్ట్‌లో కీలక పాత్ర కోసం జాయిన్ అయాcరు. ఇప్పటికే షూటింగ్‌లో పాల్గొన్న ఆయన పాత్ర కథను ముందుకు నడిపించే ప్రధాన శక్తిగా ఉండనుంది.

## న్యూ ఇయర్ సందర్భంగా "సఃకుటుంబానాం"

హెచ్ ఎన్ జి సినిమాస్ ఎల్ ఎల్ పి బ్యానర్ పై ఉదయ్ శర్మ రచన దర్శకత్వంలో మహదేవ్ గౌడ్, నాగరత్న నిర్మాతలుగా ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం సఃకుటుంబానాం. రామ్ కిరణ్, మేఘ ఆకాష్ జంటగా నటిస్తున్న ఈ చిత్రంలో నటకిరీటి రాజేంద్రప్రసాద్, హాస్య బ్రహ్మ బ్రహ్మానందం, శుభలేఖ సుధాకర్, సత్య, రాజశ్రీ నాయర్, రచ్చ రవి, గిరిధర్, తాగుబోతు రమేష్, భద్రం తదితరులు కీలకపాత్రలో పోషిస్తున్నారు. మణిశర్మ ఈ సినిమాకు సంగీతాన్ని అందించగా మధు దాసరి డిఓపిగా పని చేశారు. ఎడిటర్‌గా శశాంక్ మలి చేశారు. ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర ట్రైలర్ కు సోషల్ మీడియా ద్వారా మంచి ప్రశంసలు వచ్చాయి. కొద్ది రోజుల క్రితం ప్రేక్షకుల ముందుకు రానున్న "సఃకుటుంబానాం" చిత్రం కొన్ని అనివార్య కారణాల వల్ల చిత్ర విడుదల వాయిదా పడగా ఇప్పుడు న్యూ ఇయర్ సందర్భంగా 2026 జనవరి 1వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుంది.



## 'పతంగ్'ను థియేటర్‌లో చూసి అందరూ ఎంజాయ్ చేస్తున్నారు - దర్శకుడు ప్రణీత్ పత్తిపాటి

'పతంగ్' చిత్రం విషయంలో నాకు వస్తున్న అభినందనలు చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉంది. ఈ రోజు సినిమాను ప్రేక్షకులు ఇంతలా ఆదరిస్తుంటే నా కష్టానికి తగిన ప్రతిఫలం లభించినట్లు అనిపిస్తుంది అంటున్నాడు దర్శకుడు ప్రణీత్ పత్తిపాటి'. ఆయన దర్శకత్వంలో రూపొందిన చిత్రం పతంగ్. ప్రముఖ నిర్మాత డి.సురేష్ బాబు సమర్పణలో రూపొందిన ఈ చిత్రం సిని మాటిక్ ఎలిమెంట్స్, రిషన్ సినిమాస్, మాన్‌సూన్ టేల్స్ సంస్థలు ప్రతిష్టా త్మకంగా నిర్మించాయి. ఈ స్పోర్ట్స్ డ్రామా ఈ చిత్రానికి విజయ్ శేఖర్ అన్నే, సంపత్ మకా, సురేష్ కొత్తింటి, నాని బండ్రెడ్డి నిర్మాతలు. చిత్రం విడుదలై యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఈ మధ్య కాలంలో చూసిన వన్‌ఆఫ్ బెస్ట్ ఫిలిం అంటూ ప్రేక్షకులు ఈసినిమను అభినం దిస్తున్నారు. ఈ సందర్బంగా చిత్ర దర్శకుడు ప్రణీత్ పత్తిపాటి విలేకరులతో మాట్లాడాడు..



**ఫీడ్‌బ్యాక్ ఎలా ఉంది?**

టాక్‌తో పాటు కలెక్షన్లు రోజు రోజుకు పెరుగుతున్నాయి. యూనివర్సల్‌గా ఈ సినిమాకు హిట్‌టాక్..తో పాటు ఓ మంచిసినిమావ చూశామన్న సంతృప్తిని ఆడి యన్స్ వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ సినిమాను ఎంజాయ్ చేస్తున్నారు. ముఖ్యంగా సినిమా పతాక సన్నివేశాలు ఓ స్టేడియంలో ఓ మ్యాచ్‌ను చూస్తున్న అనుభూతికి లోనవుతున్నారు.

**మీ నేపథ్యం?**

హైదరాబాద్‌లోనే పుట్టి పెరిగాను.. నేను రామానాయుడు ఫిల్మ్ స్కూల్లో డీఎ ఫ్టెక్ చేశాను. పతంగ్ దర్శకుడిగా నాతొలిచిత్రం

**పతంగుల పోటీ నేపథ్యంలో సినిమా తీయడానికి కారణం ఏమిటి?**

ఓ సంక్రాంతి రోజు అనిపించింది. మనం ఫారిన్ నుంచి తీసుకొచ్చిన రగ్బి లాంటి స్టోరీతో సినిమాలు తీశాం కానీ ఇది మన నేటివిటి స్పోర్ట్స్ కదా.. దీని మీద మనం ఎందుకు తీయలేము అని పతంగ్‌ను మొదలుపెట్టాం. సినిమా మొదలు పెట్టిన తరువాత ఎందుకు తీయలేదో అనే విషయం సీజీ వర్క్ అప్పుడు తెలిసింది. సీజీ వర్క్‌కు చాలా సమయం పట్టింది.

**సినిమా విడుదలకు ఆలస్యం కావడానికి కారణం ఏమిటి?**

సీజీ వర్క్‌కు రెండు సంవత్సరాలు పట్టింది. చాలా కష్టమైంది. సినిమా లేట్ అవ్వడానికి పతాక సన్నివేశాల్లో వచ్చే సీజీ వర్కే డిలే కారణం. ఎటువంటి రిఫరెన్స్ లేకపోవడంతో సీజీకి చాల సమయం తీసుకున్నాం. కైట్ ఎగిరేది వర్జినల్‌గా అనిపించేలా వచ్చే వరకు ఎక్కడా కాంప్రమైజ్ కాలేదు.

**మూడు సంవత్సరాల సమయంలో నిర్మాతల సపోర్ట్ మీకు ఎలా ఉంది?**

ఈ సినిమాకు బిగ్గెస్ట్ ప్లస్ మా నిర్మాతలే నేను ఎక్కడైనా రాజీపడ్డ వాళ్లు మాత్రం రాజీపడలేదు. ఎంతో ఖర్చు పెట్టి ఈ సినిమాను క్వాలిటీగా నిర్మించారు. ఈ రోజు సినిమా ఇంత రిచ్‌గా, కలర్‌ఫుల్‌గా కనిపించడానికి వాళ్లు పెట్టిన ఖర్చే కారణం.

# 2025 ఇండస్ట్రీని షేక్ చేసిన టాప్ హీరోలు

**2025 సంవత్సరం ముగింపు దశకు చేరుకుంటున్న వేళ, టాలీవుడ్ స్టార్స్‌కు సంబంధించిన హిట్‌లు, ఫెయిలూcర్స్‌తో సంబంధం లేకుండా అభిమానులు తమ అభిమాన హీరోలపై చూపించే ప్రేమ ఈ ఏడాదిలోనూ స్పష్టంగా కనిపించింది. థియేటర్లలో సినిమాలు చూసే ఉత్సాహంతో పాటు, ఆన్‌లైన్‌లోనూ హీరోల గురించి తెలుసుకోవాలనే ఆసక్తితో గూగుల్ సెర్చ్‌ల సంఖc గణనీయంగా పెరిగింది. ఈ నేపథcంలో 2025లో గూగుల్‌లో అతcధికంగా సెర్చ్ చేయబడిన టాలీవుడ్ సెలబ్రిటీల జాబితా సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.**

ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలిచిన హీరో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్. 2024 చివర్లో విడుదలైన పుష్ప 2 సినిమా ఆయన కెరీర్‌లోనే అత్యంత భారీ విజయాన్ని అందించింది. ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో మాత్రమే కాకుండా, అంతర్జాతీయంగా కూడా సంచలన వసూళ్లు సాధించింది. బాక్సాఫీస్ వద్ద రికార్డులు తిరగరాసిన ఈ మూవీ కారణంగా ఏడాది పొడవునా అల్లు అర్జున్ పేరు గూగుల్‌లో ట్రెండ్‌అవుతూనే ఉంది. టీజర్, ట్రేట్ రిలీజ్‌ల సమయంలో సెర్చ్ వాల్యూమ్ ఒక్కసారిగా పెరగడం గమనార్హం. పుష్ప 2 విజయం మాత్రమే కాకుండా, ఆ సినిమా చుట్టూ ఏర్పడిన వివాదాలు కూడా అల్లు అర్జున్‌ను దేశవాcప్తంగా వార్తల్లో నిలిపాయి. ప్రీమియర్ షో సందర్భంగా జరిగిన



తొక్కిసలా టలో ఓ మహిళ బృతి చెందడం, ఆమె కుమారుడు తీవ్ర అస్వస్థతకు గురికావడం వంటి ఘటనలు సంచలనంగా మారాయి. ఈ ఘటనపై తెలంగాణ ప్రభుత్వం సీరియస్‌గా స్పందించడం, అల్లు అర్జున్‌పై కేసు నమోదు కావడం, తదనంతర పరిణామాల్లో ఆయన ఒక రోజు జైలు జీవితం అనుభవించడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయాcయి. ఈ పరిణామాలన్నూడా గూగుల్ సెర్చ్‌లను మరింత పెంచిన అంశాలుగా నిలిచాయి.

ఇదే సమయంలో అల్లు అర్జున్ నేషనల్ అవార్డు అందుకోవడం ఆయన క్రేజ్‌ను మరో స్థాయికి తీసుకెళ్లింది. అవార్డు అనంతరం ఆయన పేరు దేశవ్యాప్తంగా మరింతగా మార్మోగింది. అంతేకాదు, పుష్ప 2 తర్వాత తమిళ స్టార్ దర్శకుడు అట్లీతో కలిసి అల్లు అర్జున్ పాన్ వరల్డ్ మూవీకి శ్రీకారం చుట్టడం సినీ అభిమానుల్లో భారీ ఆసక్తిని రేపింది. అట్లీ-బన్నీ కాంబినేషన్‌పై ఏర్పడిన అంచనాలు సోషల్ మీడియాలో, గూగుల్ సెర్చ్‌ల్లో స్పష్టంగా కనిపించాయి. దీనితో పాటు దాదాపు ఐదేళ్ల తర్వాత త్రివిక్రమ్‌తో మరో భారీ ప్రాజెక్ట్‌లో భాగం కానున్న ప్రచారం కూడా అల్లు అర్జున్‌ను 2025లో మోస్ట్ సెర్చ్‌డ్ టాలీవుడ్ సెలబ్రిటీగా నిలబెట్టింది.

ఈ లిస్ట్‌లో రెండో స్థానంలో రెబల్ స్టార్ ప్రభాస్ నిలిచారు. సలార్, కల్కి సినిమాల తర్వాత ప్రభాస్ క్రేజ్ మరింత పెరిగింది. 2025లో ఆయనకు సంబంధించిన ది రాజా సాబ్, స్పిరిట్, కన్నప్ప, ఫౌజీ వంటి ప్రాజెక్టులు వరుసగా వార్తల్లో నిలిచాయి. ముఖ్యంగా ఈ



సినిమాల అప్‌డేట్స్, లుక్స్, రిలీజ్ డేట్స్ కోసం అభిమానులు పెద్ద ఎత్తున గూగుల్‌లో సెర్చ్ చేసినట్లు నివేదిక స్పష్టం చేస్తోంది.

ఇక సూపర్ స్టార్ మహేష్ బాబు ఈ లిస్ట్‌లో మూడో స్థానాన్ని నిలిచారు. దర్శకధీరుడు ఎస్.ఎస్.రాజమౌళితో కలిసి నటిస్తున్న తొలి పాన్ వరల్డ్ మూవీ కారణంగా ఆయన పేరు ఈ ఏడాది అంతా వార్తల్లో నిలిచింది. ఈ సినిమా వారణాసి నేపథcంతో తెరకెక్కుతుండటం, ఐమ్యాక్స్ ఫార్మాట్‌లో రూపొందడం, అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మాణం జరగడం, హాలీవుడ్ దిగ్గజం జేమ్స్ కామెరూన్ దృష్టిని ఆకర్షించడం వంటి అంశాలు మహేష్ బాబు క్రేజ్‌ను గణనీయంగా పెంచాయి.





ఇక పవన్ కళ్యాణ్ కూడా ఓజీ సినిమా కారణంగా గూగుల్‌లో ఎక్కువగా సెర్చ్ అయిన హీరోల జాబితాలో చోటు దక్కుకున్నారు. నాలుగో స్థానంలో నిలిచారు. పవన్ కళ్యాణ్ సినిమా అప్‌డేట్స్‌తో పాటు ఆయన రాజకీయ ప్రస్థానం కూడా సెర్చ్‌లకు కారణ మైంది. ఇక ఐదో స్థానంలో జూనియర్ ఎన్టీఆర్ నిలిచారు. ఆర్‌ఆర్ ఆర్ సినిమా ఇచ్చిన ఇమేజ్ కారణంగా వీరిద్దరికీ విదేశాల్లోనూ భారీ ఫాcన్ ఫాలోయింగ్ ఏర్పడింది. అంత ర్జాతీయ ప్రేక్షకులు కూడా ఈ ఇద్దరి గురించి తెలుసుకోవడానికి గూగుల్‌ను ఆశ్రయించినట్లెలుస్తోంది. ముఖ్యంగా ఎన్టీఆర్ వార్2 ప్రాజెక్ట్ కారణంగా 2025లో ఎక్కువగా సెర్చ్ చేయబడిన హీరోగా నిలిచాడు.



PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044